www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 17-6-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 79 | వరంగల్

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం; తిథి: ఏకాదశి పూర్తి; నక్షత్రం: చిత్త మ. 1.59 తదుపరి స్వాతి; వర్జ్యం: రా.7.55-9.39, దుర్ముహూర్తం: మ.12.42-1.34, మ.3.18-4.10; అమృతఘడియలు: ఉ.6.44-8.30, రాహుకాలం: ఉ.7.30-9.00, సూర్యోదయం: 5.44, సూర్యాస్తమయం: 6.47


Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ప్రపంచకప్‌లో నేటి మ్యాచ్‌లు

బంగ్లాదేశ్ x నేపాల్ (ఉ.5. గం.)
శ్రీలంక x నెదర్లాండ్స్ (ఉ.6. గం.)
న్యూజిలాండ్ x పీఎన్‌జీ (రా.8. గం.)

గంభీర్ డిమాండ్‌కు ఓకే

టీమిండియా కొత్త కోచ్‌గా ఖరారు!



న్యూఢిల్లీ: భారత క్రికెట్ జట్టు కోచ్‌గా గౌతం గంభీర్ పేరు దాదాపు ఖరారైనట్టే. ఈ నెల చివర్లో టీ20 వరల్డ్‌కప్ ముగిశాక బీసీసీఐ అతడి పేరును అధికారికంగా ప్రకటించనుందని సమాచారం. అయితే అంతకన్నా ముందు బోర్డు ముందు గంభీర్ ఓ డిమాండ్‌ను పెట్టాడట. కోచ్‌గా తాను బాధ్యతలు తీసుకోవాలంటే సహాయక సిబ్బందిని కూడా తానే ఎంపిక చేసుకుంటానని స్పష్టం చేసినట్టు బోర్డు వర్గాలు పేర్కొన్నాయి. ఇందుకు బీసీసీఐ కూడా సమ్మతించడంతోనే గంభీర్ కోచ్‌గా ఉండేందుకు అంగీకరించాడు.

లవ్లీనాకు రజతం

న్యూఢిల్లీ: భారత స్టార్ బాక్సర్ లవ్లీనా బోర్గోహైన్ చెక్ రిపబ్లిక్ దేశంలో జరిగిన గ్రాండ్ ప్రీ టోర్నీలో పతకం సాధించింది. ఆదివారం జరిగిన 75 కిలోల విభాగం ఫైనల్లో లవ్లీనా 2-3తో లీ కియాన్ (చైనా) చేతిలో ఓడి రజతంతో సరిపెట్టుకుంది.

జాతీయ ఫెన్సింగ్‌లో 3 పతకాలు



సిద్ధార్థ్, రియాన్ష్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ ఫెన్సింగ్ పోటీల్లో తెలుగు క్రీడాకారులు సత్తా చాటారు. కటక్‌లో జరిగిన ఈ పోటీల్లో కాకినాడకు చెందిన శ్రీనాగం ప్రద్యుమ్న జగ్గప్పదొర అండర్-10 సబ్రే విభాగంలో కాంస్యం అందుకున్నాడు. హైదరాబాద్‌కు చెందిన సిద్ధార్థ్, రియాన్ష్ అండర్-10 కేటగిరీ ఫాయిల్‌లో సంయుక్తంగా కాంస్య పతకాలు సాధించారు.

సుమిత్.. రన్నరప్

పెరూగియా (ఇటలీ): వరుసగా రెండో ఏటీపీ చాలెంజర్ టైటిల్ నెగ్గాలన్న భారత టెన్నిస్ స్టార్ సుమిత్ నగల్ ఆశలకు బ్రేక్ పడింది. పెరూగియా చాలెంజర్ ఈవెంట్‌లో సుమిత్‌కు ఫైనల్లో చుక్కెదురైంది. ఆదివారం జరిగిన తుదిపోరులో ఆరోసీడ్ సుమిత్ 1-6, 2-6తో టాప్‌సీడ్ లూసియానో డార్డెరి (ఇటలీ) చేతిలో ఓటమిపాలై రన్నరప్‌తో సరిపెట్టుకున్నాడు. సుమిత్ గతవారం జర్మనీ టోర్నీలో విజేతగా నిలిచిన సంగతి తెలిసిందే.

భజన్‌కు స్వర్ణం

ఒలింపిక్ బెర్త్ ఖరారు

'పారిస్'కు అంకిత కూడా అర్హత



అంటాల్య: ఫైనల్ ఒలింపిక్ క్వాలిఫయర్స్‌లో భారత ఆర్చర్లు భజన్ కౌర్, అంకితా భక్త్ సత్తా చాటారు. మహిళల వ్యక్తిగత రికర్వ్ విభాగంలో భజన్ స్వర్ణ పతకం గెలవడంతో పాటు పారిస్ ఒలింపిక్స్‌కు బెర్త్ ఖాయం చేసుకుంది. ఆదివారం జరిగిన ఫైనల్లో భజన్ 6-2తో టాప్‌సీడ్ మొబినా ఫలా (ఇరాన్)ను చిత్తు చేసి విజేతగా నిలిచింది. ఇక, ఇదే విభాగం క్వార్టర్స్‌లో అంకిత 4-6తో మొబినా చేతిలో ఓడింది. అయితే, క్వార్టర్స్ చేరడంతో అంకితకు కూడా పారిస్ విశ్వక్రీడలకు టికెట్ దక్కింది. ఇక, భారత స్టార్ ఆర్చర్ దీపిక కుమారి తొలి రౌండ్‌లోనే ఓడి నిరాశపర్చింది.

ఆదుకున్న స్టొయినిస్

ఆసీస్ విజయం.. పోరాడిన స్కాట్లాండ్

గ్రాస్ ఐలెట్ (సెయింట్ లూసియా): మార్కస్ స్టొయినిస్ (29 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్సర్లతో 59) మరోసారి ఆపద్బాంధవ పాత్ర పోషించాడు. దీంతో గ్రూప్ 'బి'లో చివరి ఓవర్ వరకు ఆసక్తికరంగా సాగిన టీ20 వరల్డ్‌కప్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 5 వికెట్ల తేడాతో గట్టెక్కింది. ఈ ఓటమితో స్కాట్లాండ్ నిష్క్రమించింది. ముందుగా స్కాట్లాండ్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 180 పరుగులు చేసింది. మెక్‌ముల్లెన్ (60), బెరింగ్టన్ (42 నాటౌట్), మున్సే (35) ధాటిగా ఆడారు. మ్యాక్స్‌వెల్ 2 వికెట్లు తీశాడు. ఛేదనలో ఆసీస్ 19.4 ఓవర్లలో 5 వికెట్లకు 186 రన్స్ చేసి గెలిచింది. 13 ఓవర్ల వరకు మ్యాచ్ స్కాట్లాండ్ ఆధీనంలోనే ఉన్నా ఆ తర్వాత 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' స్టొయినిస్ ధనాధన్ బ్యాటింగ్‌తో ఒత్తిడి తొలిగిపోయింది. హెడ్ (68), డేవిడ్ (24 నాటౌట్) రాణించారు. వాట్, షరీఫ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి.

పాయింట్ల పట్టిక — గ్రూప్-బి

జట్టు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	రన్‌రేట్
ఆస్ట్రేలియా	4	4	0	0	8	2.791
ఇంగ్లండ్	4	2	1	1	5	3.611
స్కాట్లాండ్	4	2	1	1	5	1.255
నమీబియా	4	1	3	0	2	-2.585
ఒమన్	4	0	4	0	0	-3.062

ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; పా: పాయింట్లు

మంధాన శతక గర్జన

● శోభనకు 4 వికెట్లు ● భారత్‌దే తొలి వన్డే
● 143 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికా చిత్తు



స్మృతి మంధాన (117)

6 — మంధానకు ఇది వన్డేల్లో ఆరో సెంచరీ. కాగా, స్వదేశంలో మాత్రం ఇదే మొదటిది.

బెంగళూరు: డాషింగ్ ఓపెనర్ స్మృతి మంధాన (127 బంతుల్లో 12 ఫోర్లు, సిక్స్‌తో 117) శతకంతోపాటు స్పిన్నర్లు ఆశా శోభన (8.4-2-21-4), దీప్తి శర్మ (6-0-10-2) తిప్పేయడంతో.. దక్షిణాఫ్రికాతో మల్టీ ఫార్మాట్ సిరీస్‌ను భారత మహిళల జట్టు ఘనంగా ఆరంభించింది. ఆదివారం జరిగిన తొలి వన్డేలో హర్మన్ సేన 143 పరుగుల భారీ తేడాతో గెలిచింది. తొలుత భారత్ 50 ఓవర్లలో 265/8 స్కోరు చేసింది. దీప్తి శర్మ (37), పూజా వస్త్రాకర్ (31 నాటౌట్) రాణించారు. అయబొంగ 3, మసాబటా క్లాస్ 2 వికెట్లు పడగొట్టారు. ఛేదనలో సౌతాఫ్రికా 37.4 ఓవర్లలో 122 పరుగులకే కుప్పకూలింది. స్పిన్నర్ ఆశా శోభన సంచలన ప్రదర్శనతో అరంగేట్ర మ్యాచ్‌ను చిరస్మరణీయం చేసుకుంది. రేణుక, పూజ, రాధా యాదవ్ తలా వికెట్ తీశారు. స్మృతి మంధాన 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచింది.



ఆశా శోభన (4/21)

ఆదినుంచే తడబాటు: సఫారీల ఇన్నింగ్స్‌లో కెప్టెన్ లారా వొల్వార్డ్ (4)ను రేణుక మొదటి ఓవర్‌లోనే అవుట్ చేసి షాకిచ్చింది. అనెక్ బాష్ (5), తంజిమ్ బ్రిట్స్ (18) కూడా ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయారు. అయితే, సునె లుస్ (33), మరిజానె కాప్ (24) నాలుగో వికెట్‌కు 39 పరుగుల భాగస్వామ్యంతో జట్టును ఆదుకొనే ప్రయత్నం చేశారు. కానీ, కాప్‌ను శోభన బోల్తా కొట్టించడంతో జట్టు 72/4తో పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆ వెంటనే డెర్క్‌సన్ (1)ను జెమీమా రనౌట్ చేయగా, క్రీజులో పాతుకుపోయిన లుస్‌ను దీప్తి ఎల్బీ చేయడంతో సౌతాఫ్రికా ఆశలు ఆవిరయ్యాయి. సినాలో జఫ్టా (27 నాటౌట్) ధాటిగా ఆడినా ఫలితం లేకపోయింది. క్లాస్ (1), మ్లబా (0), కకా (0)ను అవుట్ చేసిన శోభన.. సౌతాఫ్రికా ఇన్నింగ్స్‌కు తెరదించింది.

టాప్ విలవిల: టాపార్డర్ బ్యాటర్లు విఫలమైనా.. స్మృతి మంధాన పోరాటంతో భారత్ సవాల్ విసరగలిగే స్కోరు చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకొన్న టీమిండియా ఆరంభంలో తడబడింది. షఫాలీ (7), హేమలత (12) స్వల్ప స్కోర్లకే వెనుదిరిగారు. హర్మన్‌ప్రీత్ (10), జెమీమా (17), రిచా ఘోష్ (3) కూడా పేలవ ప్రదర్శన చేయడంతో 22 ఓవర్లలో భారత్ 99/5 స్కోరుతో ఇబ్బందుల్లో పడింది. ఈ దశలో దీప్తి శర్మ జతగా స్మృతి ఆరో వికెట్‌కు 81 రన్స్ జోడించి జట్టును ఆదుకొంది. దీప్తిని కకా అవుట్ చేసినా.. ఆ తర్వాత మంధానకు పూజ చక్కని సహకారం అందించింది. వీరిద్దరూ ఏడో వికెట్‌కు వేగంగా 58 రన్స్ జతచేశారు. సెంచరీ పూర్తి చేసుకొన్న మంధానాను మసాబటా పెవిలియన్ చేర్చినా.. పూజ జట్టు స్కోరును 260 మార్క్ దాటించింది.

సంక్షిప్త స్కోర్లు

భారత్: 50 ఓవర్లలో 265/8 (మంధాన 117, దీప్తి 37; కకా 3/47, క్లాస్ 2/51).
సౌతాఫ్రికా: 37.4 ఓవర్లలో 122 ఆలౌట్ (లుస్ 33, కాప్ 24; ఆశా శోభన 4/21, దీప్తి 2/10).

సూపర్-8కు ఇంగ్లండ్



బ్రూక్ (47 నాటౌట్)

నార్త్‌సౌండ్ (అంటీగ్వా): డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్ శనివారం నాడు పడిన టెన్షన్ అంతా..ఇంతా కాదు. బహుశా ఈసారి టీ20 వరల్డ్ కప్‌లో ఆ జట్టు ఎదుర్కొన్న ఉత్కంఠ మరే టీమ్ కూడా ఎదుర్కొని ఉండదు. కారణం..నమీబియాతో ఆ జట్టు ఆఖరి లీగ్ మ్యాచ్‌కు వరుణుడు తీవ్రంగా ఆటంకం కలిగించడమే. మ్యాచ్ రద్దయితే ఇంగ్లండ్ గ్రూపు దశ నుంచే ఇంటిముఖం పట్టాల్సి వచ్చేది. ఈ నేపథ్యంలో శనివారం అర్ధరాత్రి ఆగి ఆగి పడిన వర్షంతో మూడు గంటలపాటు బట్లర్ సేన తీవ్ర ఉద్విగ్నతకు లోనైంది. ఎట్టకేలకు 11 ఓవర్లతో ఆట మొదలుకాగా..ఇంగ్లండ్ ఇన్నింగ్స్ సందర్భంగా వరుణుడు మరోసారి పలకరించాడు. దాంతో చివరగా ఒక్కో ఇన్నింగ్స్‌ను 10 ఓవర్లకు కుదించారు. ఇంగ్లండ్ తొలుత 122/5 స్కోరు సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' హ్యారీ బ్రూక్ (47 నాటౌట్) ధనాధన్ బ్యాటింగ్ చేశాడు. అనంతరం డక్‌వర్త్ లూయిస్ నిబంధన ప్రకారం నమీబియా లక్ష్యాన్ని 10 ఓవర్లలో 126గా నిర్ధారించారు. కానీ ఆ జట్టు నిర్ణీత ఓవర్లలో 84/3 స్కోరుకే పరిమితమైంది. దాంతో 41 రన్స్‌తో నెగ్గినా ఇంగ్లండ్‌కు టెన్షన్ తప్పలేదు. ఇదే గ్రూప్ 'డి'లో ఆస్ట్రేలియా-స్కాట్లాండ్ ఆఖరి మ్యాచ్‌పై ఇంగ్లండ్ సూపర్-8 అవకాశాలు ఆధారపడి ఉండడమే అందుకు కారణం. ఆ పోరులో ఆసీస్ గెలిస్తేనే ఇంగ్లండ్ ముందంజ వేసేది. దాంతో ఆ మ్యాచ్ ఫలితం కోసం ఇంగ్లండ్ ఎదురు చూడాల్సి వచ్చింది. చివరకు ఆసీస్ నెగ్గడంతో..ఇంగ్లండ్ సూపర్-8కి క్వాలిఫై అయ్యింది.

క్రికెట్‌కు వీజ్ గుడ్‌బై: నమీబియా ఆల్‌రౌండర్, 39 ఏళ్ల డేవిడ్ వీజ్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. ఇక్కడ ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్ అనంతరం అతడు రిటైర్మెంట్ నిర్ణయం ప్రకటించాడు.

సంక్షిప్తస్కోర్లు

ఇంగ్లండ్: 10 ఓవర్లలో 122/5 (బ్రూక్ 47 నాటౌట్, బెయిర్‌స్టో 31, ట్రంపెల్‌మన్ 2/31).
నమీబియా: 10 ఓవర్లలో 84/3 (వాన్ లింగెన్ 33, వీజ్ 27).

పాక్ గట్టెక్కింది

ఐర్లాండ్‌పై విజయం

లాడర్‌హిల్: టీ20 వరల్డ్‌కప్‌ను పాకిస్థాన్ జట్టు విజయంతో ముగించింది. ఆదివారం ఐర్లాండ్‌తో జరిగిన తమ చివరి గ్రూప్ 'ఎ' మ్యాచ్‌లో కాస్త తడబడినా చివరకు 3 వికెట్ల తేడాతో నెగ్గి పాక్ ఊపిరిపీల్చుకుంది. కెప్టెన్ బాబర్ ఆజమ్ (32 నాటౌట్) కీలక ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. పాక్ ఇప్పటికే సూపర్-8కు చేరకుండా గ్రూప్ దశలోనే నిష్క్రమించిన విషయం తెలిసిందే. ముందుగా ఐర్లాండ్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 106 పరుగులు చేసింది. డెలాని (31), లిటిల్ (22 నాటౌట్), అడెయిర్ (15) మాత్రమే రాణించారు. పాక్ పేసర్ల ధాటికి 32/6 స్కోరుతో కష్టాల్లో పడిన జట్టును డెలాని ఆదుకున్నాడు. చివర్లో లిటిల్ పోరాటంతో స్కోరు వంద పరుగులు దాటింది. ఇమాద్ వసీమ్, షహీన్‌లకు మూడేసి, ఆమిర్‌కు రెండు వికెట్లు దక్కాయి. స్వల్ప ఛేదనలో పాక్ 18.5 ఓవర్లలో 7 వికెట్లకు 111 పరుగులు చేసి గెలిచింది. బాబర్ కీలక ఇన్నింగ్స్‌తో అజేయంగా నిలిచాడు. ఐర్లాండ్ బౌలర్ల పదునైన బంతులకు ఓ దశలో పాక్ 57/5 స్కోరుతో ఓటమి తప్పదా అనిపించింది. కానీ బాబర్‌కు జతగా అబ్బాస్ అఫ్రిది (17) నిలవడంతో ఏడో వికెట్‌కు 33 రన్స్ వచ్చాయి. ఇక చివరి రెండు ఓవర్లలో 12 రన్స్ అవసరమైన వేళ కాస్త ఉత్కంఠ నెలకొంది. అయితే 19వ ఓవర్‌లో రెండు సిక్సర్లతో షహీన్ (13 నాటౌట్) మ్యాచ్‌ను ముగించాడు.

పాయింట్ల పట్టిక — గ్రూప్-ఎ

జట్టు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	రన్‌రేట్
భారత్	4	3	0	1	7	1.137
అమెరికా	4	2	1	1	5	0.127
పాకిస్థాన్	4	2	2	0	4	0.294
కెనడా	4	1	2	1	3	-0.493
ఐర్లాండ్	4	0	3	1	1	-1.293

ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; పా: పాయింట్లు

వౌట్ లేట్ గోల్

పోలెండ్‌పై నెదర్లాండ్స్ గెలుపు



వౌట్ వెహోర్స్ట్

హాంబర్గ్ (జర్మనీ): ఫార్వర్డ్ వౌట్ వెహోర్స్ట్ చివరి నిమిషంలో చేసిన గోల్‌తో యూరో చాంపియన్‌షిప్‌లో నెదర్లాండ్స్ శుభారంభం అందుకుంది. గ్రూప్ 'డి'లో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో నెదర్లాండ్స్ 2-1తో పోలెండ్‌ను ఓడించింది. సబ్‌స్టిట్యూట్‌గా వచ్చిన వౌట్ 83వ నిమిషంలో..నాథన్ అకే నుంచి అందుకున్న పాస్‌ను గోల్‌పోస్టులోకి కొట్టడంతో డచ్ అభిమానులు సంబరాల్లో మునిగారు. అంతకుముందు.. గాయంతో స్టార్ ఆటగాడు రాబర్ట్ లెవాన్‌డొస్కీ లేకుండా బరిలో దిగిన పోలెండ్ 16వ నిమిషంలో ఆడమ్ బుస్కా చేసిన గోల్‌తో ఆధిక్యం ప్రదర్శించింది. అయితే 29వ నిమిషంలో గ్యాప్కో కొట్టిన గోల్‌తో నెదర్లాండ్స్ సమం చేసింది. గ్రూప్ 'బి'లో జరిగిన మ్యాచ్‌లో ఇటలీ 2-1తో అల్బేనియాపై విజయం సాధించింది. గ్రూప్ 'సి'లో స్లోవేనియా, డెన్మార్క్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ 1-1తో డ్రాగా ముగిసింది.

బిజినెస్

అనుబంధ కంపెనీలనూ సొమ్ము చేసుకుంటాం

ఎస్‌బీఐ చైర్మన్ దినేశ్ ఖారా

న్యూఢిల్లీ: అనుబంధ సంస్థలైన ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్, ఎస్‌బీఐ పేమెంట్స్‌ను సమయం వచ్చినప్పుడు సొమ్ము చేసుకుంటామని మాతృసంస్థ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ప్రకటించింది. ఆ సంస్థ చైర్మన్ దినేశ్ ఖారా ఈ విషయం చెప్పారు. ఈలోగా ఈ రెండు కంపెనీల వ్యాపారాన్ని మరింత విస్తరిస్తామన్నారు. ఈ లక్ష్య సాధన పూర్తయ్యాక క్యాపిటల్ మార్కెట్ ద్వారానే ఈ రెండు కంపెనీల ఈక్విటీలో ఎస్‌బీఐకి ఉన్న వాటాలో కొంత వాటా విక్రయించి సొమ్ము చేసుకుంటామని ఖారా చెప్పారు. అయితే ఇది ఈ ఆర్థిక సంవత్సరం మాత్రం జరగదన్నారు. కాగా ప్రస్తుతం కంపెనీల నుంచీ రుణాలకు గిరాకీ పెరుగుతోందని ఖారా తెలిపారు. వర్కింగ్ క్యాపిటల్ రుణాలతో పాటు, ఉత్పత్తి విస్తరణ కోసమూ ప్రస్తుతం కంపెనీలు రుణాల కోసం తమను సంప్రదిస్తున్నట్టు చెప్పారు. ఈ రెండు రుణాల మొత్తమే రూ.5 లక్షల కోట్ల వరకు ఉంటుందన్నారు.

23,200 దిగువన బేరిష్

(జూన్ 18-21 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 23,491-21,277 పాయింట్ల మధ్యన కదలాడి 176 పాయింట్ల లాభంతో 23,466 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 23,200 కన్నా దిగువన ముగిస్తే స్వల్పకాలానికి బేరిష్ అవుతుంది.

20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 23,402, 23,308, 22,950, 22,730 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డీఎంఏ 200 డీఎంఏ కన్నా పైన ఉండడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి :23,700 బ్రేక్‌డౌన్ స్థాయి: 23,200
నిరోధ స్థాయిలు : 23,665, 23,765, 23,865 (23,565 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు : 23,265, 23,165, 23,065 (23,365 దిగువన బేరిష్)

అమర్ స్ట్రాటజీ

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



17వ తేదీ			
హైదరాబాద్	490	విజయవాడ	480
వరంగల్	492	గోదావరి	475
చిత్తూరు	573	విశాఖపట్నం	500
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	139	విజయవాడ	145
వరంగల్	139	గుంటూరు	145
కరీంనగర్	139	ఒంగోలు	145
మహబూబ్‌నగర్	139	చిత్తూరు	152
కర్నూలు	139	నెల్లూరు	152
విశాఖపట్నం	136	అనంతపురం	145
గోదావరి	145		

'స్టార్టప్స్'లోనూ కొలువుల కోతలు



ఇప్పటి వరకు 10,000 మంది ఔట్.. గుట్టుచప్పుడు కాకుండా వేటు

న్యూఢిల్లీ: స్టార్టప్ కంపెనీల్లోనూ కొలువుల కోత కొనసాగుతోంది. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు వివిధ స్టార్టప్ కంపెనీలు 10,000 మందిని ఇంటికి పంపించాయి. ఇందులో దాదాపు సగం ఉద్యోగాల కోతలు గుట్టుచప్పుడు కాకుండా చేశాయి. దీంతో మంచి జీతాల ఆశతో ఈ కంపెనీల్లో చేరిన ఉద్యోగులు లబోదిబోమంటున్నారు. ఉన్న ఉద్యోగులు కూడా ఎప్పుడు ఏ దుర్వార్త వినాల్సి వస్తుందా? అని బిక్కుబిక్కుమంటున్నారు. పరిస్థితులు మెరుగుపడకపోతే డిసెంబరు నాటికి స్టార్టప్ కంపెనీలు మరో ఐదారు వేల మందిని ఇంటికి పంపించే అవకాశం ఉందని భావిస్తున్నారు.

ఖర్చులు తగ్గించుకునేందుకే

గత ఏడాది కాలంగా స్టార్టప్ కంపెనీలు నిధుల కొరత ఎదుర్కొంటున్నాయి. గతంలోలా వెంచర్ క్యాపిటల్ (వీసీ) కంపెనీలు, ప్రైవేటు ఈక్విటీ (పీఈ) సంస్థలు స్టార్టప్స్‌లో ఎడాపెడా పెట్టుబడులు పెట్టడం లేదు. మంచి వ్యాపార ఐడియాతో క్లిక్ అవుతుందనే నమ్మకం ఉన్న స్టార్టప్స్‌కు మాత్రమే వీసీలు, పీఈ సంస్థలు నిధులు సమకూరుస్తున్నాయి. ఇప్పటికే నిధులు సమకూర్చిన స్టార్టప్స్ నుంచి ఎంతో కొంత లాభం ఆశిస్తున్నాయి. లాభాలు లేకపోతే ఖర్చులు తగ్గించుకోమని ఒత్తిడి చేస్తున్నాయి. దీంతో స్టార్టప్ కంపెనీలు మంచి మంచి జీతాలు ఉన్న ఉద్యోగులను తొలగించి, వారికంటే 15-20 శాతం తక్కువ జీతాలకు కొత్తవారిని నియమించేందుకు మొగ్గు చూపుతున్నాయి.

గత ఏడాదితో పోలిస్తే తక్కువే

గత ఏడాదితో పోలిస్తే స్టార్టప్ కంపెనీల్లో ఉద్యోగుల తీసివేతలు ఈ సంవత్సరం కొద్దిగా తగ్గాయి. గత ఏడాది ప్రథమార్థంలో 21,000 మందిని, రెండో అర్థభాగంలో 15,000 మందిని స్టార్టప్ కంపెనీలు ఇంటికి పంపించాయి. దీంతో పోలిస్తే ఈ ఏడాది ప్రథమార్థంలో స్టార్టప్ కంపెనీలు 10,000 మందిని మాత్రమే ఇంటికి పంపించాయి. నిధుల లభ్యత పెరుగుతున్నందున ఈ ఏడాది రెండో అర్థభాగంలో తీసివేతలు పెద్దగా ఉండకపోవచ్చని భావిస్తున్నారు. ఉద్యోగులను తీసివేస్తున్న స్టార్టప్స్‌లో ఓలా ఎలక్ట్రిక్, ఫ్లిప్‌కార్ట్ వంటి స్టార్టప్స్ కూడా ఉండడం విశేషం.

కొత్తగా 81 లక్షల ఎంఎఫ్ ఖాతాలు

న్యూఢిల్లీ: మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్) పథకాలపై మదుపరుల అవగాహన పెరుగుతోంది. దీంతో ఈ ఆర్థిక సంవత్సరం తొలి రెండు నెలల్లో 81 లక్షల మంది మదుపరులు కొత్తగా ఎంఎఫ్ ఖాతాలు ప్రారంభించారు. బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్ల కంటే ఎంఎఫ్ రుణ పథకాలపై అధిక రాబడులు లభించడం, ఎంఎఫ్‌ల మార్కెటింగ్, సెలబ్రిటీలతో ప్రచారం, విస్తృత డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ ఇందుకు ప్రధాన కారణమని స్టాక్ ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్ సీఓఓ డీ త్రివేష్ చెప్పారు. ప్రస్తుత బుల్‌రన్‌తో ముందు ముందూ ఎంఎఫ్ పథకాల్లో మదుపరుల పెట్టుబడులు కొనసాగుతాయని మార్కెట్ వర్గాల అంచనా.

పేటీఎం మూవీస్, ఈవెంట్స్‌పై జొమాటో కన్ను

న్యూఢిల్లీ: ఫైనాన్షియల్ టెక్నాలజీ సంస్థ పేటీఎంకు చెందిన మూవీస్, ఈవెంట్స్ వ్యాపారాన్ని చేజిక్కించుకునేందుకు ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ జొమాటో సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు పేటీఎంతో చర్చలు జరుపుతున్నట్లు స్టాక్ మార్కెట్లకు పంపిన ఒక ప్రకటనలో వెల్లడించింది. అయితే ప్రస్తుతానికి చర్చలు మాత్రమే సాగిస్తున్నామని, బోర్డు దృష్టికి ఇంకా ఈ అంశాన్ని తీసుకువెళ్లాల్సి ఉందని పేర్కొంది. ప్రస్తుత వ్యాపారాలపై మరింతగా దృష్టి పెట్టడమే కాకుండా కొత్త వ్యాపారాల్లోకి అడుగుపెట్టాలన్న యోచనకు అనుగుణంగా ఈ చర్చలు సాగిస్తున్నట్లు జొమాటో తెలిపింది.

నేడు మార్కెట్లకు సెలవు

బక్రీద్ సందర్భంగా సోమవారం స్టాక్ ఎక్స్ఛేంజీలు బీఎస్ఈ, ఎన్ఎస్ఈలకు సెలవు ప్రకటించారు. కమోడిటీ, ఫారెక్స్ మార్కెట్లు కూడా పనిచేయవు. మంగళవారం మార్కెట్లు యథావిధిగా పనిచేస్తాయి.

తదుపరి నిరోధం 23,600

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం 23,300 వద్ద అప్రమత్త మైనర్ అప్‌ట్రెండ్‌లో ప్రారంభమయింది. తదుపరి సెషన్లలో గరిష్ఠ స్థాయిల్లో అమ్మకాల ఒత్తిడి, ఇంట్రాడే కరెక్షన్లు ఎదుర్కొంటూనే వారాంతానికి 175 పాయింట్ల లాభంతో జీవితకాల గరిష్ఠ స్థాయిలో, మానసిక అవధి 23,500 సమీపంలో నిలకడగా ముగిసింది. జూన్ 4వ తేదీన ఏర్పడిన మహాపతనం అనంతరం గత రెండు వారాల కాలంలో నిఫ్టీ కనిష్ఠ స్థాయిల నుంచి 2,000 పాయింట్ల వరకు లాభపడింది. ఇక మిడ్‌క్యాప్-100 సూచీ 2,000 పాయింట్లు, స్మాల్ క్యాప్‌సూచీ 830 పాయింట్ల మేరకు లాభపడ్డాయి.

జీవితకాల గరిష్ఠ స్థాయిల్లో నిలిచి ఉన్న మార్కెట్ గత వారం నిలకడ ధోరణిని బట్టి పాజిటివ్ ధోరణిలోనే ప్రారంభం కావచ్చు. ఇప్పుడు జీవితకాల గరిష్ఠ స్థాయిల్లో నిలదొక్కుకుంటుందో, లేదో వేచి చూడాలి.

బుల్లిష్ స్థాయిలు: నిఫ్టీకి తదుపరి మానసిక అవధి 23,600. కొత్త శిఖరాలకు ప్రయాణించాలంటే ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. ఆపైన మానసిక అవధులు 23,800, 24,000.

బేరిష్ స్థాయిలు: కరెక్షన్‌లో పడినట్టయితే దిగువన మద్దతు స్థాయి 23,400. ఇక్కడ విఫలమైతే మైనర్ బలహీనతకు ఆస్కారం ఉంది. ప్రధాన మద్దతు స్థాయిలు 23,200, 23,000. కాని సాధారణ పరిస్థితుల్లో తక్షణ ముప్పు ఏమీ లేదు.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత వారం పరిమిత పరిధిలోనే కదలాడి 200 పాయింట్ల లాభంతో ముగిసింది. రెండు వారాల పాటు మానసిక అవధి 50,000 వద్ద పరీక్ష ఎదుర్కొన్న అనంతరం నిలకడగా క్లోజైంది. మరింత అప్‌ట్రెండ్ కోసం ప్రధాన నిరోధం 50,700 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ఆ పైన మరో నిరోధం 51,200. బలహీనత ప్రదర్శించి 50,000 వద్ద నిలదొక్కుకోలేకపోతే అప్రమత్తతను సూచిస్తుంది.

పాటర్న్: మార్కెట్ గత వారం కన్సాలిడేషన్ అనంతరం గతంలో ఏర్పడిన గరిష్ఠ స్థాయి, టాప్ 23,350 వద్ద బ్రేకౌట్ సాధించింది. ఇది పాజిటివ్ ట్రెండ్ సంకేతం. రియాక్షన్‌లో పడితే భద్రత కోసం 23,400 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" వద్ద నిలదొక్కుకోవాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం గురువారం తదుపరి మైనర్ రివర్సల్ ఉంది.

మంగళవారం స్థాయిలు	
నిరోధం	23,600, 23,655
మద్దతు	23,470, 23,400

www.sundartrends.in

ఆర్థిక సంస్కరణలు కొనసాగాల్సిందే

అట్టడుగు శ్లాబు వారిని కరుణించాలి: సీఐఐ



బడ్జెట్ విన్నపాలు

న్యూఢిల్లీ: ధరల పోటు నేపథ్యంలో వచ్చే కేంద్ర బడ్జెట్‌లో ఆదాయ పన్ను (ఐటీ) చెల్లింపు పరిధిలోని అట్టడుగు శ్లాబులో ఉన్న వారిని ఆదుకోవాలని భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ప్రభుత్వాన్ని కోరింది. ఇందుకోసం వారి కోసం ప్రత్యేక పన్ను రాయితీలు ప్రకటించాలని కొత్తగా సీఐఐ జాతీయ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన ఐటీసీ చైర్మన్ సంజీవ్ పురి కోరారు. భూ సంస్కరణలు, కార్మిక సంస్కరణలు, విద్యుత్, వ్యవసాయ సంస్కరణలపై ఏకాభిప్రాయ సాధన కోసం కేంద్ర-రాష్ట్రాల మధ్య ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. సంకీర్ణ ప్రభుత్వం సంస్కరణల కొనసాగింపునకు అడ్డంకి అవుతుందని తాము భావించడం లేదని పురి స్పష్టం చేశారు. ప్రభుత్వ పెట్టుబడులు, ద్రవ్య లోటు కట్టడి, సామాజిక మౌలిక సదుపాయాలపై పెట్టుబడులకు సంబంధించిన రోడ్ మ్యాప్, హరిత పరిశ్రమల ప్రోత్సాహం కోసం ప్రత్యేక నిధి ఏర్పాటు, గ్రామీణ అభివృద్ధికి మరిన్ని పెట్టుబడులకు వచ్చే కేంద్ర బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇవ్వాలని సీఐఐ కోరింది. వరుణుడు కరుణిస్తే ఈ ఆర్థిక సంవత్సరం చివరికి రిటైల్ ద్రవ్యోల్బణం 4.5 శాతం వద్ద స్థిరపడే అవకాశం ఉందని అంచనా వేసింది. ఆదాయ పన్ను చట్టాన్ని ముఖ్యంగా టీడీఎస్ వసూలు విధానాన్ని మరింత సంస్కరించాల్సిన అవసరం ఉందని పురి స్పష్టం చేశారు.

20న పారిశ్రామిక సంఘాలతో నిర్మల భేటీ!

వచ్చే కేంద్ర బడ్జెట్ రూపకల్పన ఊపందుకుంది. ఇందుకోసం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ నెల 20న పారిశ్రామిక, వాణిజ్య సంఘాలతో సమావేశమవుతారని సమాచారం. అంతకు ముందే రెవెన్యూ కార్యదర్శి సంజయ్ మల్హోత్రా పారిశ్రామిక, వాణిజ్య మండళ్ల ఉన్నతాధికారులతో సమావేశమవుతారు. నిర్మలా సీతారామన్ కేంద్ర బడ్జెట్‌ను వచ్చే నెల రెండో అర్థభాగంలో పార్లమెంట్‌కు సమర్పించే అవకాశం ఉందని భావిస్తున్నారు.

అందుబాటు ధరల ఇళ్లకు తగ్గిన గిరాకీ

ప్రాప్‌ఈక్విటీ

న్యూఢిల్లీ: దేశంలో రూ.60 లక్షల వరకు ధర ఉండే అందుబాటు ధరల ఇళ్లకు గిరాకీ తగ్గుతోంది. ఈ ఏడాది జనవరి-మార్చిలో హైదరాబాద్‌తో సహా దేశంలోని ఎనిమిది ప్రధాన నగరాల్లో ఈ కేటగిరిలోకి వచ్చే ఇళ్ల అమ్మకాలు 61,121 యూనిట్లు మించలేదు. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది నాలుగు శాతం తక్కువని రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ ప్రాప్‌టైగర్ తెలిపింది. లగ్జరీ అపార్ట్‌మెంట్లకు గిరాకీ పెరగడం, అందుబాటు ధరల గృహాల సరఫరా మందగించడం ఇందుకు ప్రధాన కారణం. ప్రస్తుతం బిల్డర్లు ఎక్కువగా అధిక లాభాలు ఉండే లగ్జరీ అపార్ట్‌మెంట్ల నిర్మాణంపైనే ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో గత ఏడాది జనవరి-మార్చి త్రైమాసికంలో హైదరాబాద్‌లో 3,674 అందుబాటు ధరల గృహాలు అమ్ముడుపోగా ఈ ఏడాది జనవరి-మార్చి త్రైమాసికంలో 3,360 గృహాలు మాత్రమే అమ్ముడుపోయాయని ప్రాప్‌టైగర్ తెలిపింది.

ఐసీఐసీఐ ప్రు మల్టీ అసెట్ ఫండ్‌తో మెరుగైన రిటర్నులు

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మల్టీ అసెట్ ఫండ్.. మదుపరులకు మంచి రిటర్నులు అందించటంలో ముందు వరుసలో ఉంది. ఈ ఫండ్ 2002 అక్టోబరు 31న ప్రారంభమైన నాటి నుంచి సగటున ఏటా 21.5 శాతం వృద్ధితో రిటర్నులు అందించటం విశేషం. ఈ ఫండ్ ప్రారంభ సమయంలో రూ.లక్ష పెట్టుబడిగా పెట్టి ఉంటే ఈ ఏడాది ఏప్రిల్ 30 నాటికి ఇది రూ.65.4 లక్షలకు చేరుకుంది. ఇదే సమయంలో బెంచ్‌మార్క్ ఇండెక్స్ 17.1 శాతం వృద్ధి చెందింది. గడచిన ఏడాదిని ప్రాతిపదికగా తీసుకుంటే 33.1 శాతం రిటర్నులు అందించింది. గడచిన ఐదేళ్లలో ప్రతి నెల రూ.10,000 క్రమానుగత పెట్టుబడుల (సిప్) రూపంలో పెట్టి ఉంటే ఆ పెట్టుబడి మొత్తం రూ.6 లక్షల నుంచి రూ.10.98 లక్షలకు పెరిగింది.

స్కోడా ఆటో ఇండియా మార్కెట్లోకి సరికొత్త కుషాక్ ఓనిక్స్ ఏటీ తీసుకువచ్చింది. గత ఏడాది ఈ ఎస్‌యూవీని తీసుకువచ్చినప్పటికీ తాజాగా కొత్త హంగులతో ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్‌తో విడుదల చేసింది. 1.0 టీఎస్ఐ ఇంజన్, 6 స్పీడ్ మాన్యువల్, ఆటోమేటిక్ వెర్షన్స్‌తో ఇది అందుబాటులో ఉండనుంది. కుషాక్ ఓనిక్స్ అన్ని వెర్షన్లలో ఆరు ఎయిర్‌బ్యాగ్స్‌ను కంపెనీ పొందుపరిచింది. ఈ కారు ధర రూ.13.49 లక్షలు (ఎక్స్‌షోరూమ్).

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 17-6-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 79 | Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | వరంగల్

నీట్‌లో రెండుచోట్ల అవకతవకలు

9

మొదటిసారి ఒప్పుకొన్న కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్.. ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని స్పష్టం

ఎన్‌టీఏ అధికారుల తప్పున్నట్టు తేలితే వదిలిపెట్టబోం.. వారికి కఠిన శిక్ష తప్పదని హెచ్చరిక

ఎన్‌టీఏ చాలా మెరుగుపడాల్సి ఉందని అభిప్రాయం.. 'నీట్'పై మోదీ మౌనం మంచిది కాదు

'సుప్రీం' కమిటీతో దర్యాప్తు జరిపించాలి.. ప్రవేశాలపై రాష్ట్రాలతో సంప్రదింపులు జరపాలి: సిబల్

నీట్ వ్యవహారంపై ప్రధాని, కేంద్ర మంత్రులు స్పందించాలి

11

విద్యార్థులకు నష్టం జరిగితే పోరాటం చేస్తాం.. రాష్ట్ర ఎంపీలు చొరవ తీసుకోవాలి: కేటీఆర్



జగన్ కోట రహస్యం

విశాఖ రుషికొండపై రూ.500 కోట్లతో రాజభవనం నిర్మాణం

- సద్దాం, గాలి భవనాలను తలదన్నేలా.. 3 ఏళ్ల తర్వాత బాహ్య ప్రపంచానికి ఆ దృశ్యాలు
- మార్బుల్, ఇంటీరియర్‌కే రూ.కోట్లలో.. మీడియాతో కలిసి ప్యాలెస్‌లోకి టీడీపీ నేత గంటా
- ప్రజావేదికను కూల్చిన జగన్.. తన కోసం ఈ భవనాన్ని ఎలా నిర్మించుకున్నారని ప్రశ్న
- ఈ నిర్మాణంపై త్వరలో చంద్రబాబు నిర్ణయం తీసుకుంటారని వెల్లడి

10

ప్యాలెస్‌లో ధరధగలు




ఫ్యాన్ రూ.3 లక్షలు

కమోడ్ రూ.13.5 లక్షలు

బాత్‌టబ్ రూ.26 లక్షలు

ప్యాలెస్‌లో ఒక్కో బాత్‌రూమ్ జగన్ కొందరు పేదలకు ఇచ్చిన సెంటు భూమి ఇళ్లకంటే రెండింతలున్నాయి.



బెడ్‌రూం



బాత్‌రూం

జగన్ జల్సా మహల్ ఇదిగో..

రుషికొండపై అట్టహాసంగా ప్యాలెస్.. అందులో మూడు భవనాలు జగన్ కుటుంబానికే.. భార్యభర్తలకు ప్రెసిడెన్షియల్ సూట్ కుమార్తెలకు చెరో విల్లా సూట్.. పర్యాటక రిసార్ట్స్ పేరిట అనుమతి 4 ఎకరాలకు.. నిర్మించింది పది ఎకరాల్లో.. ముందే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'

10

30లోగా గనులు

వేలం వేయండి

కనీసం ఆరు బ్లాకులకైనా ఆక్షన్ నిర్వహించండి

తెలంగాణ ప్రభుత్వానికి కేంద్ర గనుల శాఖ లేఖ

లేదంటే తామే వేలం నిర్వహిస్తామని స్పష్టీకరణ

తొమ్మిదేళ్లుగా ఒక్క బ్లాక్‌కూ వేలం నిర్వహించకపోవడంపై కేంద్రం అసంతృప్తి!

ఖనిజాల వారీగా రాష్ట్రానికి వివరాల అందజేత



న్యూఢిల్లీ/హైదరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని ఖనిజ గనులపై కేంద్ర ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఈ నెల 30వ తేదీలోపు ఖనిజ గనులకు వేలం నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ సూచించింది. గడిచిన తొమ్మిదేళ్లలో ఒక్క మినరల్ బ్లాక్‌కు కూడా తెలంగాణ ప్రభుత్వం వేలం నిర్వహించని విషయాన్ని గుర్తుచేస్తూ అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ నెలాఖరులోగా కనీసం ఆరు బ్లాకులకైనా వేలం నిర్వహించాలని, లేదంటే తామే ఆ ప్రక్రియను పూర్తి చేయాల్సి వస్తుందని తెలిపింది. శనివారం ఢిల్లీలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో సంబంధిత అధికారులతో కీలక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తెలంగాణలోని గనులపై చర్చించినట్టు తెలిసింది. సుదీర్ఘ కాలంగా తెలంగాణలోని మైనింగ్ బ్లాక్‌లను వేలం వేయకపోవడం, దీనికి సంబంధించిన కారణాలు, అడ్డంకులు, గత ప్రభుత్వాల తీరు తదితర అంశాలపై సమావేశంలో కూలంకషంగా చర్చించినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వానికి పలు మార్లు లేఖలు రాసినా స్పందించలేదని అధికారులు కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలోనే తాజాగా గనుల వేలంపై రాష్ట్ర ప్రభుత్వానికి మరోసారి కేంద్రం లేఖ రాసినట్లు సమాచారం. తెలంగాణలోని మొత్తం 11 బ్లాకుల జియలాజికల్ నివేదికలను రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం పంపినట్టు తెలిసింది. ఇందులో ఐదు ఇనుప ఖనిజం బ్లాక్‌లు, ఐదు సున్నపురాయి బ్లాక్‌లు, ఒక మాంగనీస్ బ్లాక్ ఉన్నాయి. ఈ 11 బ్లాకుల్లో కనీసం ఆరు బ్లాకులను ఈ నెల చివరి నాటికి వేలం వేయాలని కేంద్ర ప్రభుత్వం తన లేఖలో పేర్కొన్నట్టు సమాచారం. అయితే, ఇప్పటికి కూడా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే ఈ వేలం ప్రక్రియను తామే నిర్వహిస్తామని కేంద్రం స్పష్టం చేసినట్టు తెలిసింది. మినరల్ బ్లాకుల వేలం ప్రక్రియ 2015లో ప్రారంభమైంది. అయితే 2021లో నిబంధనలను

మిగతా 11వ పేజీలో...

ఎవరి అభ్యంతరాలు వారికుంటాయి

కేసీఆర్ చెప్పిన విషయాలను వాస్తవాలతో సరిపోల్చుతాం

బీహెచ్ఈఎల్ ప్రతినిధులనూ వివరాలు అడుగుతాం

లేఖలో పేర్కొన్న అభ్యంతరాలపై పునఃపరిశీలన చేస్తాం

సమీక్ష తర్వాతే తదుపరి చర్యలు

జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి



హైదరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్తు కొనుగోలు, భద్రాద్రి, యాదాద్రి పవర్‌ప్లాంట్లపై వివరణ ఇస్తూ మాజీ సీఎం కేసీఆర్ పంపిన లేఖ తమకు అందిందని విద్యుత్తు ఒప్పందాలపై విచారణ జరుపుతున్న కమిషన్ చైర్మన్ జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి తెలిపారు. ఆ లేఖకు సంబంధించిన అంశాలను ఆదివారం ఓ మీడియా సంస్థతో ఆయన ప్రస్తావించారు. ఛత్తీస్‌గఢ్ విద్యుత్తు కొనుగోలు, భద్రాద్రి, యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ల అంశాల్లోని కొన్ని ప్రశ్నలకు కేసీఆర్ తన లేఖలో సమాధానం ఇచ్చారని

మిగతా 11వ పేజీలో...

కేసీఆర్‌కు న్యాయ వ్యవస్థపై నమ్మకం లేదు

ఇది రాచరిక వ్యవస్థ కాదని గుర్తించాలి: భట్టి

'పవర్' కమిషన్‌పై కేసీఆర్ ఆరోపణలు న్యాయవ్యవస్థను కించపర్చడమే: జీవన్‌రెడ్డి

11



మండలిలో ఆకర్ష్!

బీఆర్ఎస్ ఎమ్మెల్సీలపై కాంగ్రెస్ గురి

కనీసం 14 మందిని చేర్చుకునేందుకు యత్నాలు

మండలి చైర్మన్ గుత్తాపై బీఆర్ఎస్ 'అవిశ్వాసం' పెట్టనుందన్న వార్తలతో అప్రమత్తం

గతంలో ఇలాగే కాంగ్రెస్ ఎమ్మెల్సీలను చేర్చుకున్న బీఆర్ఎస్.. నాటి సీన్ రివర్స్ అయ్యే చాన్స్



హైదరాబాద్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఏపీ శాసనసభలో ఆమోదం పొందిన మూడు రాజధానుల బిల్లు.. మండలికి వచ్చే సరికి ఆగిపోయింది. కారణం.. అప్పట్లో ఏపీ శాసనమండలిలో మెజారిటీ సభ్యులు టీడీపీకి చెందినవారు కావడమే. ఆ తర్వాత అది అనేక మలుపులు తిరిగి.. చివరికి జగన్ ప్రభుత్వం అభాసుపాలు కావడం వేరే విషయం. అలాగే లోక్‌సభలోనూ పలు బిల్లులకు ఆమోదం లభించి.. రాజ్యసభలో పెండింగ్ పడడమూ చూశాం. ఆయా ప్రభుత్వాలకు దిగువ సభల్లో తిరుగులేని బలమున్నా.. పెద్దల సభల్లో లేకపోవడంతో అనుకున్న చట్టాలను సకాలంలో అమల్లోకి తేలేని పరిస్థితి అధికార పార్టీలది. తెలంగాణలోనూ ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి శాసనసభలో తిరుగులేని బలం ఉన్నా.. మండలిలో మాత్రం బీఆర్ఎస్ పార్టీదే పైచేయిగా ఉంది. ఇది పలు కీలక బిల్లుల ఆమోదం, ఇతర అంశాల్లో అడ్డంకిగా మారే పరిస్థితులు ఉన్న నేపథ్యంలో శాసనమండలిలో 'ఆపరేషన్ ఆకర్ష్'కు తెరలేపేందుకు కాంగ్రెస్ సిద్ధమైందన్న ప్రచారం జరుగుతోంది. బీఆర్ఎస్‌కు చెందిన 14 మందిని కాంగ్రెస్‌లోకి లాగేందుకు ఆ పార్టీ పెద్దలు పావులు కదుపుతున్నట్లు చెబుతున్నారు. అంతా కుదిరితే బడ్జెట్ సమావేశాల్లోపే మండలిలో 'ఆపరేషన్ ఆకర్ష్' ఉంటుందని కాంగ్రెస్ పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. వాస్తవానికి శాసనమండలిపై ఇప్పటికిప్పుడే దృష్టి సారించాలన్న ఆలోచన కాంగ్రెస్ పెద్దలకు లేదు. అయితే మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టనున్నారన్న వార్తలు రావడంతో కాంగ్రెస్ నాయకత్వం అప్రమత్తమైంది. ఆయన ప్రస్తుతం బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నా ఇటీవలి

మిగతా 11వ పేజీలో...

లోటస్‌పాండ్‌లో అక్రమ నిర్మాణాల కూల్చివేత

హేమంత్ బోర్ఖడేపై బదిలీ వేటు!

10

ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ రిలీవ్

జీఏడీలో రిపోర్ట్ చేయాలన్న కమిషనర్

అక్రమ నిర్మాణాలు కూల్చివేసిన మర్నాడే చర్య

ఉన్నతాధికారులకు సమాచారం లేకుండా మంత్రి ఆదేశాలతో కూల్చివేతలు?

రాజాసింగ్ అదుపులోకి

ముంబై నుంచి శంషాబాద్‌లో దిగగానే అడ్డుకున్న పోలీసులు

12

మెదక్ వెళ్తున్నారన్న సమాచారంతోనే..



10

ఏపీ శాసనసభ స్పీకర్‌గా అయ్యన్నపాత్రుడు

టీడీపీ సీనియర్ ఎమ్మెల్యేను ఖరారు చేసిన ఆ రాష్ట్ర సీఎం చంద్రబాబు

ఏడు సార్లు ఎమ్మెల్యే.. మంత్రిగా అనుభవం

టీడీపీ రాష్ట్ర సారథిగా పల్లా శ్రీనివాసరావు

రుణమాఫీ కటాఫ్ ఖరారు!

2018 డిసెంబరు 12 నుంచి 2023 డిసెంబరు 9 వరకు

ఒక్కో కుటుంబానికి రూ.2 లక్షల మాఫీ.. ఒకే విడతలో

రూ.35 వేల కోట్ల నిధులు అవసరమవుతాయని అంచనా

భూమి పాస్‌బుక్, రేషన్, ఆధార్ ప్రామాణికంగా అర్హత

పీఎం కిసాన్ అందని వారికి వర్తింపజేయాలా? వద్దా?.. అన్నదానిపై పరిశీలన.. కేబినెట్‌లో చర్చించి విధివిధానాలు



హైదరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రైతుల రుణమాఫీ విషయంలో కృతనిశ్చయంతో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం.. ఇందుకు అవసరమైన ప్రణాళికలను వేగంగా రూపొందిస్తోంది. ఇప్పటికే నిధుల సమీకరణకు చర్యలు ప్రారంభించగా.. తాజాగా కటాఫ్ తేదీపైనా ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. 2018 డిసెంబరు 12 నుంచి 2023 డిసెంబరు 9వ తేదీ వరకు రుణాలు తీసుకున్న రైతులకు రూ.2 లక్షల చొప్పున మాఫీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ కటాఫ్ తేదీ ప్రకారం రుణమాఫీకి దాదాపు రూ.35 వేల కోట్ల మేర నిధులు అవసరమవుతాయని కూడా అంచనాకు వచ్చినట్లు సమాచారం. కాగా, రుణమాఫీకి అర్హులైన రైతు కుటుంబాలను గుర్తించేందుకు భూమి పాస్‌బుక్, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డులను ప్రామాణికంగా

మిగతా 12వ పేజీలో...



నాలా ఎలా?

పదేళ్లుగా నాలా చార్జీలపై పీటముడి!

ధరణిలో నమోదై ఉండి ఎకరాలు, గుంటల్లో ఉంటేనే... నాలా చార్జీల చెల్లింపునకు ఆప్షన్

గజాల చొప్పున రిజిస్ట్రేషనైన స్థలాలకు నో చాన్స్

సతమతమవుతున్న చిన్న, మధ్య తరహా బిల్డర్లు

కాంగ్రెస్ ప్రభుత్వమైనా అనుమతివ్వాలని వినతి

హైదరాబాద్ సిటీ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేని లేఅవుట్లలో గజాల్లో రిజిస్ట్రేషన్ అయిన స్థలాలకు సంబంధించిన నాలా చార్జీలపై పీటముడి వీడడం లేదు. ఆయా స్థలాలను కొనుగోలు చేసిన వారు నాలా చార్జీలు చెల్లించడానికి సిద్ధంగా ఉన్నా.. ప్రభుత్వం నుంచి స్పష్టత లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గత ప్రభుత్వం ఈ విషయాన్ని పట్టించుకోకపోవడంతో పదేళ్లుగా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నచందంగా పరిస్థితి ఉంది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా స్పందించి.. అనుమతులు ఇస్తే రూ.వెయ్యి కోట్లకుపైగా ఆదాయం సమకూరే అవకాశం ఉందని బిల్డర్లు, డెవలపర్లు చెబుతున్నారు. 1963లో తీసుకొచ్చిన చట్టం ప్రకారం వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చాలంటే నాన్ అగ్రికల్చర్ ల్యాండ్స్ అసెస్‌మెంట్ (నాలా) చార్జీలను తప్పనిసరిగా

మిగతా 5వ పేజీలో...



జోరుగా నకిలీ మందుల

దందా

ప్రజారోగ్యంతో కేటుగాళ్ల చెలగాటం

ఉత్తరాది నుంచి రాష్ట్రానికి సరఫరా

దాడుల్లో పట్టుబడుతున్న ముఠాలు

కోట్ల విలువైన ఔషధాలు స్వాధీనం

హైదరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో నకిలీ, నాసిరకం ఔషధాల దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. ఉత్తుత్తి మందులను అమ్ముతూ కేటుగాళ్లు ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నారు. రాష్ట్రంలో ఔషధ నియంత్రణ అధికారులు చేస్తున్న దాడుల్లో నకిలీ మందుల ముఠాలు భారీగా బయటపడుతున్నాయి. కొందరు కేటుగాళ్లు మార్కెట్‌లో పేరున్న కంపెనీల బ్రాండ్లతో నకిలీ ఔషధాలను తయారు చేస్తున్నారు. ఇటువంటి ఔషధాల్లో అసలు మందే ఉండటం లేదు. అలాగే కొన్నిసార్లు

మిగతా 12వ పేజీలో...




52 ఏళ్ల మహిళ.. 12 రోజుల్లో వెయ్యి కి.మీ. పరుగు

థాయ్, మలేసియా మీదుగా సింగపూర్‌కు

అల్ట్రామారథాన్ రన్నర్ నటాలీడౌ ఘనత ఇదీ

9



ట్రాన్స్‌జెండర్లకు 1% రిజర్వేషన్లు ఇవ్వండి

9

బెంగాల్ సర్కారుకు కలకత్తా హైకోర్టు ఆదేశం

భారత్-లంక మధ్య వారధి!


నిర్మాణంపై సాధ్యాసాధ్యాల అధ్యయనం తుది దశకు

శ్రీలంక అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘె వెల్లడి

ఈ వారంలో ఆ దేశానికి వెళ్లనున్న జైశంకర్?



11



నీటి కాంతి

1

అంతా సీతాకోక చిలుకలకు దారం వేలాడిందని అనుకున్నవేళ నా సంభాషణ వాటితోనే మొదలైంది. ఎండాకాలపు రాత్రి సమయంలో కోట్లాది నక్షత్రాల వెలుగులో అనేక తూటాలు నిశ్శబ్దంగా లేత శరీరాలను తాకి వుంటాయి. పాలిండ్లను గాయం చేసి వుంటాయి. అందరూ సంఖ్యను లెక్కిస్తున్నారు. నేను గత, వర్తమాన, భవిష్యత్తును అంచనా వేస్తున్నాను. నా లెక్క దారానికి వేలాడే సీతాకోక చిలుకలు కోసం. మరణ సంఖ్యలు వరి విత్తనాలు మాత్రమే.

2

మరణం ఎవరిదైనా కన్నీళ్ళు సహజం. ఇది ఆనంద విషాదాల కావ్య రచన కాదు. అనేక సీతాకోక చిలుకల యుద్ధారావం. కన్నీటి ప్రవాహం మీదుగా సముద్రం, నది, వెన్నెల, ఆయుధం నడిచి వస్తాయి. మరణం సహజం. మెదడులో సవ్వడి చేసే ప్రవాహగానం శాశ్వతం. ఎక్కడో తెగిన మంచు బిందువు చివర రాలిన అశ్రుకణం. దశాబ్దాల క్రితం బుగ్గలపై జారిన చారికను ముద్దాడుతావా. కత్తితో మరింత గాయం చేయగలవా. మృత్యువు తర్వాత మిగిలిన నిశ్శబ్దాన్ని రాజ్యం సెలబ్రేట్ చేసుకుంటుంది.

3

ఎగురుతూ వెళుతున్న సీతాకోక చిలుక తల్లి ఒడిలో పాలు తాపాన్ని పొందుతున్న పసిపాప దగ్గర ఆగింది. మౌన తంత్రుల చివరాఖరి ఆకుపై వాలింది. ఆ పసిపాప కనులను, ఆకలి పొట్టచేసే శబ్దం చివరాఖరి దృశ్యమని సీతాకోక చిలుకకు తెలియదు. తూటా శబ్దానికి చివరి ఆకు నేలపై రాలింది. పసిపాప, ఆకు పచ్చని చెట్టు, సీతాకోక చిలుక నిర్జీవ దేహాలు. మరో విధ్వంస గేయానికి రాజ్య గ్యారంటీ.

4

అరణ్య రుతువులో మట్టి నుండి బయట పడిన అస్థిపంజరాలు. అడవిని పోలిన ఆదివాసీ. అతని పాదాల కింద దాగిన రజనులో ప్రపంచపు వెలుగు వుంది.

యుద్ధ రచన అర్థమయిందా?

5

ఈ నడక అనేక మృత్యు నీడల పురాస్మృతి. తెల్లవారు జామున వినబడుతున్న విప్లవగీతం. దేహం కోట్లాది రంధ్రాలమయమైనా గొంతు నుండి పావురం కదిలి మృతదేహాలపై వాలింది. అరణ్యం, మైదానం కలిసే చోట చెల్లా చెదురయిన మనుషులు కనబడతారు. ఎర్రటికాంతి పుంజం నిండా దాహం తీరిన మనుషులు. రక్తగానం ఆగి చల్లటి నీటికాంతి శరీరాన్ని తాకుతుంది. దేశం నాలుగు పుంజీల కుబేరుల జన్మస్థలం మాత్రమేనా? కోట్లాది జీవరాశుల నీడ కదా.

6

ఇంతకీ దారాన్ని కంఠంపై దాచుకున్న సీతాకోక చిలుక అమరత్వం. తనది మాత్రమేనా! ఈ దేశానిది కదా.

(కాంకేర్ అమరవీరుల సంస్మరణలో)

అరసవిల్లి కృష్ణ
92472 53884

విభజన గాయంతో గుల్జార్ అక్షరాలాపన

బొమ్మలు: అక్బర్

మార్గరెట్ బూర్కీ వైట్ దేశ విభజన వేళ తీసిన ఫొటోలు ఆ విషాదాన్ని మన కళ్లకు కడతాయి. చెట్టుకొమ్మకు పట్టిన వరస తేనెపట్టుల్లా రైలు బోగీలకు వేలాడుతూ కనిపించే మనుషులు, కావళ్లలో వృద్ధులూ పిల్లల బరువునీ, ముఖంలో శ్రమనీ మోసుకువచ్చేవారు. ఆ ఫొటోలన్నీ టైమ్ మేగజైన్ కోసం మార్గరెట్ ఆనాడు తీశారు. గుల్జార్ అక్షరాలు ఆనాటి దుఃఖంతో ప్రతిధ్వనిస్తూ ఉంటాయి. "1947లో దేశ విభజనను సమీపంగా చూసిన వాణ్ణి. అది నన్నెంతో గాయపరిచింది. బాధపెట్టింది. ఆ బాధను, భయాన్ని నాలోనించి తొలగించుకోవడం కోసం ఆ నేపథ్యంతో కథలు రాశాను" అని చెప్పుకున్నారు గుల్జార్. దేశ విభజన రక్తపాత దృశ్యాలూ, కన్నీటి ప్రయాణాలూ, వెండితెర గీతాల జలపాతాల సమ్మేళనమే గుల్జార్ (అసలు పేరు సంపూరణ్ సింగ్ కాల్రా).

విభజన విషాదం, చరిత్ర పంజాబీలదో, బెంగాలీలదో అనుకోవడం వల్ల సానుభూతినీ, సంఘీభావాన్నీ ప్రకటించే బాధ్యతను మిగిలిన దేశం విస్మరించింది. వందేమాతరం ఉద్యమాన్నీ, నినాదాన్నీ మిగిలిన భారతావని సొంతం చేసుకున్నట్టు విభజన విషాదపు లోతులను స్వీకరించలేదు. ఒక గొప్ప సాహిత్య ధోరణితోనే దేశం ఆ అనుభవాలను పలకరించగలిగింది. అదే దేశ విభజన నాటి సాహిత్యం. అమృతా ప్రీతమ్, కుష్వంత్ సింగ్, సాదత్ హసన్ మంటో, భీష్మ సహానీ వంటి వారెందరో నాటి గాథలను అక్షరీకరించారు. గుల్జార్ వారిలో ఒకరే అయినా, ఆయన వ్యక్తీకరణ వేరు.

భారత్-పాకిస్తాన్ విభజన కేవల భౌగోళిక విభజన కాదు. ఒక నాగరికత నిలువుకోత. 'రావి నదికి ఆవల' ('రావి పార్') కథలో గుల్జార్ ఇదే చెప్పారు. దర్శన్‌సింగ్, అతడి భార్య శాహిని, వారి నవజాత కవలల కథ ఇది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని తెలుసు కానీ, అది వీరి లాయల్‌పూర్‌కు ఎప్పుడు వస్తుందో తెలియదంటారు రచయిత. దర్శన్‌సింగ్ తండ్రి చనిపోయాడు. గ్రామంలో మత కల్లోలాలు పెచ్చరిల్లడంతోనే హిందువులు, సిక్కులు అంతా గురుద్వారాలో తలదాచుకున్నారు. అక్కడే శాహిని కవలలకు జన్మనిచ్చింది. అందులో ఒక బిడ్డ బలహీనంగా ఉంది. బతికే ఆశ కనిపించదు కూడా. ఇంటిని వీడిన దర్శన్ అంతవరకు తనకు ధైర్యం చెప్పిన పెదనాన్న కూడా ఓ రాత్రి 'గొడ్డలి మీద పడి' చనిపోవడంతో, అసలు పాక్ భూభాగాన్నే విడిచిపోవాలని నిశ్చయించుకున్నాడు. తల్లి రాలేనని చెప్పేసింది. 'కాందిశీకుల కోసం ప్రత్యేక రైలు' వెళుతుంటే అందులో ఎక్కాలని దర్శన్ నిశ్చయించుకున్నాడు. ఐదురోజుల క్రితం ఇక్కడ నుంచే వెళ్లిన రైలులో ఆవగింజకు కూడా చోటు లేదట. ఇప్పుడూ అంతే. బాలింత శాహిని చూసి కొందరు దయాళువులు చోటిచ్చారు, రైలు కప్పుమీద. కవలలలో ఒక శిశువు ఆ రాపిడికి అడపాదడపా ఏడ్చినా రెండో శిశువులో చలనం ఉండదు. రైలెక్కిన కొన్ని క్షణాలకే దర్శన్‌కి అర్థమైంది, ఆ శిశువు చనిపోయింది. చుట్టూ ఉన్నవారు ఆ విగతజీవిని లాక్కుని అక్కడే పడేయాలని అనుకున్నా, తల్లిప్రాణం ఒప్పుకోదు. అన్న లేకుండా ఆ రెండోవాడు పాలు తాగడు అన్నది ఆమె వాదన. చాలాసార్లు ఆగినా, ఎట్టకేలకు రైలు ఖైరాబాద్ చేరింది. ఇక వచ్చేది గుజ్రన్‌వాలా, ఆపై గంటలోనే హిందుస్తాన్‌లో సురక్షితంగా ప్రవేశిస్తాం అనుకుంటూ ప్రాణాల మీద ఆశ పెంచుకుంటారు. రైలు ఒక వంతెన మీదకు చేరుకుంది. ఎవరో అరిచారు 'రావి నది' అని. అప్పుడే ఎవరో సలహా ఇచ్చారు దర్శన్‌సింగ్‌కి. చనిపోయిన శిశువును ఆ నదిలో పారేస్తే పుణ్యలోకాలు దక్కుతాయి కదా అని. అందుకే దర్శన్ తన భార్య చేతిలో నుంచి పొత్తిళ్లలోని ఆ శిశువును తన చేతుల్లోకి తీసుకుని ఆ నిశిరాత్రి నదిలోకి విసిరేశాడు. ఆ నీళ్లలో ఓ పసి ఆక్రందన. రైలు కప్పు మీద శాహిని మృత శిశువును గుండెలకు హత్తుకుని రోదిస్తున్నది. రైలు వంతెన దాటుతున్నందుకు జనం కొడుతున్న కేరింతలలో ఆ గొంతులు వినిపించలేదు.

విభజనతో వదులుకోవలసి వచ్చినది ఉమ్మడి వారసత్వమే. మతంతో ప్రమేయం లేకుండా ఎందరో నమ్మిన సత్యమిదే. ఈ పరిణామం వెనుక నేపథ్యం, దారి తీసిన పరిస్థితులు గుల్జార్ గొప్పగా గమనించారు. ఒక కవితలో అంటారు:

"అది ఇప్పటికీ నా జన్మభూమే.
కానీ నా దేశం ఎప్పటికీ కాదు
అక్కడికి వెళ్లాలంటే రెండు ప్రభుత్వాలవీ
అనేక కార్యాలయాల చుట్టూ నేను ప్రదక్షిణలు చేయాలి
నా కలలకు రుజువులు చూపించడానికి
ఈ ముఖానికో ముద్ర వేయించుకోవాలి" అని.

నిజానికి 'రావి నది ఆవల' కథలో సజీవంగా నదీగర్భంలోకి చేరిన బిడ్డ, గర్భశోకంతో ఆ తల్లిల నిస్సహాయ రోదనను రైలు ప్రయాణికులు వినలేకపోయారు. అదే రోదన ఈ కవితలో ధ్వనింప చేశారు గుల్జార్. మూగరోదనలకు గొంతు నివ్వడమే కదా కవి పని!

గుల్జార్ పుట్టిన గడ్డ ప్రస్తుతం పాకిస్తాన్‌లోనే ఉంది (జీలమ్ జిల్లా, దీనా గ్రామం/ఆగస్ట్ 18, 1934). దేశ విభజనతో వారి కటుంబం చెల్లాచెదురైంది. అక్కడ నుంచి బొంబాయి (నేటి ముంబై) చేరుకున్నారు వారు. అంతకు ముందు వారి కుటుంబం అమృత్‌సర్, ఢిల్లీలలోని శరణార్థి శిబిరాలలో తలదాచుకున్నారు. ఢిల్లీలో ఒక కూరల మార్కెట్ దగ్గర వారు ఉండేవారు. తండ్రి కుమారుడిని చదివించలేకపోయాడు. దీనితో గుల్జార్ ఒక పెట్రోల్ బంకులో పనిచేశారు. ఆ తరువాతే తన భవిష్యత్తును భవ్యంగా తీర్చిన బొంబాయి చేరుకున్నారు. అక్కడే ఆయనకు సాహిత్యవేత్తలతో పరిచయం కలిగింది. కలం పట్టాలన్న తృష్ణ అంకురించింది. సాహిత్య సభలలోనే ఒకసారి నాటి ప్రఖ్యాత చలనచిత్ర గాయకుడు శైలేంద్రతో పరిచయం ఏర్పడింది. బిమల్‌రాయ్ చిత్రాలకు పని చేసే అవకాశం వచ్చింది. గుల్జార్ జీవితంలో గొప్ప లక్షణం, చలనచిత్ర పరిశ్రమకు ఎంత సన్నిహితమైనా ప్రధాన స్రవంతి సాహిత్యరంగానికి దూరం కాలేదు.

గుల్జార్‌కు దేశ విభజన దుఃఖంతో పాటు, వ్యక్తిగత జీవితంలో ఒక ఎడబాటు ఉంది. ఆయన పసితనంలోనే తల్లి కన్నుమూశారు. మారుటితల్లి సరిగా చూసేది కాదు. దీనితో తండ్రి మఖన్‌సింగ్ నడిపే చిన్న దుకాణంలోనే ఎక్కువ సమయం గడుపుతూ ఉండేవారు. పాఠ్య పుస్తకాలంటే నిరాసక్తత. రవీంద్రనాథ్ టాగూర్, శరత్‌చంద్ర సాహిత్యం ఆయనను బాగా ప్రభావితం చేశాయి. మొదట్లో ఉర్దూ, పంజాబీ భాషలలో కవిత్వం రాసేవారు. కవిగానే కాకుండా, వచన రచయితగా ఆయనకు ఖ్యాతి ఉంది. 'రెండు' ఆయన నవల. ఇందులో ఇతివృత్తం దేశ విభజన నాటి విషాదమే.



ప్రపంచ యుద్ధాలు, నియంతృత్వాలు, ఘోర దుర్భిక్షాలు కాలం మీద సుదీర్ఘంగా వాటి నీడను పరిచాయి. 1947 నాటి దేశ విభజన విషాదం జాడ కూడా కాలం మీద ఎంతో సుదీర్ఘంగా ఉంది. గుల్జార్ రచనలలో ఆ నీడ, జాడ గమనిస్తాం. అవన్నీ 'ఫుట్‌ప్రింట్స్ ఆన్ జీరో లైన్: రైటింగ్ ఆన్ ది పార్టిషన్' పేరుతో సంకలనంగా వెలువరించారు. ఒకటి వాస్తవం. ఆ చరిత్ర మిగిల్చిన ఆ విషాదానికి ప్రత్యక్ష సాక్షులు లేదా బాధితులు ఆ జ్ఞాపకాలని తుడిచివేయాలని అనుకున్నా సులభం కాదు. ఆ విషాదం ఇతివృత్తంగా ఉన్న కథలు చదివిన వాళ్లలో మరొకసారి ఆ బాధ మరొకసారి గుర్తుకు రాకూడదని గుల్జార్ ప్రగాఢంగా వాంఛించారు. చరిత్ర చేసిన గాయం సాధ్యపడనివ్వలేదు. ఈ గుంజాటనకి అక్షరరూపమే 'విభజన' కథ.

సంపూరణ్‌సింగ్ అంటే మరెవరో కాదు విభజన సమయంలో విడిపోయిన తమ కుమారుడేనని హర్భజన్‌సింగ్ అనే ఆయన, ఆయన భార్య గట్టి నమ్మకం. గుల్జార్‌కు ఆ మేరకు ఉత్తరాలు కూడా రాశారు. అంతటితో ఆగకుండా ఈ విషయం నిర్ధారించుకునే పనిలో సాయపడేందుకు ఆ దంపతులు కొందరు ప్రముఖులను ఆశ్రయించారు. బాలివుడ్ ప్రముఖులు సాయి పరాంజపే, అమోల్ పాలేకర్, జనతా పార్టీ ప్రముఖుడు మధు దండావతే భార్య వారిలో ఉన్నారు. మొత్తానికి ఆ దంపతులను గుల్జార్ కలుసుకున్నారు. నీవు ఆనాడు తప్పిపోయిన మా అబ్బాయి ఇక్బాల్‌సింగ్‌వేననీ, పేరు మార్చుకున్నావనీ వాదిస్తారు వారు. ఈ కథలోనే విభజన నాటి అంతటి విద్వేషంలోను అక్కడక్కడా విరిసిన మత సామరస్యం గురించి చెబుతారు గుల్జార్. ఆఖరికి, నీవు ఎక్కడున్నా ఫరవాలేదు, మతం మారినా పట్టించుకోను. కానీ నీవు నా కొడుకువే అన్న సంగతి మరచిపోవద్దు అంటుంది ఆ తల్లి. చాలా రోజులకి హర్భజన్ మరణించినట్టు సమాచారం వస్తుంది. మనసులో ఏదో మూల రోదన. ఇలా ముగించారీ కథ (అనువాదం: సి. మృణాళిని).

"కళ్లకు వీసాలతో పనిలేదు/ స్వప్నాలు సరిహద్దులెరుగవు
నేను మూసిన కళ్లతో నిత్యం/ సరిహద్దులు దాటతాను
మెహిదీ హసన్‌ను కలుసుకోవడానికి!"

ఈ కవితలో గుల్జార్ ప్రస్తావించిన మెహిదీ హసన్ రాజస్థాన్ వాసి. గొప్ప గజల్ గాయకుడు. ఆయన 1947లో పాకిస్తాన్ వలస వెళ్లిపోయారు. పాకిస్తాన్ నుంచి గుల్జార్ భారత్‌కు వలస వచ్చారు. ఇదొక వైచిత్రి. తరువాత తాను భారత్‌కు వెళతానంటే పాకిస్తాన్ వీసా నిరాకరించిందని హసన్ వాపోయారు. పైగా ఒకనాడు కరాచీ నగరాన్నీ, బొంబాయి నగరాన్నీ అక్కచెల్లెళ్ల వంటివని పిలిచేవారు. ఎందుకంటే రెండూ సాగరతీరాలే. ఎన్నో పోలికలు వాటి మధ్య. విభజనలో నాయకులు మరచిపోయిన ఉమ్మడి వారసత్వం గురించి ఎందరో వ్యథ చెందేవారు. ఒక కవితలో గుల్జార్ ఆ వ్యథనే ఎంతో గొప్పగా చిత్రించారు. "మీ నగరంలో పడి ఉన్న శవాల మీద గద్దలు ఎగురుతున్నాయి, ఇక్కడ మా నగరంలోని కూడళ్లలోనూ (అంటే ముంబై) అదే దృశ్యం" అన్నారాయన.

విభజన నాటి రక్తపాతాన్నీ, భయాన్నీ నిర్దేశించినది ఒక్కటే! "హిందువులు మరింత హిందువులుగానూ, ముస్లింలు మరింత ముస్లింలగానూ ప్రవర్తించడం" ('పొగ' కథలోని ఒక వాక్యం). ఇదే బొంబాయి నేపథ్యంగా సాగిన కథ 'భయం' (కావూఫ్) ఇతివృత్తం. యాసిన్ అనే ముస్లిం యువకుడు లోకల్ ట్రైన్‌లో పొందిన అనుభవం, చేసిన దుర్మార్గం ఇందులో ఇతివృత్తం. అతడికి ప్రతి హిందువూ ఇద్దరుముగ్గురిగా కనిపిస్తారు. ఒక స్టేషన్‌లో మరొక యువకుడు ఎక్కాడు. ఇతడి ముఖానికి మఫ్లర్ ఉంది. 'అతడు హిందువే' అని తీర్మానించుకున్నాడు యాసిన్. అతడితో తనకు ప్రాణహాని ఉందని మరుక్షణంలో నమ్మకానికి వచ్చేశాడు. ఎందుకంటే ఆ అపరిచితుడు జేబులో పెట్టిన చేయి తీయడం లేదు. అంటే ఆయుధంతో సిద్ధమవుతున్నాడు. తనని చంపడానికి ముందే తాను అతడిని చంపాలని నిర్ణయించుకున్నాడు యాసిన్. రైలు భయాందర్ వంతెన మీదకు వచ్చింది. అతడు బోగీ గుమ్మం దగ్గర ఆదమరచి ఉండగా యాసిన్ వెళ్లి బలంగా బయటకు నెట్టేశాడు. మరుక్షణం ఒక ఆక్రందన- 'అల్లా' అంటూ! దీనికి ఇలా అనూహ్యమైన ముగింపు ఇచ్చారు గుల్జార్. "అది అలా జరగాల్సి ఉంది మరి! ఏం చేస్తాం!" అంటాడు యాసిన్ భార్యతో.

ఆరు దశాబ్దాల క్రితం బల్‌రాజ్ సహానీ నటించిన కాబూలీవాలా సినిమాతో గుల్జార్ వెండితెర ప్రయాణం ప్రారంభమైంది. పాటలతో పాటు, పలు చిత్రాలకు ఆయన సంభాషణలు కూడా కూర్చారు. దర్శకత్వం చేపట్టారు. మాచిస్, ఆంధీ, మౌసమ్, ఖుష్బూ, పరిచయ్, కోషిష్, రుడాలి వంటి చిత్రాలకు ఆయన అందించిన గేయాలు ఎంతో ఖ్యాతి గాంచాయి. స్లమ్‌డాగ్ మిలియనీర్‌కు ఆస్కార్ పురస్కారం లభించింది. గుల్జార్‌ను చలనచిత్ర గేయ రచయితగా మాత్రమే పరిగణించలేం. ఆయనకు ఉర్దూ, హిందీ సాహిత్య ప్రపంచాలలో ప్రత్యేక స్థానం ఉంది.

> దేశ విభజన విషాదం, చరిత్ర పంజాబీలదో, బెంగాలీలదో అనుకోవడం వల్ల సానుభూతినీ, సంఘీభావాన్నీ ప్రకటించే బాధ్యతను మిగిలిన దేశం విస్మరించింది. వందేమాతరం ఉద్యమాన్నీ, నినాదాన్నీ మిగిలిన భారతావని సొంతం చేసుకున్నట్టు విభజన విషాదపు లోతులను స్వీకరించలేదు. ఒక గొప్ప సాహిత్య ధోరణితోనే దేశం ఆ అనుభవాలను పలకరించగలిగింది. అదే దేశ విభజన నాటి సాహిత్యం. అమృతా ప్రీతమ్, కుష్వంత్ సింగ్, సాదత్ హసన్ మంటో, భీష్మ సహానీ వంటి వారెందరో నాటి గాథలను అక్షరీకరించారు. గుల్జార్ వారిలో ఒకరే అయినా, ఆయన వ్యక్తీకరణ వేరు.

గోపరాజు నారాయణరావు

కవితాసంపుటాలకు ఆహ్వానం

విమలా స్మారక 'విమలాశాంతి సాహిత్య పురస్కారం - 2024' కోసం కవుల నుండి 2022, 2023 సంవత్సరాలలో ప్రచురించబడిన వచన కవితా సంపుటాలను ఆహ్వానిస్తున్నాం. కవులు తమ కవితా సంపుటాలు నాలుగేసి కాపీలను జులై 15 లోగా చిరునామా: ఉప్పరపాటి వెంకటేశులు, 16-37-1, రాహుల్ నివాస్, ప్రశాంతినగర్, అనంతపురం - 515004కు పంపాలి.

శాంతి నారాయణ

ఆచార్య ఎన్.జి. రంగ సాహిత్యపురస్కారం

ఎన్.జి.రంగ సాహిత్య పురస్కారం-2024 కోసం 2021-2023 మధ్య ప్రచురితమైన రచయిత్రుల నవలలను జులై 20 లోపు నాలుగు ప్రతులను చిరునామా: నాగభైరవ ఆదినారాయణ, 202, శ్రీ వెంకటసాయి రెసిడెన్సీ రామయ్యనగర్, ఒంగోలు - 523002కు పంపాలి. నవలల్లో మొదటి, రెండు స్థానాల్లో నిలిచిన నవలలకు రూ.10వేలు, రూ.5వేలు చొప్పున బహుమతులు ఉంటాయి. మరిన్ని వివరాలకు: 9849799711.

ఆదినారాయణ

'మాటల చెట్టు' కవితాసంపుటి ఆవిష్కరణ

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ-తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ ఆధ్వర్యంలో గడ్డం సులోచన రాసిన 'మాటల చెట్టు' కవితా సంపుటిని జూన్ 22 ఉ.10గం.లకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. ఆవిష్కరణ నందిని సిధారెడ్డి, అధ్యక్షత కందుకూరి శ్రీరాములు. సభలో నాళేశ్వరం శంకరం, ఉదారి నారాయణ తదితరులు పాల్గొంటారు.

తెలంగాణ రచయితల సంఘం (జంటనగరాలు)

ఖమ్మం ఈస్థటిక్స్ - రచనల ఆహ్వానం

ఖమ్మం ఈస్థటిక్స్ పేరిట ప్రతి యేటా ఒక ఉత్తమ కవితా సంపుటికి, మూడు ఉత్తమ కథలకు ఇచ్చే పురస్కారాలకు ఇదే ఆహ్వానం. మూడు ఉత్తమ కథలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ పురస్కారాలు ఇస్తూ (వీటి బహుమతులు వరుసగా: రూ.25వేలు, 15వేలు, 10వేలు), మరికొన్ని కథలను కూడా సాధారణ ప్రచురణకు ఎంపిక చేసి పుస్తకంగా అచ్చువేస్తాం. ఉత్తమ కవితా సంపుటికి రూ.40 వేల రూపాయల నగదు బహుమతి ఉంటుంది. కవితా సంపుటి 2023 ఏప్రిల్, 2024 మార్చ్ నడుమ ప్రచురితమై ఉండాలి. సంపుటి కనీసం 25 కవితలకు తగ్గకుండా ఉండాలి. పురస్కారం కోసం నాలుగు ప్రతులను పంపాలి. పోటీకి పంపే కథలు కేవలం ఈ పురస్కారం కోసం మాత్రమే రాసినవై ఉండాలి. కథ ప్రింట్ నాలుగు ప్రతులను పోస్టులో పంపి, ఈమెయిల్‌కు యూనికోడ్ సాఫ్ట్ కాపీ కూడా పంపాలి. ఖమ్మంలో నవంబర్‌లో జరిగే వేడుకలో అవార్డుల ప్రదానం ఉంటుంది. కథలు, కవితా సంపుటులు ఆగస్ట్ 31, 2024 లోపు పంపాల్సిన చిరునామా: ఖమ్మం ఈస్థటిక్స్, హార్వెస్ట్ స్కూల్, 5-7-200/11, పాకబండ బజార్, ఖమ్మం - 507002. ఫోన్: 9849114369. ఈమెయిల్: khammamaesthetics@gmail.com

ఖమ్మం ఈస్థటిక్స్

గిరిజన జీవితాల్లోకి తెరిచిన తలుపులు సువర్ణముఖి కథలు

"ఈ విప్లవాగ్నులు ఎవటివని అడిగితే
శ్రీకాకుళము వైపు చూడమని చెప్పాలి"

శ్రీకాకుళం అనగానే శ్రీకాకుళంతో ప్రత్యక్ష పరిచయం లేనివాళ్ళకు గుర్తొచ్చేది గిరిజనోద్యమ పోరాటం. ఆ ఉద్యమ స్ఫూర్తితో, గిరిజన జాతుల జీవన సంస్కృతిని అవలోకనం చేసుకొని ఉత్తరాంధ్ర తొలి గిరిజన కథ రాసిన రచయిత భూషణం మాస్టారు. వారికి కొనసాగింపుగా అంతే బలంగా గిరిజన కథ రాసుకొచ్చిన కథకులు సువర్ణముఖి. వీరి నుండి శక్తివంతమైన గిరిజన కథ వెలువడడానికి ప్రధాన కారణం సువర్ణముఖి ఉద్యమకారునిగా గిరిజనులతో మమేకమై జీవించడం. తన సృజనాత్మకతలో ఉద్యమాన్ని లీనం చేసుకొన్న రచయిత. గిరిజన జీవితాలను, ఆరాటాలను, పోరాటాలను, సంస్కృతులను, సాంప్రదాయాలను, ఆచారాలను, మూఢనమ్మకాలను, విశ్వాసాలను, నేస్తరికాన్ని దగ్గరగా చూసిన కథకులు సువర్ణముఖి. ఆయన కథలు రావిశాస్త్రిని సైతం తలపిస్తాయి.

1970 దశకం తరవాత గిరిజన కథ జవసత్వాలను పుంజుకుంది శ్రీకాకుళ ఉద్యమ దన్నుతోనే. పోరాటాన్ని, నిర్బంధాన్ని, పునర్నిర్మాణాన్ని దశలవారిగా ఉత్తరాంధ్ర కథకులు అక్షరీకరిస్తూ వచ్చారు. సువర్ణముఖి తన కథల్లో నిర్బంధాన్ని, ఉద్యమ పునర్నిర్మాణాన్ని క్రోడీకరించుకుని కథలుగా రాసారు. 1989-95 మధ్య కాలంలో తొమ్మిది కథలను 'సువర్ణముఖి కథలు' పేరుతో ప్రచురించారు. రెండు దశాబ్దాల తర్వాత 2017లో 'గోరపిట్ట' పేరుతో మరొక కథల సంపుటి వెలువరించారు. శ్రీకాకుళ పోరాట మలిదశ కాలంలో వెలువడిన కథలుగా వీటిని గుర్తించవచ్చు.

ఉత్తరాంధ్ర గిరిజన కథా సాహిత్యంలో స్వీయానుభవ కథకుల కంటే సహానుభవంతో రాసిన కథకులే ఎక్కువ మంది కనిపిస్తారు. దానికి ప్రధాన కారణం మైదాన ప్రాంత ప్రజలకు చేరువైనట్లుగా గిరిజన ప్రాంత ప్రజలకు విద్య అందలేదు. కొండలకు ఆనుకుని ఉన్న అడవుల్లో నివసించే గిరిజన తెగలలో క్రమపరిణామాల్ని చిత్రించాలంటే వారి జీవితాలతో రచయితలకి చాలా దగ్గర సంబంధం ఉండాలి. అలాంటి సంబంధాన్ని కలిగి, ఉత్తరాంధ్రలో ఉన్న సవర, జాతాబు, గదబ, కొండదొరల జీవితాల్లో వచ్చిన మార్పులను సాంస్కృతిక నేపథ్యం నుంచి చిత్రించినవిగా సువర్ణముఖి కథలు కనిపిస్తాయి.

విజయనగరం జిల్లా అంతటా ప్రవహించే సువర్ణముఖి నది పేరును తన కలం పేరుగా రౌతు బంగారునాయుడు మార్చుకున్నారు. సువర్ణముఖి ఎంచుకున్న కథా వస్తువలు ఎచ్చుతక్కువలు లేకుండా కచ్చితత్వం కలిగి ఉంటాయి. తాను చూసిన గిరిజన తాత్విక జీవితాలను, గత పోరాట జ్ఞాపకాలను మదిన నిలుపుకొని తన కథలు నడిపారు.

> ఉత్తరాంధ్ర గిరిజన కథా సాహిత్యంలో స్వీయానుభవ కథకుల కంటే సహానుభవంతో రాసిన కథకులే ఎక్కువ మంది కనిపిస్తారు. దానికి ప్రధాన కారణం మైదాన ప్రాంత ప్రజలకు చేరువైనట్లుగా గిరిజన ప్రాంత ప్రజలకు విద్య అందలేదు. కొండలకు ఆనుకుని ఉన్న అడవుల్లో నివసించే గిరిజన తెగలలో క్రమపరిణామాల్ని చిత్రించాలంటే వారి జీవితాలతో రచయితలకి చాలా దగ్గర సంబంధం ఉండాలి.

1967 అక్టోబర్ 31న వందలాది గిరిజనులు-పిల్లాపాపా, స్త్రీలు, వృద్ధులు అందరి అడుగులు మొండెంఖల్లు గిరిజన సభా ప్రాంగణంవైపు. ఆ సభకు వచ్చిన కొండగొర్రె మంగన్న, ఆరిక మంగన్న అనే ఇద్దరు ఆదివాసీలు అమరులయ్యారు. వారిరువురితోపాటుగా శ్రీకాకుళ పోరాటంలో అసువులు బాసిన అమరవీరుల స్థూపం ప్రారంభోత్సవానికి జాతరగా బయలుదేరిన అశేష జనసంద్రాన్ని దృశ్యీకరించిన కథ



'యాతర'. ఈ కథలో వారు ప్రయోగించిన భాష మరింత ఆకర్షణీయంగా ఉంటుంది. "తూం మీద అడ్డ, అడ్డ మీద తవ్వ, తవ్వ మీద సోల, సోల మీద గిద్ద, గిద్ద మీద సుత్తీ కొడవలి" అని స్థూపం గురించి వచనం చెప్పడంలోనూ ముక్తపదగ్రస్త అలంకారాన్ని ప్రయోగించారు. చివరకు ఆ స్థూపం "పుట్టిడు బియ్యం పట్టిన గూనలాగ మిగిలింది" అనడంలో కూడా ఉపమాలంకారం చూపించారు. స్థానిక భాషను ప్రయోగిస్తూ ఆ అమరవీరు త్యాగాన్ని గురించి ఈ కథలో తెలిపారు.

గిరిజనుల 'కొండగాలి'లోకి పల్లం వాళ్ళ 'కొత్తగాలి' ప్రవేశంతో వాళ్ళ బతుకులు చిన్నాభిన్నంగా మారిపోయాయి. పాలన పేరుతో, వ్యాపారం పేరుతో, చట్టం పేరుతో, కొండల్లోకి, అడవుల్లోకి, గూడెంలోకి ప్రవేశించి అడివిని, కొండని దోచుకున్నారు. ఆ దోపిడికి సాక్షమే 'సావుకర్సు' కథ. శ్రీకాకుళ పోరాటంలో అసువులు బాసిన అమర వీరుల త్యాగ ఫలితాలకు కొండకి విద్యుత్, రోడ్డు, కార్పోరేషన్, బడులు వచ్చాయి. "ఓరే సుబ్బా! మీ యమ్మని కుడిసేత్తోటి సంపీసి, ఎడమ సేత్తోటి పాలిచ్చి తాగమంటే తాగుతావురానువ్వు...? అలగే చేసినార్రా. సంపీసి సావుకర్సు ఇచ్చినార్రా!" అని రచయిత పలికించిన మాటల్లో గిరిజనుల వాస్తవ జీవితం దాగి ఉంది. సందర్భానుసారంగా ప్రయోగించిన భాష, అలంకారాలు కథకు మరింత సౌందర్యాన్ని తెచ్చి పెట్టాయి. "కరెంట తంబామీ్మద ఎవలో చుట్ట కాలుతున్నట్టగ ఎర్రగ రంగమ్మిరపకాయనాగ ఎలుగెలిగి పోతుంది, కరెంటుబుడ్డీ" అని చెప్పడంలో స్వచ్ఛమైన ఉత్తరాంధ్ర భాష దాగి ఉంది. గిరిజనుల కష్టం ఏ రీతిగా పల్లం ప్రజల, అధికారుల చేతిలోకి వెళ్ళిపోతుందో రచయిత తనదైన శైలిలో చెప్పారు. "వెండి పోతలాగ పార్తంది ఏరు. కొండమీదున్న సవరోళ్ళ సెమటే గావల వూటల్లాగ అలగ కారికారి ఒక దగ్గర చేరిచేరి ఇలా నార్లంది. అది తిన్నగ 'వనజ' పండివోడి భూమిలోకి, దాన్నించి 'జియ్యమ్మవల్స' మండలాదికొరిగోరి భూమిలోకి ఎల్లిపోతాది. సవరోళ్ళ సెమట అక్కడ సరుకైపోద్ది" అని రాస్తారు సువర్ణముఖి.

సువర్ణముఖి కథల్లో నాటకీయత ఉంటుంది. కథ విభిన్నంగా నడుస్తుంది. ఆదివాసిల ఘర్షణలను, ఘటనలను చిత్రీకరించిన తీరుకు సంబంధించి 'పండుగ', 'గోరపిట్ట', 'సుక్కి' కథలు కనిపిస్తాయి. ఈ కథలన్నీ విస్తృతమైన నిడివి కలిగి ఉంటాయి. ప్రభుత్వం ప్రజాదర్బార్ పథకంలో భాగంగా గిరిజన యువకుల్ని ఆకర్షించి పోలీసు ఉద్యోగాలిచ్చి ఇన్‌ఫార్మర్‌లుగా మార్చడం, ఫలితంగా ఉద్యమకారులంతా ఉద్యోగాల్లో చేరిపోవడం 'పండుగ' కథలో కనిపిస్తుంది. కొండ ప్రాంతంలో జీవిస్తున్న సవరలు నాగరిక సమాజం ఇష్టానికి అనుగుణంగా జీవించే ప్రయత్నంలో మోసపోతున్నారు. అడవిలో ప్రవేశించిన గిరిజనేతరుల చేతిలో నలిగిపోతున్న ఆదివాసి మహిళల ఆత్మఘోష 'గోరపిట్ట' కథ.

"సువర్ణముఖి ఎప్పుడూ ఒక వాతావరణం, ఒక దృశ్యం, ఒక సంఘటన లేకుండా మనముందు ఒక సత్యాన్ని ఆవిష్కరించడు" అని వరవరరావు అన్నట్లుగా శక్తివంతమైన శైలితో, స్వచ్ఛమైన భాషతో ఆయన కథలు మనల్ని వెంటాడతాయి. ఇంత మంచి కథలు వెలువడడానికి ప్రధాన భూమిక శ్రీకాకుళ గిరిజనోద్యమం. ఆ పోరాట అనుభవాలలో పెరిగినవారు సువర్ణముఖి. ఉద్యమ సాహిత్యాన్ని ఆకళింపు చేసుకొని ఆదివాసిల జీవితపు పార్శ్వాలను విభిన్న కోణాల్లో చూపించారు.

సారిపల్లి నాగరాజు
80083 70326



రెండు చేతులు

అవంటే ఎంతో ఇష్టం నాకు
వాటిలో నా మొఖం దాచుకొనేంత ఇష్టం
ఆ రెండు చేతుల కోసం బ్రతుకంతా
చేతులు చాచి ఎదురుచూసేంత ఇష్టం
ఆ చేతులే..
నా అడుగులు తడబడుతున్నప్పుడు
కొండంత ఆసరాగా మారి పట్టి నిలుపుతాయి
చెంపలను నిమిరి
నా తడి కళ్ళను
చూపుడు వేలుతో అద్ది ముద్దాడుతాయి
పసికూనల్ని రెక్కల చాటుకు చేర్చుకున్న
తల్లి పక్షిలా
నన్ను తన కౌగిట్లో భద్రంగా పొదువుకుంటాయి

ఆ చేతులు..
తడారిపోయిన నా పెదవులకు
చెలిమి వెన్నను పూస్తాయి
నా పరిసరాల చుట్టూ
సువాసనలు వెదజల్లి
నాతో మాట్లాడిస్తాయి
మృదువైన మాటల్లో నన్ను ముంచి తీస్తాయి
అలసిన నా నుదుటిపై స్వేదాన్ని తుడిచి
చెదిరిపోయిన నా ముంగురులు సవరిస్తాయి
వేకువ చల్లదనాన్ని విసిరి
కొత్త రాగాన్ని నా గొంతులో ఒలకబోస్తాయి

ఆ చేతుల కోసం ఎన్నాళ్లుగానో
వెతుకుతున్నాన్నేను
కలనైనా కనిపించి అక్కున చేర్చుకుంటాయేమోనని
నిద్ర వాకిలి చెంత కూర్చొని నిరీక్షిస్తున్నాను
ఆ చేతుల దిండుపై తలవాల్చి
నన్ను నేను మరచిపోతూ
ఆ భ్రమల్లోనే మురిసిపోతూ
బతుకు రేక తెల్లబడే దాకా బతికిపోతుంటాను

సునీత గంగవరపు
94940 84576

హసిని రామచంద్ర లిటరరీ ఫౌండేషన్ (హెచ్ఆర్‌సి) కథలు, కవితల పోటీలు

హెచ్ఆర్‌సి కథల, కవితల పోటీ కోసం ప్రయోజనాత్మక అంశాలతో రచనలను జూన్ 25లోగా 9502818774 నంబరుకు వాట్సప్‌తోపాటు నాలుగు ప్రతు లను చిరునామా: తోట సుభాషిణి, ఇం.నెం. 15-13-309, బ్యాంకు కాలనీ, ఖమ్మం- 507002కు పంపాలి.

సుభాషిణి తోట


పాలపిట్ట దాశరథి శతజయంతి సంచిక కోసం రచనల ఆహ్వానం

ఈ ఏడాది జూలై 22న దాశరథి కృష్ణమాచార్యులు శతజయంతి సంవత్సరం ఆరంభమవుతున్న సందర్భంగా దాశరథి శతజయంతి సంచికని తెస్తున్నాం. ఇందుకోసం దాశరథి కృష్ణమాచార్యులతో అనుబంధం గలవారు వారితో తమ జ్ఞాపకాలు, సాహిత్య సంబంధాల గురించి వ్యాసాలను, ముఖ్యంగా దాశరథి పాల్గొన్న సభల ఫోటోలను, వారితో ఉన్న తమ ఫోటోలను, దాశరథి రాసిన ఉత్తరాలను చిరునామా: ఎడిటర్, పాలపిట్ట, ఫ్లాట్ నెం: 2, ఎం.ఐ.జి-2, ఏపిహెచ్‌బి, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్- 500044కు పంపగోరుతున్నాము. ఫోన్: 9490099327, ఈమెయిల్: palapittabooks@gmail.com

పాలపిట్ట

5

త్యాగాల పండుగ బక్రీద్



- నేడు జరుపుకోనున్న ముస్లింలు
- ముస్తాబైన మసీదులు, ఈద్గాలు
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రత్యేక ప్రార్థనలు



ముస్లింలు జరుపుకునే ముఖ్యమైన పండుగల్లో బక్రీద్ ఒకటి. ధనిక, పేద తారతమ్యం లేకుండా ముస్లింలందరూ ఈ పండుగను జరుపుకుంటారు. ఇస్లాం మతంలో రంజాన్ తరువాత అంత ప్రాముఖ్యత ఉన్న పండుగ ఈదుల్ జుహా (బక్రీద్). దీనినే త్యాగాల పండుగ అనికూడా పిలుచుకుంటారు. ఈదుల్ ఫితర్ తరువాత రెండు నెలలకు ఇస్లాం క్యాలెండర్ ప్రకారం 12వ నెల (జుల్ హుజ్జా) 10వ రోజున బక్రీద్ పండుగను జరుపుకుంటారు. దైవాజ్ఞకు లోబడి ఆ అల్లాహ్‌కు విశ్వాసంగా ప్రతీ ముస్లిం పరోపకార బుద్ధితో, శాంతియుత జీవనం గడుపుతూ ఎంతటి త్యాగానికైనా సిద్ధంగా ఉండాలనే సందేశాన్ని ఈ పండుగ తెలియజేస్తుంది. సోమవారం బక్రీద్‌ను నిర్వహించుకునేందుకు ముస్లింలు సంసిద్ధమయ్యారు. ప్రార్థనలు చేసేందుకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఈద్గాలు, మసీదులను ముస్తాబు చేశారు.



- మహబూబాబాద్ (ఆంధ్రజ్యోతి)/జఫర్‌గడ్



- పర్యాటకంగా మేడారం అభివృద్ధికి ప్రణాళిక
- జాతరప్పుడే అందుబాటులో గిరిజన మ్యూజియం, ఓపెన్ థియేటర్, ట్రైబల్ విలేజ్ సెట్టింగ్
- స్మృతివనం ఏర్పాటుతో పెరగనున్న సందర్శకులు
- జాతీయ పండుగ హోదా, నిధులకోసం మంత్రి సీతక్క ప్రయత్నాలు

5

ప్రకృతి దేవతలు సమ్మక్క, సారలమ్మలు. ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారం అభయారణ్యంలో కొలువైన తల్లుల దర్శనం భక్తులకు అనిర్వచనీయ అనుభూతి. రెండేళ్లకో సారి మహాజాతర, ఏడాదికోసారి మినీ జాతర జరుగుతుండగా లక్షలాది మంది భక్తులు తరలివచ్చి వనదేవతలను దర్శించుకుంటున్నారు. కొన్నేళ్లుగా సాధారణ రోజుల్లో కూడా తల్లులను దర్శించుకునే వారి సంఖ్య పెరుగుతోంది. మేడారం పరిసరాలు, అటవీ ప్రాంతంలో విడిదిచేసి ఆహ్లాదంగా గడుపుతున్నారు. ఈ నేపథ్యంలో వనదేవతల సన్నిధిని ఆధ్యాత్మికంగాను, పర్యాటకంగానూ అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. జాతీయ పండుగ హోదాను సాధించడంతోపాటు మేడారం ఖ్యాతిని నలుచెరుగులా చాటిచెప్పేలా చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా 25 ఎకరాలలో సమ్మక్క సారలమ్మలతోపాటు వనదేవతలకు సంబంధించిన విశేషాలతో స్మృతివనం నిర్మించనుంది.

- ములుగు

హనుమకొండ కలెక్టర్‌గా బాధ్యతలు

చేపట్టిన ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, జూన్16: హనుమకొండ జిల్లా నూతన కలెక్టర్‌గా పి.ప్రావీణ్య ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడి కలెక్టర్ సిక్తా పట్నాయక్ నారాయణ పేట జిల్లా కలెక్టర్‌గా బదిలీపై వెళ్లగా, ఆమె స్థానంలో ప్రావీణ్య కలెక్టర్‌గా నియామకమయ్యారు. హనుమకొండ సుబేదారిలోని కలెక్టరేట్ సముదాయ భవనానికి చేరుకున్న నూతన కలెక్టర్ ప్రావీణ్యకు జిల్లా అదనపు కలెక్టర్లు రాధికా గుప్తా(లోకల్ బాడీస్), వెంకట్ రెడ్డి (రెవెన్యూ), డీఆర్వో వైవీ గణేష్‌లు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ప్రావీణ్య కలెక్టరేట్‌లోని ఛాంబర్‌లో రిజిస్టర్‌పై సంతకం చేసి విధుల్లో చేరారు.



కలెక్టర్‌గా బాధ్యతలు చేపడుతున్న ప్రావీణ్య

సజావుగా సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష

- పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన అబ్జర్వర్ హరిహర్ రథ్

హనుమకొండ కలెక్టరేట్, జూన్ 16: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండ జిల్లాలో జరిగిన యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష సజావుగా సాగినట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. పరీక్షాకేంద్రాలలో అభ్యర్థులకు కల్పించిన వసతులపై సంబంధిత అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ పరీక్షకు 4,730 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, ఉదయం నిర్వహించిన పరీక్షకు 2,637 (55.75 శాతం) మంది అభ్యర్థులు హాజరు కాగా, మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 2,614 (55.26శాతం) మంది అభ్యర్థులు హాజరైనట్లు కలెక్టర్ తెలిపారు.

తనిఖీ చేసిన అబ్జర్వర్

యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష కేంద్రాలను యూపీఎస్సీ అబ్జర్వర్ హరిహర్ రథ్, టీఎస్ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డితో కలిసి తనిఖీ చేశారు. హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, గాయత్రి డిగ్రీ, పీజీ కళాశాల, సీడీసీ డీమ్డ్ యూనివర్సిటీ, ఢిల్లీ పబ్లిక్ స్కూల్, పింగిళి ప్రభుత్వ జూనియర్ కళాశాల, తాళ్ల పద్మావతి ఇంజనీరింగ్ కళాశాల, న్యూసైన్స్ డిగ్రీ, పీజీ కళాశాల, మాస్టర్జీ డిగ్రీ కళాశాల, ఎస్ఆర్ నేషనల్ హై స్కూల్‌లోని పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.



అభ్యర్థిని హాల్ టికెట్‌ను పరిశీలిస్తున్న పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ అబ్దుల్ బారి

అంతర్ రాష్ట్ర కార్ల దొంగల ముఠా అరెస్టు

- రూ.70లక్షల విలువైన 5 కార్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీసీపీ అబ్దుల్ బారీ

మట్టెవాడ, జూన్ 16: ఫైనాన్షియర్ ముసుగులో మోసపూరితంగా కార్లు, టిప్పర్లు, జేసీబీ వంటి భారీ వాహనాలను కొనుగోలు పేరుతో ఇతరులకు, స్క్రాప్, నెదర్లాండ్, సౌత్‌ఆఫ్రికా, కాంబోడియా లాంటి దేశాలకు విక్రయిస్తున్న రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలానికి చెందిన దశరథ్ ముఠాను అరెస్టు చేసినట్లు వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ అబ్దుల్ బారి తెలిపారు. ఆదివారం వరంగల్ మట్టెవాడ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తురకలకుంట గ్రామానికి చెందిన వరికుప్పల దశరథ్, పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం వసంతనగర్ చిన్నదుర్గం సందాన్, రంగారెడ్డి జిల్లా మేడ్చల్ మండలం జగద్గిరిగుట్టకు చెందిన కొశెట్టి రాకేశ్, హైదరాబాద్ సంతోష్‌నగర్ ఓల్డ్ సిటీకి చెందిన మహ్మద్ జాబీర్‌లు ఈ దందాకు తెరలేపారన్నారు. వీరు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో ఆర్థిక ఇబ్బందులతో భారీ వాహనాలు అమ్మకానికి పెట్టుకున్న యజమానుల నుంచి వాహనాలు కొనుగోలు చేసి, వాటికి సంబంధించిన ఫైనాన్స్ ఈఎంఐలు తామే కడతామని నమ్మించి, మోసపూరితంగా వాహనాలు తీసుకొనేవారన్నారు. వాటిని ఇతరులకు విక్రయించడమో లేదా స్క్రాప్ కింద అమ్మడమో చేస్తారన్నారు. అలాగే ముంబయిలోని కొన్ని బృందాల ద్వారా విదేశాలకు ఎగుమతి చేసేవారని డీసీపీ వెల్లడించారు. ముఠా సభ్యులు గతంలో హైదరాబాద్‌లోని పోలీసులకు పట్టుబడి సుమారు 16నెలలు జైలుకు వెళ్లారని, జైలు నుంచి విడుదలై వారి పద్ధతి మార్చుకోకుండా యథావిధిగా నేరాలకు పాల్పడుతున్నారని స్పష్టం చేశారు.

2023లో వరంగల్‌లోని మట్టెవాడ, మోకిలా, మహబూబ్‌నగర్‌లోని జడ్చర్ల, నాగర్‌కర్నూల్‌లోని కల్వకుర్తి, రాచకొండలోని కీసర పోలీస్ స్టేషన్లలో సుమారు నాలుగున్నర కోట్ల విలువైన వాహనాలను మోసపూరితంగా తీసుకొని స్క్రాప్‌కు, నెదర్లాండ్, సౌతాఫ్రికా, కాంబోడియా లాంటి దేశాలకు ఎగుమతి చేశారని తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున వరంగల్ హనుమాన్‌జంక్షన్ వద్ద నిందితులను అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని అంగీకరించారని, దీంతో హైదరాబాద్ నుంచి వాహనాలను స్వాధీనపర్చుకున్నట్లు తెలిపారు. నిందితులు వరికుప్పల దశరథం, దుర్గం సందాన్, కొశెట్టి రాజేష్, మహమ్మద్ జాబీర్లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి నాలుగు స్విఫ్ట్ డిజైర్ కార్లు, ఒక ఇన్నోవా వాహనాన్ని స్వాధీనపర్చుకున్నట్లు తెలిపారు. స్వాధీనపర్చుకున్న వాహనాల విలువ రూ.70లక్షలు ఉంటుందని తెలిపారు. కేసు ఛేదించడంలో ప్రతిభ కనబర్చిన మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ గోపి, సబ్ ఇన్‌స్పెక్టర్ కె.కుమార్, క్రైమ్ టీం హెడ్‌కానిస్టేబుల్ రవీందర్, కానిస్టేబుళ్లు అలీ, శివ, విజయ్‌కాంత్, హరికాంత్, జి.రాజేందర్, సల్మాన్‌లను డీసీపీ అబ్దుల్ బారి అభినందించారు. సమావేశంలో వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివారం ఉష్ణోగ్రత

గరిష్ఠం :	కనిష్ఠం :
37.0°C	26.0°C

నెరవేరని 'విద్య' లక్ష్యం



హనుమకొండ సిటీ, జూన్ 16: అంగన్‌వాడీ కేంద్రాల్లో 3 నుంచి 5 ఏళ్ల పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యను అందించాలనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. ప్రయివేట్ పాఠశాలల్లోని ప్లేవే మెథడ్‌కు దీటుగా నిరుపేదల పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్య (ప్రీ ప్రైమరీ ఎడ్యుకేషన్) అందించే లక్ష్యంతో ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యను చేపట్టింది. 3-5 ఏళ్ల లోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించడం, ఆట, పాట ద్వారా చిన్నతనంలోనే వారికి విద్య పట్ల ఆసక్తి కల్పించడం, తద్వారా వారి ఉన్నతికి విద్యా మార్గాలను నిర్మించడం లక్ష్యంగా చేపట్టిన ప్రీ ప్రైమరీ ఎడ్యుకేషన్ లక్ష్యాలు నిష్ప్రయోజనం అవుతున్నాయి.

లక్ష్యానికి అవరోధాలు

అంగన్‌వాడీ కేంద్రాల ప్రీప్రైమరీ ఎడ్యుకేషన్ లక్ష్యాల సాధనకు అనేక అంశాలు అవరోధాలుగా మారాయి. ఐసీడీఎస్ అధికారులు ఈ దిశగా దృష్టి పెట్టడమే లేదు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందచేయడం, ప్రభుత్వ పథకాల ప్రచారం, కార్యక్రమాల నిర్వహణ అంశాలకే ప్రాధాన్యత ఇస్తున్నారు. కేంద్రాల నిర్వహణలో అత్యంత ప్రాముఖ్యమైన పిల్లల విద్య బోధనను విస్మరిస్తున్నారు. ఈ అంశంపై అవగాహన కార్యక్రమాలను కూడా చేపట్టడం లేదు.

ఇరుకు భవనాలు

ముఖ్యంగా ప్రభుత్వ లక్ష్యానికి ప్రధాన అవరోధాలు.. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ వసతుల విధానపరంగా లేకపోవడం. భవనాలు పిల్లల ఆట, పాటలకు అనువైనవిగా లేవు. చిన్న చిన్న ఇరుకు గదుల్లో కేంద్రాల నిర్వహణ సాగుతోంది. హనుమకొండ జిల్లాలో మొత్తం 788 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో సొంత భవనాల్లో ఉన్న కేంద్రాలు 200 కాగా.. అద్దె భవనాలు 293. అద్దె లేని భవనాలు 291 (ప్రభుత్వ పాఠశాల భవనాల్లో అనుసంధంగా నిర్వహించేవి). భవనాల్లో అత్యధిక శాతం ఇరుకు గదులే. విచిత్రమేమిటంటే.. నలుగురు సైతం కదలలేని ఇరుకైన గదుల్లో కేంద్రాలు మొక్కుబడిగా నిర్వహించే దుస్థితి. ఈ పరిస్థితుల్లో పిల్లలు కేంద్రాల్లో ఉండే పరిస్థితి లేదు. తల్లిదండ్రులు కూడా కేంద్రాలకు పంపించడంలో అనాసక్తి చూపుతున్నారు. మరోవైపు గదులు ఇరుకుగా ఉండడంతో పిల్లలు రాకుండా ఉండటమే మేలు అనే పరోక్ష ఆలోచనతో టీచర్లు, హెల్పర్లు వ్యవహరిస్తున్నారు.

సర్వేలో వందల్లో 3-5 ఏళ్ల పిల్లలు

సర్వేలో ఆయా కేంద్రాల పరిధిలో వందల్లో 3-5 వయస్సు గల పిల్లలు నమోదవుతున్నారు. వీరికి పూర్వ ప్రాథమిక విద్య అందించే లక్ష్యంలో కనీసం పది మంది పిల్లలు కూడా కేంద్రాల్లో ఉండడం లేదు. ఇందుకు ప్రధానంగా విశాలమైన సొంత భవనాలు లేకపోవడం, ఆట సామగ్రి కొరతతో పాటు టీచర్లు, హెల్పర్లు పిల్లలకు విద్య పట్ల ఆసక్తి కల్పించేలా బోధించడం లేదనే విమర్శలు ఉన్నాయి. టీచర్లు, హెల్పర్లలో అత్యధిక శాతం 50 ఏళ్లు పైబడిన వారు ఉండడం, బోధన పద్ధతులు, పరిజ్ఞానం లేకపోవడంతో వారు ప్లే వే మెథడ్ లో పిల్లలకు బోధించడంలో విఫలమవుతున్నారు. ఈ సమస్య పరిష్కారానికి ముందుగా టీచర్లు, హెల్పర్లకు సైతం పిల్లలను విద్య పట్ల ఆకర్షించే విధానాల పట్ల శిక్షణ, అవగాహన కల్పించే చర్యలు చేపట్టాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇక మరో సమస్య ఏమిటంటే.. కేంద్రాలను మధ్యాహ్నం 2 గంటలకే టీచర్లు మూసివేస్తున్నారు. ఇది కూలి, నాలి చేసుకునే తల్లిదండ్రులకు సంకటంగా మారింది. వారు పనులకు వెళ్లి 4 గంటల తరువాత ఇళ్లకు చేరుతారు. ఈ క్రమంలో పిల్లలను కేంద్రాలకు పంపించడం అవరోధంగా మారింది. పకడ్బందీగా నిర్దేశిత సమయం 4 గంటల వరకు కేంద్రాల నిర్వహిస్తే ఫలితాలు కనిపిస్తాయి. ప్రభుత్వ పాఠశాలలతో అనుసంధానం చేసిన అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ కొంత మేరకు ఫలితాలు ఇస్తున్నప్పటికీ.. మిగతా కేంద్రాల నిర్వహణ లక్ష్యాలు మాత్రం నెరవేరడం లేదు. ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల ఖాళీలను పూర్తి చేయకపోవడం కూడా సమస్యగా పరిణమించింది.

- అంగన్‌వాడీ కేంద్రాల్లో కుంటుపడుతున్న పూర్వ ప్రాథమిక విద్య
- నిష్ప్రయోజనంగా పాఠ్య పుస్తకాలు
- సర్వేలో వందల్లో 3-5 ఏళ్ల పిల్లల నమోదు
- కేంద్రాల్లో విద్యార్థుల సంఖ్య సింగిల్ డిజిట్‌కే పరిమితం
- అధికారుల పర్యవేక్షణ లోపం.. నిరుపేదల పిల్లలకు సంకటం

నిరుపయోగంగా పాఠ్య పుస్తకాలు

అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యకు సంబంధించిన పాఠ్య పుస్తకాలు నిరుపయోగం అవుతున్నాయి. ఎంతో వ్యయంతో ముద్రించిన పాఠ్య పుస్తకాలు పిల్లలు లేకపోవడంతో కుప్పలుగా కేంద్రాల్లో మిగులుతున్నాయి. వర్షం పడితే పాఠ్య పుస్తకాలను పడవేసే దుస్థితి.

ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం

అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్య పర్యవేక్షణలో ఉన్నతాధికారులు విఫలమవుతున్నారు. విద్యా సంవత్సరం ఆరంభంలోనే హడావుడిగా అధికారులు తనిఖీలు చేయడం ఆ తరువాత విస్మరించడం షరామామూలుగా మారింది. దీంతో టీచర్లు, హెల్పర్లు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా ఒకవైపు పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్య అందకపోవడం, మరోవైపు ప్రభుత్వ నిధులు నిరుపయోగం కావడం జరుగుతోంది.

నేడు విద్యుత్ ప్రజావాణి

- ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి

హనుమకొండ టౌన్, జూన్ 16: వినియోగదారులకు చేరువయ్యే కార్యక్రమంలో భాగంగా వారి ఫిర్యాదులు తీసుకొని సకాలంలో పరిష్కరించేందుకు ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 సర్కిళ్లలో నేడు 'విద్యుత్ ప్రజావాణి' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు 16 సర్కిళ్ల పరిధిలోని డివిజనల్ ఆఫీస్, సబ్‌డివిజనల్ ఆఫీస్, ఈఆర్వో, సెక్షన్ ఆఫీస్‌లలో, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సర్కిల్ ఆఫీస్‌లో విద్యుత్ ప్రజావాణి కార్యక్రమం నిర్వహించబడుతుందన్నారు. విద్యుత్ ప్రజావాణిని పటిష్టపరచడంలో భాగంగా సమీక్షలు నిర్వహించి వినియోగదారులు చేసే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించేదిశగా చర్యలు తీసుకోబడుతాయన్నారు. వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి సమస్యలున్న ప్రజావాణిలో ఫిర్యాదు చేయొచ్చన్నారు.

షెడ్యూల్ ప్రకారమే రైతు రుణమాఫీ

- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్


భీమదేవరపల్లి, జూన్ 16: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే రైతులకు రుణమాఫీచేస్తామని, ఇందులో ఎలాంటి సందేహాలు లేవని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం రాత్రి భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో మండల కాంగ్రెస్ కార్యకర్తల ముఖ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి 23 వేల మెజారిటీ ఇచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటామన్నారు. కార్యకర్తలెవరూ అధైర్యపడొద్దని పేర్కొన్నారు. ఈనెల 21నుంచి హుస్నాబాద్ నియోజకవర్గంలోని ప్రతీ గ్రామానికి అన్ని శాఖల అధికారులతో కలిసి గ్రామ పర్యటన నిర్వహిస్తామన్నారు. ఆయా గ్రామాలకు వచ్చినప్పుడు గ్రామాల్లో నెలకొన్న సమస్యల గురించి తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వెంట వెంటనే సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఒకవేళ సమస్య పరిష్కారం కాకపోతే ఆ విషయాన్ని కూడా వెంటనే తెలియజేస్తామన్నారు.

సాగు, తాగునీరు రైతాంగానికి అందించడమే ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి ప్రభాకర్ పేర్కొన్నారు రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసి రైతాంగాన్ని సాగునీరు అందిస్తామన్నారు. ముఖ్యంగా హుస్నాబాద్ నియోజకవర్గంలోని గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నానన్నారు. గత ప్రభుత్వం హనుమకొండ, కరీంనగర్ జిల్లాలోని గౌరవెల్లి ప్రాజెక్టు అందే గ్రామాలకు భూసేకరణ పూర్తి చేయలేదన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భూసేకరణ సర్వే కరీంనగర్, హనుమకొండ జిల్లాల్లో కొనసాగుతోందన్నారు. సకాలంలో రైతులకు ఎరువులు, విత్తనాలు అందజేస్తామన్నారు. గ్రామాల్లోని రోడ్ల నిర్మాణం చేస్తామన్నారు. పింఛన్లను పెంపు చేయడం, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, తదితర పథకాలను త్వరలోనే అమలు చేసేందుకు రాష్ట్రప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని మంత్రి పొన్నం స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు చిట్టంపల్లి అయిలయ్య, మాజీ ఎంపీపీలు అశోక్‌ముఖర్జీ, కొదూరి సరోజన, పెద్ది వెంకటనారాయణగౌడ్, మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్, మంజులరెడ్డి, కొత్తకొండ దేవస్థానం ఛైర్మన్లు చంద్రశేఖర్‌గుప్తా, పిడిశెట్టి కనకయ్య, మండల మహిళా అధ్యక్షురాలు చిదురాల స్వరూప, కొల్గూరి రాజు, ఆదరి రవీందర్, జక్కుల ప్రకాశం, గజ్జెల రమేష్, ఊసకోయిల ప్రకాష్, కార్యకర్తలు పాల్గొన్నారు.



ముల్కనూర్‌లో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్



పీడీఎస్ రైస్ పట్టివేత

రూ.4లక్షల 42వేల సరుకు స్వాధీనం



పోలీసులు పట్టుకున్న బియ్యం

వరంగల్ క్రైం, జూన్ 16: జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ మండలం చిల్పూర్ మండలం రాజవరం గ్రామంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం రూ.4లక్షల 42వేల విలువ కలిగిన 17 టన్నుల పీడీఎస్ రైస్‌ను పట్టుకున్నారు. చిల్పూర్ మండలం రాజవరం గ్రామానికి చెందిన ఎం.జంపయ్య, ఎం.రాజశేఖర్ ఇద్దరు పరిసర గ్రామాల్లో పీడీఎస్ రైస్ సేకరించి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. వీరిద్దరు సేకరించిన బియ్యం గ్రామ పరిసర ప్రాంతంలో ఒక ఇంట్లో పెట్టారని సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి రైస్ స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారణ నిమిత్తం చిల్పూర్ స్టేషన్‌కు తరలించారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐ దయాకర్ ధ్రువీకరించారు.

ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సుల్లో స్కాలర్‌షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 16: హైదరాబాద్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ డిజైనింగ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సుల్లో రాయితీ కోసం నిర్వహిస్తున్న స్కాలర్‌షిప్ టెస్ట్‌కు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా సంస్థ డైరెక్టర్ రాముయాదవ్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2024 విద్యా సంవత్సరానికి ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వహించి మెరిట్ ఆధారంగా కోర్సుల ఫీజుల్లో రాయితీని కల్పిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన ఆసక్తిగల విద్యార్థులు ఈ నెల 22 వరకు దరఖాస్తు చేసుకోవాలని, 23న స్కాలర్ షిప్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9030610033, 9849167839 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కాజీపేట, జూన్ 16: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై. సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ధర్మసాగర్‌కు చెందిన రొండి శివకుమార్ (21) ఈ నెల 3న రాత్రి కాజీపేట డీజిల్ కాలనీ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. గాయాలపాలైన శివకుమార్‌ను చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి అక్క రాజకుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. మృతుడు కూలీపని చేసుకుంటూ జీవిస్తుంటాడు. వివాహం కాలేదు. ఇతడికి ఒక సోదరి ఉంది.















అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

- విదేశాలకు భారీ వాహనాల ఎగుమతి
- అదుపులోకి తీసుకున్న వరంగల్ పోలీసులు
- 70 లక్షల విలువైన ఐదు కార్లు స్వాధీనం

మట్టెవాడ, జూన్ 16: ఫైనాన్షియర్ల ముసుగులో కార్లు, టిప్పర్లు, జేసీబీ వంటి భారీ వాహనాలను మోసపూరితంగా కొనుగోలు చేసి నెదర్లాండ్, దక్షిణాఫ్రికా, కాంబోడియా వంటి దేశాలకు విక్రయిస్తున్న ముఠాను అరెస్టు చేసినట్లు వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ అబ్దుల్ బారి తెలిపారు. ఆదివారం వరంగల్ మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తురకలకుంట గ్రామానికి చెందిన వరికుప్పల దశరథ్, పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం వసంతనగర్ చిన్నదుర్గం సందాన్, రంగారెడ్డి జిల్లా మేడ్చల్ మండలం జగద్గిరిగుట్టకు చెందిన కొశెట్టి రాకేశ్, హైదరాబాద్ సంతోష్‌నగర్ ఓల్డ్ సిటీకి చెందిన మహ్మద్ జాబీర్‌లు ఈ దందాకు తెరలేపారన్నారు. వీరు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో... ఆర్థిక ఇబ్బందుల కారణంగా భారీ వాహనాలు అమ్మకానికి పెట్టుకున్న కొంతమంది యజమానుల నుంచి వాహనాలు కొనుగోలు చేసేవారని చెప్పారు. వాటికి సంబంధించిన ఈఎంఐలు తామే కడతామని నమ్మించేవారన్నారు. అలా కొన్న వాహనాలను ఇతరులకు విక్రయించడమో లేక స్క్రాప్ కింద అమ్మడమో చేసేవారని వివరించారు. అలాగే ముంబాయిలోని కొన్ని బృందాల ద్వారా విదేశాలకు ఎగుమతి చేసేవారని డీసీపీ వెల్లడించారు. ముఠా సభ్యులు గతంలో హైదరాబాద్ పోలీసులకు పట్టుబడి సుమారు 16 నెలలు జైలుకు వెళ్లారని, విడుదలయ్యాక కూడా అదే తరహాలో నేరాలకు పాల్పడుతున్నారని స్పష్టం చేశారు. 2023లో వరంగల్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో సుమారు నాలుగున్నర కోట్ల విలువైన వాహనాలను మోసపూరితంగా తీసుకొని నెదర్లాండ్, సౌతాఆఫ్రికా, కాంబోడియా లాంటి దేశాలకు ఎగుమతి చేశారని తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున వరంగల్ హనుమాన్‌జంక్షన్ వద్ద నిందితులను అదుపులోకి తీసుకొని, 5 కార్లను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

'నాలా' ఎలా?



(మొదటి పేజీ తరువాయి)

చెల్లించాలి. ధరణి రాక ముందు ఆర్డీవో స్థాయిలో వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్పు చేస్తూ నాలా చార్జీలు వసూలు చేసే వారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో భూముల విలువ ఆధారంగా 5శాతం, జీహెచ్‌ఎంసీ పరిధిలో 9శాతం చొప్పున తీసుకునేవారు. కానీ, తెలంగాణ ఏర్పాటు తర్వాత ధరణిని తీసుకొచ్చిన అప్పటి ప్రభుత్వం.. నాలా చార్జీలు చెల్లించేందుకు తొలుత ఆప్షన్ ఇవ్వలేదు. ఆ తర్వాత ఇచ్చినా.. ధరణిలో నమోదై ఉండి, ఎకరాలు, గుంటల చొప్పున నమోదై ఉన్న భూములకు మాత్రమే అవకాశం కల్పించింది. అనధికార లేఅవుటల్లో గజాల చొప్పున ఓపెన్ ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి అలాంటి ఆప్షన్ లేకుండా పోయింది. ఉదాహరణకు ఒక ఊరి శివారులో వ్యవసాయ భూమి ఉంటే.. ధరణిలో అది ఫలానా సర్వే నంబర్‌లో ఉందని పేర్కొంటూ దాని విస్తీర్ణం ఎకరాలు, గుంటల్లో ఉంటుంది. ప్రస్తుతం ఇలాంటి భూమిని మాత్రమే వ్యవసాయేతర భూమిగా కన్వర్షన్ చేసుకునే వీలుంది. గతంలోనే లేఅవుట్‌గా మార్చి, సదరు భూమిని గజాల చొప్పున వేర్వేరు వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేసి ఉంటే.. ధరణిలో అది హౌసింగ్ సైట్ అనే పేరుతో చూపిస్తోంది. ఇలాంటి భూమికి నాలా చార్జీలు చెల్లించే అవకాశం లేకుండా పోయింది. దీంతో దశాబ్దాల క్రితం భూములు కొనుగోలు చేసిన వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఆప్షన్ లేక సతమతం..

గ్రేటర్ హైదరాబాద్‌తోపాటు శివారు ప్రాంతాల్లో దశాబ్దాల క్రితమే పెద్దఎత్తున అనధికార లేఅవుట్లు వెలిశాయి. వాటిలో ఓపెన్ ప్లాట్లను వేలాది మంది కొనుగోలు చేశారు. ఆయా స్థలాల్లో భవన నిర్మాణ అనుమతులకు వెళ్లిన సందర్భంలో భూమి విలువలో ఎల్‌ఆర్‌ఎస్ చార్జీల కింద 30శాతం, నాలా చార్జీల కింద మరికొంత వసూలు చేసే వారు. దీనికితోడు జీహెచ్‌ఎంసీ పరిధిలోనైతే చేంజ్ ఆఫ్ ల్యాండ్ యూజ్(సీఎల్‌యూ) పేరిట చార్జీలు తీసుకునేవారు. అయితే, తెలంగాణ ఏర్పాటు తర్వాత హెచ్‌ఎండీఏలో భవన నిర్మాణ అనుమతుల కోసం వెళ్లినప్పుడు కేవలం ఎల్‌ఆర్‌ఎస్ చార్జీలు మాత్రమే తీసుకుంటున్నారు. సదరు స్థలానికి నాలా చార్జీలు చెల్లించకపోతే.. ఆ ఫీజు చెల్లించి పత్రాన్ని తీసుకురావాలని సూచిస్తున్నారు. ధరణి వచ్చిన తర్వాత గుంటలు, ఎకరాల్లో ఉన్న భూముల కన్వర్షన్‌కు మాత్రమే ఆప్షన్ ఇచ్చిన ప్రభుత్వం... గజాల్లో ఉన్న స్థలాలకు సంబంధించిన ఆప్షన్ ఇవ్వకపోవడంతో చిన్న, మధ్య తరహా డెవలపర్లు, బిల్డర్లు తీవ్రంగా సతమతమవుతున్నారు. ఈ విషయమై గత ప్రభుత్వాన్ని రియల్ ఎస్టేట్ అసోసియేషన్ల ప్రతినిధులు అనేక మార్లు సంప్రదించినా.. ఫలితం దక్కలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా స్పందించి.. గజాల్లో ఉన్న స్థలాలకూ నాలా చార్జీలు తీసుకొని, భవన నిర్మాణ అనుమతులు ఇప్పించాలని వారు కోరుతున్నారు. దీన్ని అమలు చేస్తే ప్రభుత్వానికి రూ.వెయ్యి కోట్లకుపైగా ఆదాయం వస్తుందని పేర్కొంటున్నారు.

సమస్యను పరిష్కరించాలి

హైదరాబాద్ శివారు ప్రాంతాల్లోని అనధికార లేఅవుట్లలో భవన నిర్మాణాలు చేపట్టేందుకు పదేళ్లుగా పలువురు డెవలపర్లు, బిల్డర్లు ప్రయత్నం చేస్తున్నారు. కానీ అనుమతులు రాకపోవడంతో ఆయా స్థలాలన్నీ నిరుపయోగంగా మారుతున్నాయి. గత ప్రభుత్వంలో ధరణి తీసుకొచ్చి అదనపు చార్జీలను విధించి ఆదాయాన్ని పొందేందుకు రకరకాల మార్గాలను అప్పటి అధికారులు అన్వేషించారు. కానీ, ఆదాయం వచ్చే మార్గాలను గాలికి వదిలేసి.. ఉన్న చార్జీలను పెంచే ప్రయత్నం చేశారు. కొత్త ప్రభుత్వమైనా స్పందించి రియల్ ఏస్టేట్ రంగానికి గుదిబండగా మారిన నాలా సమస్యను పరిష్కరించాలి.

\- ఎం.ప్రేమ్‌కుమార్, వెస్ట్‌జోన్ బిల్డర్స్ అసోసియేషన్ చైర్మన్

ఏఎఫ్‌సీఎస్‌పై నిరాధార ఆరోపణలు: టీజీఎస్‌ఆర్టీసీ

హైదరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఆటోమేటిక్ ఫేర్ కలెక్షన్ సిస్టం(ఏఎఫ్‌సీఎస్)పై నిరాధార ఆరోపణలు తగదని టీజీఎస్‌ఆర్టీసీ అధికారులు విజ్ఞప్తి చేశారు. ఉన్నతస్థాయి కమిటీ సిఫారసు మేరకే ఏఎఫ్‌సీఎస్‌ను అమలు చేస్తున్నట్లు ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. డిజిటల్ టికెటింగ్ కోసం సాంకేతికను అందిపుచ్చుకునేందుకు కేంద్రం రూ.20.97 కోట్లను విడుదల చేసిందని పేర్కొన్నారు. ఏఎఫ్‌సీఎస్ కోసం 2022 నవంబరు 2న టెండర్ నోటిఫికేషన్ విడుదల చేయగా.. ఇంటెలిజెంట్ టికెట్ యంత్రాల సరఫరా, డిజిటల్ టికెటింగ్, సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, నిర్వహణకు కావాల్సిన సర్వర్లు, మ్యాన్‌పవర్‌పై 'చలో మొబిలిటీ'కి బాధ్యతలను అప్పగించాలని కమిటీ ప్రతిపాదించినట్లు వివరించారు. బస్సుల్లో యూపీఐ, డెబిట్/క్రెడిట్ కార్డులతో డిజిటల్ పేమెంట్స్, స్మార్ట్‌కార్డ్స్, మొబైల్ టికెట్స్, మొబైల్ బస్‌పాస్ సౌకర్యం కల్పించేందుకు ఈ వ్యవస్థ దోహదపడుతుందన్నారు. మహాలక్ష్మి పథకం అమలుకు మహిళలకు స్మార్ట్‌కార్డ్ జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఇందుకు చలో మొబిలిటీ అనుభవం ఉపయోగపడుతుందని గుర్తించామన్నారు. దాంతో మార్చి 15న చలో మొబిలిటీకి లెటర్ ఆఫ్ ఇంటెంట్(ఎల్‌వోఐ) ఇచ్చామని తెలిపారు. కొన్ని డిపోల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తామని, అన్ని డిపోల్లో అమలుకు మూడు నెలల సమయం పడుతుందని వివరించారు. అసోం, బిహార్ రాష్ట్రాలతోపాటు.. ముంబై, ఇండోర్, జబల్‌పూర్ నగరాల్లో ఈ వ్యవస్థ కొనసాగుతోందని, ఒక్క ముంబైలోనే చలో మొబిలిటీ ద్వారా 11 లక్షల స్మార్ట్‌లు జారీ అయ్యాయని పేర్కొన్నారు.

సైబర్ బాధితులకు రూ.31.29 కోట్లు రికవరీ

- టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్

హైదరాబాద్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల చేతిలో ఆర్థికంగా మోసపోయిన బాధితులకు రూ.31.29 కోట్ల సొమ్మును రికవరీ చేసినట్లు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో(టీజీసీఎస్‌బీ) డైరెక్టర్ శిఖాగోయల్ తెలిపారు. ఈ మేరకు తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (టీఎస్‌ఎల్‌ఎస్‌ఏ), టీజీసీఎస్‌బీ సంయుక్తంగా తీసుకున్న చర్యల వల్లే ఇది సాధ్యమైందని తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి 20వ తేదీ నుంచి జూన్ 8 వ తేదీ వరకు రెండు లోక్‌అదాలత్‌లతో కలిపి రూ.31.29 కోట్లు రికవరీ చేసినట్లు ఆయన వివరించారు. సైబర్ మోసాలకు సంబంధించి నాలుగునెలల్లోనే కోర్టులో 5,142 పిటిషన్లు నమోదు అయ్యాయని తెలిపారు. సైబర్ నేరాలపై టీజీసీఎస్‌బీ తక్షణమే స్పందిస్తూ బాధితుల సొమ్మును సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కకుండా చర్యలు తీసుకుంటున్నదని శిఖాగోయల్ చెప్పారు. సైబర్‌నేరగాళ్లు కొల్లగొట్టిన సొమ్మును బ్యాంకు ఖాతాల్లో ఫ్రీజ్ చేస్తున్నప్పటికీ బాధితులకు తిరిగి అందించడంలో ఆలస్యం అవుతోందని ఆయన అన్నారు. ఇలాంటి కేసులను సీఆర్‌పీసీ సెక్షన్ 457 కింద నమోదు చేయడంతో పాటు దర్యాప్తునకు సంబంధించి స్టాండర్డ్ ప్రొసీజర్ (ఎస్‌ఓపీ)లను తయారు చేసి అన్ని జిల్లాల ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీలకు పంపినట్లు శిఖాగోయల్ తెలిపారు.

యువకుడి ఉసురుతీసిన.. ఆన్‌లైన్ బెట్టింగ్

- 3 రోజుల క్రితం ఆత్మహత్యాయత్నం.. ఆస్పత్రిలో ఆదివారం మృతి



భాను(ఫైల్)

రామాయంపేట, జూన్ 16: ఆన్‌లైన్ బెట్టింగ్ ఓ యువకుడి ప్రాణాలు తీసింది. ఈ ఘటన మెదక్ జిల్లా రామాయంపేట మండలం ధర్మారం గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన దొమ్మాట భాను(24) డిగ్రీ పూర్తి చేసి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొన్ని రోజులుగా ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటుపడి రూ.2 లక్షల దాకా నష్టపోయాడు. దీంతో మనస్తాపం చెంది మూడు రోజుల క్రితం తన వ్యవసాయ పొలం వద్ద పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంబీకులు వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రంజిత్ తెలిపారు.

164 కిలోల గంజాయి, 1.65 కిలోల గంజాయి చాక్లెట్లు సీజ్

- వేర్వేరు కేసుల్లో ఏడుగురి అరెస్టు



విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న టాస్క్‌ఫోర్స్ డీసీపీ రష్మిక పెరుమాళ్, ఏసీపీ శ్రీనివాసరావు

హైదరాబాద్ సిటీ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఒడిసా నుంచి హైదరాబాద్‌కు గుట్టుగా గంజాయి తరలిస్తున్న రెండు అంతర్రాష్ట్ర ముఠాలకు చెందిన ఆరుగురిని హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 164 కిలోల గంజాయి, మూడు కార్లు, ఓ బైక్, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ రష్మి పెరుమాళ్ సీసీఎస్‌లో ఆదివారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. హుమాయున్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ మొత్తంలో గంజాయి దిగుమతి అవుతుందనే సమాచారంతో దాడి చేసిన పోలీసులు ఓ ముఠాను పట్టుకుని వారి వద్ద వంద కిలోల గంజాయిని సీజ్ చేశారు. కామారెడ్డి జిల్లా పిట్లాంకు చెందిన ధారావత్ రవి, మహారాష్ట్ర నాందేడ్‌కు చెందిన సయ్యద్ బహదూర్, ఆనంద్ రామ్‌జీ కదమ్‌ను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ప్రధాన నిందితుడు ధారావత్ రవి ఇటీవల ఒడిశా వెళ్లి అక్కడ ఓ రైతు దగ్గర 100 కిలోల గంజాయి కొనుగోలు చేశాడు. దానిని 32 ప్యాకెట్లుగా మార్చి బహదూర్, ఆనంద్ రామ్‌జీ సహకారంతో కారులో హైదరాబాద్‌కి తరలించి పోలీసులకు పట్టుబడాడు. మరో కేసులో ఇదే తరహాలో ఒడిసా నుంచి నగరానికి గంజాయి తీసుకొచ్చిన హైదరాబాద్‌కు చెందిన షేక్ సర్వేజ్, అబ్దుల్ రవూఫ్, మహ్మద్ అన్వర్ అరెస్టయ్యారు. వారి నుంచి 64 కిలోల గంజాయిని చేసుకున్నారు. ఆసిఫ్‌నగర్‌కు చెందిన షేక్ పర్వేజ్ గతంలో రాజమండ్రి జైలులో శిక్ష అనుభవించాడు. ఇటీవల బయటికొచ్చిన పర్వేజ్ ఒడిసా వెళ్లి జైలులో అతనికి పరిచయమైన గంజాయి రైతు దీపక్‌ను కలిశాడు. దీపక్ నుంచి 64 కిలోల గంజాయి తీసుకుని రవూఫ్, అన్వర్‌తో కలిసి హైదరాబాద్‌కు తీసుకొచ్చి పోలీసులకు చిక్కాడు. మరో కేసులో యూపీ నుంచి హైదరాబాద్‌కు గంజాయి చాక్లెట్లు తీసుకొచ్చి విక్రయిస్తున్న వ్యక్తిని శేరిలింగంపల్లి పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద 1.65 కిలోల గంజాయి చాక్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. శంషాబాద్ పరిధిలో పార్టీలు, ఈవెంట్లలో తనిఖీలు చేసిన ఎక్సైజ్ పోలీసులు 8 మత్తు పదార్థాల ప్యాకెట్లను సీజ్ చేశారు.

త్యాగాల పండుగ బక్రీద్

- నేడు జరుపుకోనున్న ముస్లింలు ● ముస్తాబైన మసీదులు ● ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రత్యేక ప్రార్థనలు

'ఉన్నదొక్కటే... అది.. మానవ జాతి.. పంచాల్సింది ఒక్కటే... నిరంతర ప్రేమ.. ఎవరిపై ఎవరికీ ఎలాంటి ఆధిక్యతలు లేవు.. ఒకరి ధన, మాన, ప్రాణాలు మరొకరికి నిషిద్ధం.. ఒకరి హక్కును మరొకరు దోచుకోవడం శిక్షార్హం.. పగ, ప్రతీకారం, వడ్డీ, లావాదేవీలన్ని రద్దయ్యాయి..'
... 1500 యేళ్ల కిందట మహ్మద్ ప్రవక్త చివరి హజ్ ప్రసంగంలో ప్రస్తావించిన అంశాలివీ.. ఆయన ప్రసంగం ఆద్యంతం మానవ హక్కులకు పెద్దపీట వేసింది. స్వేచ్ఛాయుత వాతావరణంలో సామాజిక ప్రగతిని ఉత్తమ జీవిత ప్రమాణాలను ఉద్బోధించారు. హజ్ వంటి ఆధ్యాత్మిక యాత్రలో సంప్రదాయాలు, ధార్మిక కట్టుబాట్ల గురించి కాకుండా మానవ హక్కుల గురించి మాట్లాడడం ప్రపంచ మానవ హక్కుల ప్రకటనగా భావించవచ్చు.



ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు (ఫైల్)

మహబూబాబాద్, (ఆంధ్రజ్యోతి)/జఫర్‌గఢ్, జూన్ 16: త్యాగబోధన పండుగైన బక్రీద్.. సకల మానవ లోకానికి సౌభ్రాతృత్వాన్ని, జాతి, మత, బీద, గొప్ప భేదాలను మాన్పి ప్రేమానురాగాలతో సంబంధాలను మరింత పెంపొందించేందుకు సందేశాన్ని ఇస్తుందని ప్రతీతి. ముస్లింలు ఈ పండుగ ప్రత్యేక ప్రార్థనలు చేయడానికి ఉదయం 6.30 గంటల నుంచి ఉదయం 9గంటల లోపు వివిధ ప్రాంతాల్లో అక్కడి పరిస్థితుల కనుగుణంగా నిర్దేశిత సమయానికి సామూహిక పండుగ ప్రార్థనల ఈద్‌గాహ్ మైదానాలకు చేరుకుంటారు. అక్కడ భేదాభావం లేకుండా అందరూ సహపంక్తిలో నిలబడి ప్రార్థనలు నిర్వహింప చేసే పెద్ద ఇమామ్‌ను అనుసరిస్తూ ఖుద్బా నమాజ్‌లో పాల్గొంటారు.

ఖుర్బానీతో అల్లాహ్‌పై విశ్వాసం

ఈద్గా మైదానాల్లో ప్రార్థనలు త్వరగానే పూర్తి చేసుకున్న ముస్లింలు.. తమ గృహాలకు చేరుకుని ఖుర్బానీ ద్వారా అల్లాహ్‌పై విశ్వాసాన్ని వ్యక్తపరుస్తూ జంతు బలిదానాలు చేస్తారు. జంతు బలిదానం మాంసాన్ని మూడింట ఒక వంతు పేదలకు పంపిణీ చేయాలి. మిగిలిన రెండు భాగాల్లో ఓ భాగం తన సొంతానికి, మరో భాగం పొరుగు వారు, బంధుమిత్రులకు పంపి ణీ చేస్తారు. ఖుర్బానీ మాంసాన్ని ముస్లిమేతరులకు కూడా పంపిణీ చేయవచ్చని తద్వారా మానవులంతా ఒక్కటేనన్న భావన కలిగించినట్లవుతుందని ముస్లిం పెద్దలు చెబుతారు.

ఖుర్బానీ వెనుక పరీక్ష..

ఖుర్బానీ అంటే జంతుబలిదానం అని చెబుతారు. అన్ని ప్రేమల కన్నా దైవ ప్రేమ గొప్పదని, దీనికోసం అన్నింటినీ త్యాగం చేయాలని అల్లాహ్ ఆజ్ఞాపించాడని ముస్లిం పెద్దలు చెబుతారు. ఆ ఆజ్ఞ తొలిసారిగా పరీక్షకు నిలిచిన సందర్భంగా ఖుర్బానీ తెరపైకి వచ్చిందని పేర్కొంటారు. దీన్ని ఉదహరించి విశ్లేషించే కథనాన్ని ఊటంకిస్తూ ఏటేటా బక్రీద్ ఈద్-ఉల్-జుహా జంతు బలిదానాలతో నిర్వహించుకుంటూ వస్తున్నారు.

ఖుర్బాని కథాకమామీషు వెనుక..

హజ్రత్ ఇబ్రహీంకు లేకలేక ఒక కొడుకు హజ్రత్ ఇస్మాయిల్ జన్మిస్తాడు. ఒక రోజు హజ్రత్ ఇబ్రహీం, తన కొడుకును జిబాహ్(వధ) చేస్తున్నట్లు కలగంటాడు. ఆ కల తనకు దైవాజ్ఞగా భావించి కల సారాంశాన్ని తన కొడుకు ఇస్మాయిల్‌కు చెబుతాడు. అదే అల్లాహ్ ఆజ్ఞ అయినప్పుడు తాను సిద్ధమేనని ఇస్మాయిల్ అంటాడు. హజ్రత్ ఇబ్రాహీం అల్లాహ్ ఆజ్ఞగా భావించి పుత్ర వాత్సల్యాన్ని జయించి కన్న కొడుకు ఇస్మాయిల్ మెడ మీద కత్తి తిప్పడానికి సిద్ధమవుతాడు. ఆ సమయంలోనే అల్లాహ్ ఇబ్రహీం లోని ప్రేమబలిని గుర్తించడంతో అక్కడ కొడుకు స్థానం లో గొర్రెపోతు ప్రత్యక్షమై జిబాహ్(బలి) అవుతుంది. ఇలా అల్లాహ్ పరీక్షలో ఇబ్రహీం నెగ్గుతారు. ఆ క్రమంలోనే ఖుర్బాని తెరపైకి వచ్చిందని ముస్లింలు విశ్వసిస్తారు.

బక్రీద్‌తోనే ఖుర్బానీ..

మనిషిలో ఈ త్యాగ భావాన్ని సజీవంగా, సచేతనంగా ఉంచడానికి యేటా బక్రీద్ పండుగ నాడు ముస్లింలు ఖుర్బానీ ఇస్తారు. అల్లాహ్ ఆదేశాల ఆంతర్యం ఇదేనని కోట్లాది మంది ముస్లిం ప్రజలు ఈ పండుగ రోజున జంతుబలిదానం చేస్తారు. త్యాగభావానికి తార్కాణమైన బక్రీద్ పండుగ మతసామరస్యానికి ఎంతో దోహదపడుతుంది. ఈ సందర్భంగా ఖుర్బానీ, ఆధ్యాత్మిక, సామాజిక, కుటుంబ బాధ్యతలు, త్యాగాన్ని బోధించే ఆధ్యాత్మిక యాత్ర(హజ్)ల ప్రాధాన్యతల గురించి ఈద్గా(సామూహిక ప్రార్థనా స్థలం)లపై ముస్లిం పెద్దలైన ఇమామ్‌లు ఉపన్యాసాలు చేస్తారు.

ఆధ్యాత్మిక యాత్ర హజ్..

త్యాగాన్ని బోధించే ఆధ్యాత్మిక యాత్రను హజ్ అంటారు. బక్రీద్ పండుగను పురస్కరించుకుని సౌదీఅరేబియా దేశంలోని మక్కాలో ఉండే కాబా గృహాన్ని దర్శించే సంకల్పంతో లక్షలాది ముస్లింలు హజ్ యాత్రను చేస్తారు. ప్రపంచం నలుమూలల నుంచి ముస్లింలు మక్కా నగరానికి తరలివెళ్తారు. దైవప్రవక్తకు పూర్తిగా విధేయులై వారు జారీ చేసిన ప్రతీ ఆదేశాన్ని ఎటువంటి సంకోచం లేకుండా శిరసా వహించేలా హజ్ శిక్షణ ఇస్తుందని ముస్లింలు విశ్వసిస్తారు. ఇస్లామియా జీవన వ్యవస్థకు మూలస్తంభాలైన నమాజ్(ప్రార్థన), రోజా(ఉపవాసం), జకాత్(దానం)లతో పాటు హజ్ కూడా తప్పనిసరి అని ముస్లింలకు దైవాదేశం. అందువల్లే జీవితంలో ఒక్కసారైనా హజ్ యాత్ర చేయాలని ముస్లింలు లక్ష్యంగా ఎంచుకుంటారు.

మౌలిక సూత్రాలు

ఇస్లాం ధర్మంలోని ఐదు మౌలిక సూత్రాలను యావత్ ప్రపంచ ముస్లింలు విధిగా పాటిస్తారు. మొదటిది సృష్టికర్త ఒక్కడేనన్న విశ్వాసం. రెండోది దైవ ప్రార్థన నమాజ్. మూడోది ఉపవా సం(రోజా), నాలుగోది జకాత్(ఆర్థిక విధానం). ఐదోది హజ్(కాబా సందర్శన యాత్ర). ఇందులో ఏ ఒక్కదాన్ని విస్మరించినా విశ్వాసం పరిపూర్ణం కాదని నమ్ముతారు. మానవుడు దైవ విశ్వాసి అనడానికి రుజువులు ఇవేనని చెబుతారు. ఆర్థిక స్తోమత కలిగిన ప్రతీ ముస్లింపై హజ్ విధిగా నిర్ణయించబడింది. స్తోమత కలిగిన వారు జీవిత కాలంలో ఒక్కసారైనా ఈ యాత్ర చేయడం తప్పనిసరి. ఈ ఆరాధన జిల్‌హజ్జ్ మాసంలో సౌదీ అరేబియాలోని పవిత్రమైన మక్కా నగరంలో జరుగుతుంది. ఆ రోజే (ఈ నెల 17న) ప్రపంచం లోని ముస్లింలంతా పండుగ జరుపుకుంటారు. దీన్నే 'ఈద్-ఉల్- జుహా' అని, 'బక్రీద్' అని, 'ఈదెఖుర్బాన్' అని రకరకాలుగా వ్యవహరిస్తారు.

ఆధ్యాత్మికం.. ఆహ్లాదం.. వినోదం

- పర్యాటకంగా మేడారం అభివృద్ధికి ప్రణాళిక ● స్మృతివనం ఏర్పాటుతో పెరగనున్న సందర్శకులు



మేడారంలో ఆదివాసీల కళాప్రాంగణం



మేడారంలోని గిరిజన మ్యూజియం

ములుగు, జూన్ 16: మేడారం పరిధిలోని రెడ్డిగూడెం వద్ద జంపన్నవాగును ఆనుకొని ఉన్న 25ఎకరాల స్థలాన్ని స్మృతివనం కోసం ఎంపిక చేశారు. 2024మహాజాతర ఏర్పాట్ల సమయంలోనే రాష్ట్ర మంత్రి సీతక్క అధికారులకు చేసిన సూచనలతో స్మృతివనానికి శ్రీకారం చుట్టారు. స్థల పరిరక్షణ కోసం ప్రహరీగోడ నిర్మాణాన్ని మొదలు పెట్టారు. అయితే జాతర తర్వాత పనులు ముందుకు సాగలేదు. జాతరకు వచ్చే భక్తులు ఎక్కువగా విడిదిచేసే ప్రదేశాలలో జంపన్నవాగు, రెడ్డిగూడెం పరిసరాలు ప్రధానమైనవి. గద్దెలకు కేవలం కిలోమీటర్ దూరంలోనే ఉండటం, పుణ్యస్నానాల అనంతరం ఈ మార్గం గుండానే వనదేవతల దర్శనానికి వెళ్తుండటంతో స్మృతివనం భక్తులను పూర్తిస్థాయిలో అలరించనుంది. రాష్ట్ర పర్యాటక, దేవాదాయ శాఖ అధికారులు డీటేయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టు(డీపీఆర్) రూపొందిస్తున్న నేపథ్యంలో వచ్చే జాతర నాటికి స్మృతివనం భక్తులకు అందుబాటులోకి వస్తుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది.

- ఆకట్టుకుంటున్న చిలుకలగుట్ట కుడ్య చిత్రాలు

సమ్మక్క తల్లి కుంకుమ బరిణె రూపంలో కొలువైన మేడారంలో అత్యంత విశిష్టత కలిగిన చిలుకలగుట్ట ఇప్పుడు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ప్రహరీగోడ పై గతంలో రంగులతో వేసిన చిత్రాల స్థానంలో కుడ్య చిత్రాలను రూపొందించడం జరిగింది. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానం, సమ్మక్క, సారలమ్మల చిత్రాలను అందంగా తీర్చిదిద్దారు. గుట్ట పరిరక్షణ చర్యలను మరింత విస్తరించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నారు. సుమారు 800ఎకరాలలో విస్తరించి ఉన్న చిలుకలగుట్టను 2018లో అప్పటి రాష్ట్రప్రభుత్వం ముగ్గురు పూజారుల పేరిట ఐటీడీఏ ద్వారా ఆర్‌వోఎఫ్ఆర్ పట్టా చేసింది.

- గిరిజన మ్యూజియం, ఓపెన్ థియేటర్

గద్దెలకు సమీపంలో నిర్మించిన గిరిజన మ్యూజియం, హంపి ఓపెన్ థియేటర్ జాతర భక్తులను పూర్తిస్థాయిలో ఆకట్టుకోలేకపోతున్నాయి. మ్యూజియం నిర్వహణలో లోపాలున్నాయి. ఆదివాసీ సంస్కృతి, జీవన విధానాలను ప్రతిబింబించేలా వస్తువులను ఇక్కడ అందుబాటులో ఉంచారు. అయితే జాతర సమయంలో మాత్రమే భక్తులకు సదుపాయాలు కల్పిస్తున్నారు. సాధారణ రోజుల్లో మ్యూజియానికి వచ్చేవారి సంఖ్య తక్కువే. అక్కడ మ్యూజియం ఉందనే విషయం ఎక్కువ మందికి తెలియకపోవడం గమనార్హం. పక్కనే ఉన్న ఆదివాసీ కళాప్రాంగణం ఓపెన్ థియేటర్‌లో జాతర జరిగే నాలుగైదు రోజుల్లో మాత్రమే ఆదివాసీ కళారూపాలను ప్రదర్శిస్తున్నారు. థింసా, గుస్సాడి, కొమ్ము నృత్యాలు, వనదేవతల ప్రాశస్త్యాన్ని, చరిత్ర ను చాటుతూ ప్రదర్శించే నాటికలను తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరవుతున్నారు. మ్యూజియం ప్రాంగణంలో తాత్కాలికంగా రూపొందించే ట్రైబల్ విలేజ్ సెట్టింగ్ కూడా ఆకట్టుకుంటుంది. గడ్డి గుడిసెలు, ఎడ్లబండ్లు, ఆదివాసీలు ఉపయోగించే సంప్రదాయ పనిముట్లు తదితర వస్తువులను ప్రదర్శనకు ఉంచుతారు. అయితే జాతర అనంతరం కూడా ఇవన్నీ అందుబాటులోకి వస్తే భక్తులు, పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశాలున్నాయి. ప్రధానంగా సెలవు రోజులు, వీకెండ్‌లలో ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేయాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. స్మృతివనం నిర్మాణంతో భక్తుల ఆకాంక్ష కొంతమేరకు నెరవేరుతుంది.


- శాశ్వత నిర్మాణాలపై ముందుకు..

2018జాతర సమయంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ మేడారం గద్దెల విస్తరణ, సదుపాయల కల్పనకోసం భారీ ప్రకటన చేశారు. రూ.200కోట్ల నిధులతో 200ఎకరాలలో మేడారాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పారు. కానీ, ఆచరణ సాధ్యం కాలేదు. అయితే అప్పటి అధికార యంత్రాంగం సమర్పించిన డీపీఆర్ భద్రంగా ఉంది. అసెంబ్లీ ఎన్నికల కోడ్ కారణంగా 2024మహాజాతర ఏర్పాట్లకు ఆటంకం ఏర్పడింది. కొత్త ప్రభుత్వం ఏర్పడటం, సమయం తక్కువగా ఉండడంతో శాశ్వత నిర్మాణాలను వాయిదావేసి తాత్కాలిక ప్రాతిపదికన సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిచ్చారు.

ఇప్పుడు లోక్‌సభ ఎన్నికలకోడ్ కూడా ముగియడంతో జాతర అభివృద్ధి, శాశ్వత నిర్మాణాలపై దృష్టిసారించారు. గత జాతరకు ముందు జిల్లా యంత్రాంగం సమర్పించిన నివేదికతో పాటు సవరించిన ప్రతిపాదనలను పరిశీలిస్తున్నారు. మళ్లీ 2026లో మహాజాతర జరుగుతుండగా ఈలోగానే యాక్షన్‌ప్లాన్‌ను అమలు చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నారు. అధికారు లు అందుకు సమాయత్తమవుతున్నారు.

స్మృతివనం ప్రతిపాదన హర్షనీయం


కొక్కెర రమేష్, సమ్మక్క పూజారి



మేడారంలో వనదేవతలకు స్మృతి వనం నిర్మించడం హర్షించతగిన విషయం. వనదేవతలైన సమ్మక్క, సారలమ్మలకు రూపం లేదు. పులి, జింకలు వారి వాహనాలని భక్తులు నమ్ముతుంటారు. భక్తుల నమ్మకాన్ని నిరూపించేలా వారి చరిత్ర, స్మృతులను తెలిపే విధంగా ఏర్పాట్లు చేయాలని నిర్ణయించిన ప్రభుత్వానికి ధన్యవాదాలు. స్మృతివనం ఏర్పాటుతో జాతరకు మరింత వైభవం రానుంది.

తల్లుల చరిత్ర ఆసక్తికరంగా ఉంటుంది


వల్లపు స్వామి, గజ్వేల్



సమ్మక్క, సారలమ్మ చరిత్ర ఆసక్తిక రంగా ఉంటుంది. వారి గురించిన మరిన్ని విశేషా లతో స్మృతివనం ఏర్పాటు చేస్తే తల్లుల గురించి తెలుసు కునేందుకు నాలాంటి భక్తులు ఎంతోమంది వస్తారు. నేను మేడారానికి రావడం ఇదే ప్రథమం. సంతానం కలగాలని దేవతలను ముడుపు కడితే మాకు పాప పుట్టింది. మొక్కు తీర్చుకునేందుకు ఇక్కడికి వచ్చాం.

హోదా కోసం కేంద్రంపై ఒత్తిడి

దనసరి సీతక్క, రాష్ట్రమంత్రి



మేడారం జాతరకు జాతీయ పండుగ హోదా సాధనకోసం రాష్ట్రప్రభుత్వం కట్టుబడి ఉంది. కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే క్రమంలో త్వరలో మంత్రుల బృందంతో కేంద్రం వద్దకు వెళ్తాం. ఇప్పటికే రాష్ట్రపతి ద్రౌపదిముర్ముకు వినతిపత్రం సమర్పించడం జరిగింది. మేడారం సమగ్రాభివృద్ధికోసం వనదేవతల భక్తురాలిగా, మంత్రిగా కృషిచేస్తా.





కలెక్టర్ ప్రావీణ్యను కలిసిన డీవైఎస్‌వో

వరంగల్ స్పోర్ట్స్, జూన్16: హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్యను డీవైఎస్‌వో జి.అశోక్‌కుమార్ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. హనుమకొండ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రావీణ్యను ఆదివారం హనుమకొండ కలెక్టర్ కార్యాలయంలో అశోక్‌కుమార్ కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు.

కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న డీవైఎస్‌వో అశోక్‌కుమార్

నేత్రదానం సామాజిక బాధ్యత



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కరేటి శంకర్‌రావు యాదవ్

సుబేదారి, జూన్ 16: నేత్రదానం సామాజిక బాధ్యత అని తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కరేటి శంకర్‌రావు యాదవ్ అన్నారు. హనుమకొండ అమరావతి నగర్‌కు చెందిన చలుమల కిష్టమ్మ ఇటీవల మరణించగా కుటుంబ సభ్యుల సహకారంతో తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆమె నేత్రాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆదివారం కిష్టమ్మ నివాసంలో నిర్వహించిన అవగాహన సదస్సులో శంకర్‌రావు యాదవ్ మాట్లాడుతూ.. ఒకరి నేత్ర దానంతో ఇద్దరికి చూపును ఇవ్వవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు మధుసూదన్ రెడ్డి, శంకర్‌రెడ్డి, బంధువులు జనార్ధన్‌రెడ్డి, అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఉపేందర్‌రెడ్డి, యాకోబు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్ధన్నపేట లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా శ్రీనివాస్



సుబేదారి, జూన్ 16: వర్ధన్నపేట లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా హనుమకొండ సుబేదారికి చెందిన గుండ్ల శ్రీనివాస్‌ను వర్ధన్నపేట లయన్స్ క్లబ్ సభ్యులు ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. తన నియామనికి కృషి చేసిన లయన్స్ క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో లయన్స్ క్లబ్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

బాధ్యతలు స్వీకరించిన వరంగల్ కలెక్టర్



కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న సత్య శారదాదేవి

వరంగల్ కలెక్టరేట్, జూన్ 16: వరంగల్ జిల్లా కలెక్టర్‌గా డాక్టర్ సత్య శారదాదేవి ఆదివారం పి.ప్రావీణ్య నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఐఏఎస్‌ల బదిలీల్లో భాగంగా అగ్రికల్చర్, కోఆపరేషన్ డిపార్ట్‌మెంట్ జాయింట్ సెక్రటరీగా పనిచేస్తున్న సత్య శారదాదేవి కలెక్టర్‌గా బదిలీపై వచ్చారు. ముందుగా ఆమె భద్రకాళి అమ్మవారిని కుటుంబ సమేతంగా దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కలెక్టరేట్‌కు చేరుకున్న ఆమెకు జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి, జడ్పీ సీఈవో రామిరెడ్డి, డీపీఆర్‌ఓ అయూబ్ అలీ స్వాగతం పలికారు. అనంతరం జిల్లా అధికారులతో శాఖల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఉచిత యోగా తరగతులు

పరకాల, జూన్ 16: పరకాల పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రతీ రోజు ఉదయం 6 నుంచి 7 గంటల వరకు ఉచితంగా యోగా తరగతులు నిర్వహిస్తున్నట్లు పతంజలి జిల్లా ట్రస్ట్ అధ్యక్షుడు జితేందర్ జీ, కొలుగూరి రాజేశ్వర్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యోగా చేయడం వల్ల మానసిక ఒత్తిడి తగ్గి, మనసు ప్రశాంతంగా ఉంటుందన్నారు. మనసుకు శరీర వ్యాయామాలు ఒత్తిడిని తగ్గించి బీపీ, షుగర్ లాంటివి దరిచేరవన్నారు.

అద్దె భవనాల్లో ఆరోగ్య కేంద్రాలు

• ఇరుకు గదులతో ఇక్కట్లు • కనీస వసతులు కరువు
• సొంత భవనం నిర్మించాలని ప్రజల వేడుకోలు

వడ్డెపల్లి, జూన్ 16: పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. అద్దె భవనాల్లో ఇరుకు గదులు ఉండడంతో వైద్య పరీక్షలు నిమిత్తం వచ్చే రోగులు నానా ఇబ్బందులను ఎదుర్కోవలసి వస్తోంది. హనుమకొండలోని ఎన్జీవోస్ కాలనీలో వడ్డెపల్లి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం దశాబ్దకాలంగా అద్దె భవనంలోనే కొనసాగుతోంది. అద్దె భవనం గదులు సైతం ఇరుకుగా ఉండడం వలన వైద్యం కోసం వచ్చే ప్రజలు ఇబ్బందులను ఎదుర్కోవలసి వస్తోంది. విశాలమైన గదులు లేక వైద్య పరీక్షల కోసం వచ్చే రోగులు గంటల తరబడి నిరీక్షిస్తున్నారు.

బీపీ, షుగర్‌తో పాటు రక్త పరీక్షల కోసం వచ్చే రోగులకు వసతులు లేక నానా అవస్థలు పడుతున్నారు. బీపీ, షుగర్ పరీక్షలను రోగుల ఇంటి వద్దకే రావల్సిన ఏఎన్ఎంలు సైతం రావడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భవనం ముందు పార్కింగ్ స్థలం లేక రోడ్డుపైనే ప్రజలు తమ వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు.

సొంత భవనం నిర్మించాలని వేడుకోలు

పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించేందుకు రెండేళ్ల కిందట వడ్డెపల్లి ముదిరాజ్ వీధిలోని ప్రభుత్వ స్థలంలో అప్పటి ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ భూమి పూజ చేశారు. సాంకేతిక కారణాల వల్ల భూమిని భవన నిర్మాణం కోసం అప్పగించకపోవడంతో నిర్మాణ పనులు ప్రారంభించలేదు. నిధులు మంజూరైనా స్థలం అప్పగించకపోవడంతో వడ్డెపల్లి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణం కలగానే మిగిలిపోయింది. వడ్డెపల్లి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఉప కేంద్రాల్లో సైతం అద్దె గదుల్లోనే కొనసాగుతున్నాయి.

సొంత భవనాన్ని వెంటనే నిర్మించాలి..



వడ్డెపల్లి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సొంత భవనాన్ని వెంటనే నిర్మించాలి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కనీస సౌకర్యాలు లేకపోవడం వలన ప్రజలు ఇబ్బందులను ఎదుర్కోవలసి వస్తోంది. వడ్డెపల్లి ముదిరాజ్ వాడలోని ప్రభుత్వ భూమిని వెంటనే సర్వే చేయించి నిర్మాణం పనులకు రెవెన్యూ అధికారులు అప్పగించాలి. **- బండి హరీష్ ముదిరాజ్, జవహర్ కాలనీ**



ఎన్జీవోస్ కాలనీలో అద్దె భవనంలో నిర్వహిస్తున్న వడ్డెపల్లి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



క్రీడాకారులకు ప్రశంసాపత్రాలను అందజేసిన ఎమ్మెల్యే నాగరాజు



ప్రభాకరచారిని సన్మానిస్తున్న దృశ్యం

జాతీయ స్థాయి బాక్సర్లుగా ఎదగాలి

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

హసన్‌పర్తి, జూన్ 16: క్రీడాకారులు శిక్షణా శిబిరాలను ఉపయోగించుకుని జాతీయ స్థాయి బాక్సర్లుగా ఎదగాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. ఆదివారం హసన్‌పర్తి హైస్కూల్‌లో నిర్వహిస్తున్న వేసవి ఉచిత బాక్సింగ్ శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బాక్సింగ్ అనేది ఒక పోరాట క్రీడ, ఒక యుద్ధ కళ అన్నారు. వేసవిలో విద్యార్థులు జల్సాలకు తిరుగకుండా ఈ ఉచిత బాక్సింగ్ కోచింగ్ క్యాంపును నిర్వహించినట్లు తెలిపారు. శిక్షణా శిబిరంలో నేర్చుకున్న క్రీడల్లో కష్టపడి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదగాలన్నారు. అనంతరం క్రీడాకారులకు మెమోంటోలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతపాక సునీత, మాజీ సర్పంచ్ జోరిక పూల, బీఆర్ఎస్ 66వ డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్, కిక్ బాక్సింగ్ కోచ్ శీలం పార్థసారధి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరెల్లి వెంకటస్వామి, కనపర్తి కిరణ్, గొర్రె కిరణ్, పోరెడ్డి మహేందర్‌రెడ్డి, తంగెళ్ళపెల్లి తిరుపతి, వీసం సురేందర్‌రెడ్డి, వి.వెంకటేశ్వర్లు, వి.రమణ, పెద్దమ్మ నర్సింహ రాములు, పి.ప్రభాకర్, నన్నంశెట్టి స్వామి పాల్గొన్నారు.

కళలకు పుట్టినిల్లు ఓరుగల్లు..

వడ్డెపల్లి: కళలకు పుట్టినిల్లు ఓరుగల్లు అని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో తెలుగు సంస్కృతి, సాహితీ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో జాతీయ పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎందరో కళాకారులు ఓరుగల్లు గడ్డపై పురుడు పోసుకొని జాతీయ స్థాయికి ఎదిగారని అన్నారు. అనంతరం తెలుగు సంస్కృతి సాహితీ సేవా ట్రస్టు 2024 జాతీయ స్థాయి పురస్కారాలను కేఆర్. నాగరాజు చేతుల మీదుగా చిన్నారులకు ప్రదానం చేశారు. కార్యక్రమంలో తెలుగు సంస్కృతి సాహితీ సేవా ట్రస్టు వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ మాచవరం గౌరీశంకర్, అద్దంకి నాగేశ్వర్‌రావు, గర్రెపల్లి నవీన్‌కుమార్, కరుణాకర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ఐనవోలు ఆలయ ఈవోకు స్వర్ణ నంది

ఐనవోలు: ఐనవోలు మల్లికార్జునస్వామి దేవస్థానం ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు దంపతులను స్వర్ణ నందితో పాటు కళ ప్రపూర్ణ బిరుదుతో సత్కరించారు. తెలుగు సాంస్కృతిక సేవా ట్రస్ట్ తెలంగాణ, ఏపీ, కర్ణాటక, తమిళనాడు ఆధ్వర్యంలో ఈ సత్కార కార్యక్రమం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. నిత్యం ఆధ్యాత్మిక సేవా రంగంలో విధులు నిర్వహిస్తున్న సందర్భంగా బిరుదును అందించినట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్ష చైర్మన్ బ్రహ్మశ్రీ డాక్టర్ మాచవరం గౌరిశంకర్ తెలిపారు.

సోషియాలజీలో ఎల్లయ్యకు డాక్టరేట్



కేయూ క్యాంపస్, జూన్ 16: కాకతీయ యూనివర్సిటీ సోషియాలజీ విభాగం పరిశోధకుడు మధుపాక ఎల్లయ్యకు డాక్టరేట్ లభించింది. ఈ మేరకు ఆదివారం కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నర్సింహచారి ఎల్లయ్యకు డాక్టరేట్ ప్రకటించనట్లు వెల్లడించారు. 'గౌతమ బుద్దాస్ టీచింగ్స్ అండ్ ఇట్స్ రెలెవెన్స్ టూ ది కాంటెంపరరీ ఇండియన్ సొసైటీ' అనే అంశంపై పరిశోధనకు గ్రంథాన్ని రూపొందించారు. కేయూ సోషియాలజీ విభాగం రిటైర్డు ప్రొఫెసర్ కె.రామానుజరావు పర్యవేక్షణలో పరిశోధన పూర్తిచేశారు. ఖిలా వరంగల్ ప్రాంతంలోని తిమ్మాపూర్‌కు చెందిన మధుపాక ఎల్లయ్య మహబూబాబాద్ జిల్లా కురవి మండలం బలపాల ఆరోగ్యకేంద్రంలో డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

గోదావరిలో యువకుడి గల్లంతు



అఖిల్(ఫైల్)

మహదేవపూర్, జూన్ 16: భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దర్శనానికి వచ్చిన ఓ యువకుడు గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరిస్తూ గల్లంతయ్యాడు. ఈ సంఘటన ఆఇవారం చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... వరంగల్ నగరానికి చెందిన సెంట్రింగ్ కార్మికుడు గరికపాటి ప్రవీణ్, రజిని దంపతుల కుటుంబ సమేతంగా కాళేశ్వరం పుణ్యక్షేత్రానికి వచ్చారు. స్నానాలు ఆచరించేందుకు గోదావరి వద్దకు వెళ్లారు. ఈ క్రమంలో వీరి కుమారుడు అఖిల్ (19) గోదావరి మధ్యలోకి వెళ్లి ఊబిలో చిక్కుకొని గల్లంతయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే కాళేశ్వరం పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై భవానీప్రసాద్ అక్కడికి చేరుకొని బోటు ద్వారా గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. అయినా ఆచూకీ లభించలేదు. ప్రవీణ్, రజిని దంపతులకు కుమారుడు అఖిల్‌తోపాటు కుమార్తె ఉంది. ఆటో నడుపుకుంటున్న అఖిల్ తండ్రికి చేదోడువాదోడుగా ఉంటున్నాడు.

వాలీబాల్ విజేత వరంగల్ వారియర్స్ జట్టు

ద్వితీయ స్థానంలో యంగ్ ఎలక్ట్రానిక్ మీడియా జట్టు
చెస్ విజేత ఆడేపు మహేందర్, ద్వితీయ స్థానంలో వేణుగౌడ్
కొనసాగుతున్న జర్నలిస్టుల క్రీడలు



జర్నలిస్ట్ క్రీడా పోటీల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ వెంకటేశ్వర్లుకు జ్ఞాపికను అందజేస్తున్న నిర్వాహకులు

వరంగల్ స్పోర్ట్స్, జూన్16: గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న జర్నలిస్ట్ స్పోర్ట్స్ - 2024లో భాగంగా వాలీబాల్ పోటీల్లో యంగ్ ఎలక్ట్రానిక్ మీడియా జట్టుపై వరంగల్ వారియర్స్ జట్టు ఘన విజయం సాధించింది. ఆదివారం హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలోని వాలీబాల్ కోర్టులో వరంగల్ వారియర్స్ వర్సెస్ యంగ్ ఎలక్ట్రానిక్ మీడియా జట్ల మధ్య నిర్వహించిన వాలీబాల్ ఫైనల్ పోటీలను 10వ డివిజన్ కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై టాస్ వేసి ప్రారంభించారు. అదే విధంగా ప్రెస్‌క్లబ్ ఆవరణలో ఆడేపు మహేందర్, వేణుగౌడ్ మధ్య నిర్వహించిన చెస్ ఫైనల్ పోటీలను ఆదర్శ లా కళాశాల అధినేత బూర విద్యాసాగర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఇందులో ఆడేపు మహేందర్ ప్రథమ స్థానంలో రాణించగా, ద్వితీయ స్థానంలో వేణుగౌడ్ నిలిచాడు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శి వేముల నాగరాజు, బొల్లారపు సదయ్య, వాలీబాల్ ఆర్గనైజర్స్ వలిశెట్టి సుధాకర్, మంచాల రాజు, విజయరాజు, చెస్ ఆర్గనైజర్స్ అల్లం రాజేష్ వర్మ, పొడిశెట్టి విష్ణువర్ధన్, బ్యూరో చీఫ్‌లు, స్టాఫ్ రిపోర్టర్లు, డెస్క్ జర్నలిస్టులు, సీనియర్ జర్నలిస్టులు, కోచ్‌లు పాల్గొన్నారు.

కిట్స్ ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు ఐఆర్‌సీఎస్ ప్రశంసాపత్రం



ప్రభుత్వ కార్యదర్శి వెంకటేశం నుంచి ప్రశంసా పత్రాన్ని స్వీకరిస్తున్న కిట్స్ యాజమాన్యం

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 16: వరంగల్ కిట్స్ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు 2023-24 విద్యా సంవత్సరంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీకి అత్యధికంగా 1,226 యూనిట్ల రక్తాన్ని అందించినందుకుగాను వారికి రెడ్ క్రాస్ సొసైటీ ప్రశంసా పత్రాన్ని అందజేసింది. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యాక్రమంలో తెలంగాణ రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా ఈ ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా కిట్స్ ఛైర్మన్ కెప్టెన్ లక్ష్మీకాంతరావు, యాజమాన్య సభ్యులు నారాయణరెడ్డి, సతీష్‌కుమార్, ప్రిన్సిపాల్ అశోక్‌రెడ్డి తదితరులు విద్యార్థులను అభినందించారు.

సీపీఐతోనే ప్రజా సమస్యలకు పరిష్కారం

రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీనివాసరావు

ధర్మసాగర్, జూన్ 16: దేశంలో కమ్యూనిస్టులు బలంగా ఉంటేనే ప్రజల సమస్యలు పరిష్కారించబడతాయని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ధర్మసాగర్ మండల కేంద్రంలో జిల్లా కార్యదర్శి భిక్షపతి అధ్యక్షత నిర్వహించిన సీపీఐ శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యూపీఏ హయాంలో వామపక్షాల మద్దతుతోనే ఉపాధిహామీ, అటవీ హక్కుల చట్టం, సమాచార హక్కు చట్టం తీసుకువచ్చామని గుర్తు చేశారు. అనంతరం అధికారంలోకి వచ్చిన నరేంద్రమోదీ ప్రభుత్వం పదేళ్లలో ప్రజలకు ఉపయోగపడే ఏ ఒక్క కార్యక్రమాన్ని కూడా అమలు చేయలేదన్నారు. మతం, కులం పేరుతో ప్రజలను విడదీసి రాజకీయ లబ్ధిని పొందేందుకు మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని తెలిపారు. ప్రజల కోసం పోరాటం చేసే సీపీఐ పార్టీని ఆదరించాలని, శిక్షణా తరగతుల ద్వారా పొందిన చైతన్యంతో సీపీఐ కార్యకర్తలు పార్టీని బలోపేతం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదరి శ్రీనివాస్, రాష్ట్రసమితి సభ్యురాలు సదాలక్ష్మి, కరుణాకర్, ఎల్లేష్, లక్ష్మణ్, భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌లను కలిసిన బల్దియా కమిషనర్



హనుమకొండ కలెక్టర్‌కు పూలమొక్కను అందిస్తున్న కమిషనర్ అశ్విని

వరంగల్ కార్పొరేషన్, జూన్ 16: రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల ఐఏఎస్ అధికారుల బదిలీలు జరిగిన విషయం తెలిసిందే. వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారదాదేవి, హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య కలెక్టర్‌లుగా బాధ్యతలు చేపట్టారు. ఇద్దరు కలెక్టర్‌లను గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇరు జిల్లాల కలెక్టర్‌లను వారి వారి కార్యాలయాల్లో ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కలను అందించారు. రెండు జిల్లాలలో ప్రభుత్వం నుంచి అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై మాట్లాడుకున్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

ఎల్కతుర్తి, జూన్ 16: కాంగ్రెస్ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం సాయంత్రం ఎల్కతుర్తి మండలం కేంద్రంలో కాంగ్రెస్ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు.

ప్లాట్ ఫారాల విస్తరణ లేనట్లే...

ఆధునీకరణ సరే.. సౌకర్యాలు కరువు..
తీవ్ర ఇబ్బందుల్లో ప్రయాణికులు
కాజీపేట జంక్షన్‌ను పట్టించుకోని రైల్వే అధికారులు



కాజీపేట జంక్షన్‌లోని ప్లాట్‌ఫారాలు

కాజీపేట, జూన్ 16: ప్రధాని మోదీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అమృత్ భారత్ పథకంలో భాగంగా పలు రైల్వేస్టేషన్‌ల ఆధునీకరణ చేపట్టారు. అయితే ఈ పథకం కాజీపేట రైల్వే స్టేషన్‌లో అమలయ్యేలా లేదు. ఇక్కడ ప్లాట్‌ఫారాల విస్తరణ ఇప్పట్లో లేనట్లు కనబడుతోంది. ప్రతీ రోజు 120 రైళ్ల రాకపోకలు, 20వేల మంది ప్రయాణికుల రాకపోకలు, రోజుకు రూ.6లక్షల ఆదాయం ఉన్న కాజీపేట జంక్షన్‌లో బ్రిటీష్‌వారు ప్రారంభించిన నాటి నుంచి ఉన్న ప్లాట్‌ఫారాలు ఇప్పటి వరకు ప్లాట్‌ఫారాలు విస్తరించకుండా ఈ మూడు ప్లాట్‌ఫారాలతోనే నెట్టుకొస్తున్నారు. హైదరాబాద్ - న్యూఢిల్లీ- చెన్నై మార్గాలనుంచి వచ్చే రైళ్లతో ప్లాట్‌ఫారాలు ఖాళీ లేకపోవడంతో స్టేషన్ దూరంలో రైళ్లను నిలిపివేసి ప్లాట్‌ఫామ్ ఖాళీ అయ్యేవరకు వేచి చూడాల్సిన పరిస్థితి.

దీంతో రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. అమృత్ భారత్‌లో కాజీపేట జంక్షన్ ఆధునీకరణ కోసం గత ఏడాది రూ.40కోట్లతో విమానాశ్రయం తరహాలో కాజీపేట జంక్షన్‌లో ఉన్న భవనాలు కూల్చివేసి భవనాలు నిర్మిస్తున్నారు. కానీ ప్లాట్‌ఫారాల విస్తరణకు చొరవ చూపట్లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కొత్త రైళ్లు ప్రారంభించొచ్చు..

రైళ్లద్వారా ప్రయాణించే ప్రయాణికులు సరైన రైళ్లు లేకపోవడంతో ఇతర మార్గాలను వెతుకుతున్నారు. ప్రయాణికులు, న్యూఢిల్లీ, ముంబయి, చెన్నై, బెంగళూరు, తిరుపతి, పాట్నాతోపాటు టూరిజం స్థలాలకు వెళ్లే నిత్యం కిక్కిరిసోతుంటాయి. వాటికూడా కనీసం మూడు నెలల ముందే టికెట్‌లు రిజర్వేషన్ చేసుకోవాల్సిన పరిస్థితి. ఒక వేళ ఇక్కడే సరిపోను ప్లాట్‌ఫారాలు ఉంటే ఇక్కడినుంచే కొత్త రైళ్ల ప్రారంభించొచ్చని రైల్వే కార్మిక నాయకులు అంటున్నారు. అందుకు కావాల్సిన పిట్‌లైన్ అంటే నూతనంగా రైళ్లు ప్రారంభించి మెయింటనెన్స్ చేసి సరైన ఫిట్ లైన్‌లు సైతం కాజీపేటలో ఉన్నాయని రైల్వే అధికారులు అంటున్నారు.

అసౌకర్యాలకు నిలయం

ఉత్తర భారత దేశాలను కలిపే కాజీపేట జంక్షన్ నిత్యం సమస్యల వలయంలో ఉంటుంది. ప్రతీరోజు వేలాదిగా ప్రయాణికులకు కనీస సౌకర్యాలు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్లాట్‌ఫారాలలో తాగునీరు లేక ప్రయాణికులు అల్లాడుతున్నారు. ప్లాట్‌ఫారాలలో రైళ్లలో టాయిలెట్స్ లేక ఇబ్బందులు, కిక్కిరిసిపోయే రైళ్లకు కనీసం జనరల్ బోగీలు పెంచాలనే ధ్యాస కూడా అధికారులకు లేదనే విమర్శలు లేవనెత్తున్నారు. ఆధునీకరణ పేరుతో కోట్లు నిధులను కేటాయించి రైల్వే స్టేషన్‌లకు రంగులద్ది, సోకులతోపాటు రైల్వే శాఖకు ఆదాయాన్నిచ్చే రైల్వే ప్రయాణికులకు సరైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.



వారసత్వంగా కొందరు... సేవా దృక్పథంతో మరి కొందరు... ఇటీవలి కాలంలో యువత రాజకీయాల్లో భాగస్వాములవుతున్నారు. ముఖ్యంగా మహిళలు నేరుగా ప్రజా క్షేత్రంలోకి దూకి... సవాలు విసురుతున్నారు. అలాంటి నవతరం నాయికలే హిందీ రాష్ట్రాలకు చెందిన శాంభవి చౌదరి, ప్రియా సరోజ్, సంజనా జాటవ్. పాతికేళ్ల ప్రాయంలో తొలిసారి పార్లమెంట్‌లో అడుగుపెడుతున్న ఈ ముగ్గురి నేపథ్యం ఇది...

నవతరం నాయికలు

పీహెచ్‌డీ విద్యార్థి

(శాంభవి చౌదరి, సమస్తీపూర్)

'కాలేజీలో చదివే రోజుల్లో ఒకసారి పార్లమెంటు చూడడానికి వెళ్లాను. నేడు ఎన్నికైన ఒక పార్లమెంటు సభ్యురాలిగా సభలోకి అడుగు పెడుతున్నాను. తలుచుకొంటేనే మహాద్భుతంగా అనిపిస్తోంది. ఎంతో ఉత్సుకతగా ఉంది. ఎన్నికలకు ముందు నా నియోజకవర్గానికి వెళ్లినప్పుడు నేనొక సాధారణ పౌరురాలిని. ఎంపీగా తిరిగి అక్కడకు వెళ్లినప్పుడు ఎంతో భావోద్వేగానికి లోనయ్యాను' అంటూ తన సంతోషాన్ని పంచుకున్నారు శాంభవి చౌదరి. ఆమె వయసు పాతికేళ్లు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో 'లోక్ జనశక్తి పార్టీ' (రామ్‌విలాస్) అభ్యర్థిగా బిహార్‌లోని సమస్తీపూర్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలుపొందారు. 'మగధ్ విశ్వవిద్యాలయం'లో 'రోల్ ఆఫ్ ఉమెన్ ఇన్ ఎలక్టరోల్ పాలిటిక్స్ ఇన్ బిహార్' అంశంపై ప్రస్తుతం ఆమె పీహెచ్‌డీ చేస్తున్నారు.

అయితే శాంభవికి రాజకీయాలు కొత్తేమీ కాదు. ఆమె తాతయ్య మహావీర్ చౌధరి చాలా కాలం కాంగ్రెస్ పార్టీలో ఉన్నారు. తండ్రి అశోక్ చౌధరి నితీష్‌కుమార్ ప్రభుత్వంలో మంత్రి. వాస్తవానికి శాంభవి సమస్తీపూర్ నివాసితులు కాదు. ఎన్నికల ప్రచారంలో ఈ అంశాన్ని ఒక అస్త్రంగా ఉపయోగించుకోవాలని అనుకున్నారు ఆమె ప్రత్యర్థులు. బయటి వ్యక్తి అంటూ హోరెత్తించారు. 'నా ఇల్లు ఇక్కడ ఉందా లేదా అన్నది ఓటర్లకు అవసరం లేదు. వాళ్లకు కావల్సింది... తమ తరఫున నిలబడి మాట్లాడగలిగే బలమైన నాయకులు. వారి సమస్యలను పరిష్కరించగలిగే సమర్థులు' అంటూ విమర్శలను తిప్పికొట్టారు శాంభవి. 'ఇంత చిన్న వయసులో మీరేం చేయగలరు' అని కూడా ఆమెను ప్రజలు ప్రశ్నించారు. 'నిజమే... నాతో పోటీపడుతున్న రాజకీయ నాయకులతో పోలిస్తే నేను చాలా చిన్నదాన్ని. కానీ నియోజకవర్గ సమస్యలపై పూర్తి అవగాహన ఉన్నదాన్ని. వాటి పరిష్కారానికి కృషి చేయాలన్న దృఢ సంకల్పంతో రాజకీయాల్లోకి వచ్చాను' అని బదులిచ్చి ప్రజల నమ్మకాన్ని గెలుచుకున్నారు. 'చిన్నప్పటి నుంచి రాజకీయాలు చూస్తూ పెరిగాను. కానీ ప్రజాక్షేత్రంలో నిలబడి వాళ్ల నమ్మకాన్ని పొందాలంటే ఎన్నో సమస్యలు, సవాళ్లు ఎదురవుతాయి. వాటన్నిటినీ నేను అధిగమించాను' అంటారామె. విశేషమేమంటే... సమస్తీపూర్ నియోజకవర్గం నుంచి పార్లమెంటుకు వెళుతున్న తొలి మహిళా ప్రతినిధి శాంభవి.

'అణగారిన వర్గాల అభ్యున్నతికి పాటుపడతా. యువత, మహిళల సాధికారత కోసం కృషి చేస్తానని విజయానంతరం నియోజకవర్గ ప్రజలకు మాటిచ్చాను. అలాగే రవాణా సౌకర్యాలను మెరుగు పరిచి, మా రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులు తెచ్చేందుకు ప్రయత్నిస్తా. తరచూ నా నియోజకవర్గాన్ని సందర్శించి, ప్రజలకు అందుబాటులో ఉంటా' అంటున్నారు ఈ యువ నాయకి.

వారి ప్రతినిధిగా...

(ప్రియా సరోజ్, మఛలీషహర్)

ఉత్తరప్రదేశ్ మఛలీషహర్ నియోజకవర్గం నుంచి గెలుపొందిన మరో పాతికేళ్ల యువతి ప్రియా సరోజ్. 'సమాజ్‌వాదీ పార్టీ' తరుపున పోటీ చేసిన ఈమెదీ రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబమే. ఆమె తండ్రి తూఫానీ సరోజ్ మూడుసార్లు ఎంపీ. ప్రస్తుతం కేరాకత్ నియోజకవర్గ ఎమ్మెల్యే. 'చిన్నప్పుడు నాన్నతో కలిసి చాలాసార్లు పార్లమెంటు భవనం చూశాను. కానీ ఈసారి ఎంతో ప్రత్యేకం. ఎన్నికల్లో పోటీ చేయడం, గెలవడం, ఒక సభ్యురాలిగా పార్లమెంటులో కూర్చోవడం... ఎంతో గర్వంగా ఉంది'... అంటారు ప్రియ. ఎన్నికల ప్రచారం వెనుకబడిన, అణగారిన వర్గాలు, మైనార్టీల గొంతుకగా తనను తాను అభివర్ణించుకున్న ప్రియ... అదే నినాదంతో పోటీకి దిగారు. రాజకీయాల్లోకి రాకముందే తన నియోజకవర్గం గురించి పూర్తి అవగాహన ఉంది. 2022 ఎన్నికల్లో తండ్రి కోసం ఆమె ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. 'ఢిల్లీ విశ్వవిద్యాలయం' నుంచి బీఏ పట్టా పొందిన ప్రియ... నోయిడా 'అమిటీ యూనివర్సిటీ'లో ఎల్ఎల్‌బీ చదివారు. ఎన్నికల బరిలోకి దిగే ముందు సుప్రీంకోర్టులో కేసులు వాదించారు. లా అండ్ ఆర్డర్, ఇతర సామాజిక అంశాలపై అవగాహన కల్పించడం ద్వారా మహిళా సాధికారత సాధించాలనేది ఆమె ఆశయం. అలాగే కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) అందించి, రైతులకు అండగా నిలుస్తాననీ, ఉద్యోగ అవకాశాలు పెంచే దిశగా కృషి చేస్తాననీ హామీ ఇచ్చారు.



విన్నర్

కానిస్టేబుల్ సతీమణి...

(సంజనా జాటవ్, భరత్‌పూర్)

కింది స్థాయి నుంచి ఎదిగిన యువ నాయకురాలు సంజనా జాటవ్. రాజస్తాన్‌లోని భరత్‌పూర్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరుఫున బరిలోకి దిగారు. బీజేపీ సిటింగ్ ఎంపీ రామ్‌స్వరూప్‌పై భారీ మెజారిటీతో విజయం సాధించారు. ఇది ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ స్వస్థలం. అందుకే సంజనను ఓడించడానికి ప్రత్యర్థులు సర్వశక్తులూ ఒడ్డారు. నియోజకవర్గం మీద పట్టున్న ఆమె, తన వాగ్ధాటితో వాటన్నిటినీ తిప్పి కొట్టారు.

రాష్ట్ర కాంగ్రెస్‌లో కార్యకర్త స్థాయి నుంచి ఎంపీ వరకు అత్యంత వేగంగా ఎదిగిన నాయకురాలు సంజన. 'నియోజకవర్గంలో పెచ్చుమీరుతున్న నేరాలు, నిరుద్యోగం, నీటి కొరత, విద్యుత్ అంతరాయాలు, అధ్వానమైన రోడ్లు, రైతులకు కనీస మద్దతు ధర లేకపోవడం, ఎరువులు, విత్తనాల కొరత... ఇలా అడుగడుగునా సమస్యలే. అన్నింటా మా ప్రాంతం వెనకబడిపోయింది. ఈ సమస్యలనే ప్రచార అస్త్రాలుగా ఉపయోగించాను. దానికి తోడు మొదటి నుంచీ నాకు ఇక్కడి ప్రజల స్థితిగతులపై పూర్తి అవగాహన ఉంది. నన్ను నమ్మి గెలిపించిన ప్రజలకు అండగా నిలబడతాను' అంటున్న సంజన బీఏ చదివారు. 'లడకీ హూ... లడ్‌సక్తీ హూ' అనే నినాదంతో, స్త్రీసాధికారత లక్ష్యంగా జనంలోకి వెళ్లారు. గత ఏడాది జరిగిన రాజస్తాన్ అసెంబ్లీ ఎన్నికల్లో కతుమార్ (ఎస్సీ) స్థానం నుంచి పోటీ చేసి 409 ఓట్ల స్వల్ప తేడాతో ఓడిపోయారు. వార్డు మెంబర్‌గా గెలిచి తన రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టిన 26 ఏళ్ల సంజన... నిత్యం జనం మధ్యే ఉంటూ, వారితో మమేకమయ్యారు.

సంజన భర్త కప్తాన్ సింగ్ పోలీస్ కానిస్టేబుల్. వారికి ఇద్దరు పిల్లలు. స్థానిక 'గాంధీ జ్యోతీ కాలేజీ'లో బీఏ చదివిన ఆమె... 'లార్డ్స్ యూనివర్సిటీ' నుంచి ఎల్ఎల్‌బీ పట్టా పొందారు. అణగారిన వర్గాలు, మహిళల పక్షాన నిలిచి, వారి అభ్యున్నతికి పాటు పడుతున్నారు. అవే సంజన విజయానికి బాటలు వేశాయి.



ఎకో విలేజ్ లేడీ...

"సామాన్యుల బతుకులు మారితేనే సమాజంలో పురోగతి సాధ్యమవుతుంది. ఆ పురోగతికి మార్గం మహిళా సాధికారతే" అంటారు నేహా ఉపాధ్యాయ్. పర్యాటకురాలుగా లద్దాఖ్ సందర్శించిన ఆమె... అక్కడ పరిస్థితులను చూసి ఆవేదన చెందారు. తాను ఆశించిన మార్పునకు స్వయంగా శ్రీకారం చుట్టి... వేలాది జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు. 'భారతదేశపు ఎకో విలేజ్ లేడీ'గా ప్రసిద్ధి చెందిన నేహా... తన పదేళ్ళ సేవా ప్రస్థానం గురించి ఏం చెబుతున్నారంటే...



"కొత్త ప్రదేశాల్ని సందర్శించడం, అక్కడి ప్రజల జీవన విధానాన్ని గమనించడం నాకు ఇష్టం. దేశంలో ఎన్నో ప్రాంతాలకు వెళ్లాను. కానీ 2010లో... లద్దాఖ్‌లోని లేహ్‌లో పర్యటనను నా జీవితంలో మరచిపోలేను. సముద్ర మట్టానికి దాదాపు 11 వేల అడుగుల ఎత్తున ఉండే ఆ ప్రదేశంలో వాతావరణం విలక్షణంగా ఉంటుంది. మామూలుగా వర్షపాతం చాలా తక్కువ. కానీ హఠాత్తుగా భారీ వర్షాలు కురిస్తే... అల్లకల్లోలం తప్పదు. ఎందుకంటే... వర్షాలను తట్టుకోవడానికి తగిన ఏర్పాట్లు అక్కడ లేవు. అక్కడికి నేను వెళ్ళిన సమయంలోనే... కుండపోత వర్షాలు పడి, వరదలు ముంచుకొచ్చాయి. అందులో ఆరు వందల మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. లద్దాఖ్ పరిధిలో ఎనభై శాతం మౌలిక సదుపాయాలు పూర్తిగానో, పాక్షికంగానో ధ్వంసమయ్యాయి. అరవైకి పైగా గ్రామాలు నాశనమయ్యాయి. బతికి బయటపడ్డవాళ్ళు కట్టుబట్టలతో మిగిలారు. కొన్ని రోజులపాటు నేను అక్కడే చిక్కుకుపోయాను. అప్పుడే అక్కడి ప్రజల కష్టాలను కళ్లారా చూశాను. వాళ్ళ బతుకులు బాగుపడడానికి ఏదైనా చెయ్యాలనుకున్నాను.

విద్దూరంగా చూశారు...

నేను పుట్టింది, పెరిగింది ఢిల్లీలో. లండన్‌లోని కింగ్స్ కాలేజీలో గ్రాడ్యుయేషన్ చేశాను. ఇంగ్లండ్‌లోని విద్యాసంస్థల్లో ఉద్యోగాలు చేశాను. కొన్నాళ్ళ తరువాత మన దేశానికి వచ్చేశాను. అదే సమయంలో... లద్దాఖ్‌కు వెళ్ళినప్పుడు... అక్కడ కళ్ళారా చూసిన విధ్వంసం నన్ను కదిలించింది. భీకరమైన వరద నుంచి ఆ ప్రాంతం కాస్త కోలుకున్నాక... మళ్ళీ అక్కడికి వెళ్ళి, పరిస్థితుల మీద అధ్యయనం చేశాను. ఒక లీటర్ నూనె కోసం కొన్ని గ్రామాల ప్రజలు 35 కిలోమీటర్లు నడవాల్సి వస్తోందని విని... మొదట నమ్మలేకపోయాను. ఆ సమస్య పరిష్కారం కోసం అధికారుల చుట్టూ కొన్నాళ్ళు తిరిగి, ఆ గ్రామాల్లో నూనె తీసే యంత్రాలను ఏర్పాటు చేయించాను. ఇక అక్కడి మహిళల బాధలు వర్ణనాతీతం. ఒక హెక్టార్ పొలంలో ఏడాదికి సగటున 1,212 గంటలపాటు పురుషులు పనిచేస్తే... మహిళలు 3,485 పని చేయాల్సి వస్తోంది. ఇంటి పనులు, వంట పనులు, పిల్లల పెంపకం, అత్తమామల సంరక్షణ... ఇలాంటి పనులు మామూలే. వారికి ఆర్థిక స్వావలంబన కల్పించడమే లక్ష్యంగా... 'విశ్వదీప్ ట్రస్ట్'ను... దానికి అనుబంధంగా 'గుణ ఆర్గానిక్స్' అనే సంస్థను ప్రారంభించాను. కొంత పొలాన్ని తీసుకొని... సేంద్రియ వ్యవసాయానికి ప్రణాళికలు రూపొందించాను. మహిళలతో సమావేశాలు ఏర్పాటు చేసి... రసాయనాల వాడకం వల్ల ఖర్చు ఎక్కువ కావడంతోపాటు పర్యావరణానికి హాని కలుగుతుందని వివరించాను. ఇది విని వాళ్ళు విడ్డూరంగా చూశారు. ఎందుకంటే... ఖరీదైన రసాయన ఎరువులు ఉపయోగిస్తేనే... పంటలు బాగా పండుతాయనే భావన వారిలో నాటుకుపోయింది. ఇంకా వ్యవసాయం విషయంలో వారికి ఎన్నో అపోహలు ఉన్నాయి. వాటన్నిటినీ క్రమంగా తొలగించాను. నా పొలంలో పనులన్నిటికీ మహిళలనే కుదుర్చుకున్నాను. ఒక పంట చేతికి వచ్చాక... వారిలో విశ్వాసం పెరిగింది. ఆ తరువాత ఇతర రైతులు కూడా అనుసరించడం మొదలుపెట్టారు.

ఎకో మోడల్ విలేజీలు...

గత పదేళ్ళ కాలంలో... మూడువేల మందికి పైగా రైతులకు మా ట్రస్ట్ ఆర్థిక స్వావలంబన కల్పించింది. గ్రామీణుల జీవన పరిస్థితుల్ని మెరుగుపరచడం, మరిన్ని ఉపాధి అవకాశాలను కల్పించడం ప్రధాన లక్ష్యంగా నిర్దేశించుకున్నాం. అలాగే పంటలను ఎండబెట్టడానికి... సోలార్ డ్రైయింగ్ పద్ధతులను కూడా పరిచయం చేశాం. అన్ని దశల్లోనూ సౌరశక్తినే వినియోగిస్తూ, సేంద్రియంగా సాగు చేయడం కోసం ప్రయోగాత్మకంగా తకమచిక్ గ్రామాన్ని ఎంచుకున్నాం. దాన్ని మొదటి ఎకో మోడల్ విలేజ్‌గా తీర్చిదిద్దాం. ఇది మాకు మంచి పేరు తెచ్చిపెట్టింది. ఇప్పటివరకూ ఎనిమిది గ్రామీణ ప్రాంతాలను ఎకో విలేజ్‌లుగా మార్చాం. సౌరశక్తితో ఎండబెట్టిన ఉత్పత్తుల మార్కెటింగ్ ద్వారా మహిళలు మంచి ఆదాయం పొందుతున్నారు. మరోవైపు స్థానికంగా సామాజికాభివృద్ధి కార్యక్రమాలను కూడా మా ట్రస్ట్ విరివిగా చేపడుతోంది. ఎప్పటికప్పుడు ఆధునిక వ్యవసాయ పద్ధతుల్లో, ఉత్పత్తుల మార్కెటింగ్‌లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఇళ్ళలో టాయిలెట్ల ఏర్పాటుకు సహాయం అందిస్తున్నాం. కోవిడ్ సమయంలోనూ, అలాగే వరదలు, ఇతర సంక్షోభాలు వచ్చిన సమయంలో సహాయ, పునరావాస చర్యలు చేపట్టాం. ఇప్పుడు ఢిల్లీ, సిక్కింలకు కూడా మా ప్రాజెక్టులను విస్తరించాం. సుస్థిరమైన పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతపై పాఠశాలలు, కర్మాగారాలు, కార్పొరేట్ సంస్థల్లో ప్రచారం చేస్తున్నాం. 'బీట్ ది ప్లాస్టిక్ పొల్యూషన్' ఉద్యమం ద్వారా... మేము కార్యకలాపాలు చేపట్టిన గ్రామాలను ప్లాస్టిక్ రహితంగా మార్చాం. గత పదేళ్ళలో ఎన్నో సంస్థలు నాకూ, మా ట్రస్ట్‌కూ పురస్కారాలు అందజేశాయి. బ్రిటిష్ కౌన్సిల్ నుంచి 'సోషల్ ఇంపాక్ట్ ఇండియా అవార్డు, ఐఐటీ ఢిల్లీ నుంచి 'ఎంటర్‌ప్రెన్యూర్ ఎక్సలెన్స్' అవార్డు, 'ఎర్త్‌డే నెట్‌వర్క్ స్టార్' అవార్డు వీటిలో ముఖ్యమైనవి. 'భారతదేశపు ఎకో విలేజ్ లేడీ' అనే గుర్తింపు నా బాధ్యతను మరింత పెంచుతోంది. దేశంలోని గ్రామాలన్నీ ఎకో విలేజ్‌లుగా మారాలన్నది నా కల. యువతలో మునుపటికన్నా పర్యావరణ స్పృహ బాగా పెరుగుతోంది కాబట్టి... భవిష్యత్తులో ఆ కల నిజమవుతుందనే నమ్మకం నాకుంది."



నవ్య | చిత్రజ్యోతి



కళావేదిక, రాఘవి మీడియా సంస్థల ఆధ్వర్యంలో 'కళావేదిక ఎన్టీఆర్ ఫిల్మ్ అవార్డ్స్' ప్రధానోత్సవ కార్యక్రమం ఈ నెల 29న హైదరాబాద్‌లోని దసపల్లా హోటల్‌లో జరుగనుంది. ఈ కార్యక్రమం పోస్టర్‌ను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదివారం ఆవిష్కరించి, నిర్వాహకులను అభినందించారు.

ట్రెండ్ సెట్ చేసే రారాజు



సినిమా టైటిల్ కార్డ్స్ నుంచి శుభం కార్డుపడేవరకూ తెరపై ఎన్నో పాత్రలు వచ్చి పోతుంటాయి. అలాంటిది సినిమా ఆద్యంతం పాత్రధారుల ముఖాలు కనిపించకుండా తెరకెక్కించి ప్రేక్షకులను మెప్పించడం సాధ్యమేనా? అంటే ఆ పనిని తాము విజయవంతంగా పూర్తి చేశామంటున్నారు దర్శక నిర్మాత బి. శివ ప్రసాద్. ఆయన రూపొందించిన 'రారాజు' చిత్రంలోని 24 మంది పాత్రధారుల ముఖాలు కనిపించవు. బిగి సడలని కథనం బోర్ కొట్టకుండా ప్రేక్షకులను కథలో లీనమయ్యేలా చేస్తుందని శివ ప్రసాద్ అన్నారు. శనివారం ఈ చిత్రం టీజర్‌ను హీరో అల్లరి నరేశ్ ఆవిష్కరించారు. 'ముఖాలు కనిపించకుండా సినిమా ఎలా తీయగలిగారు? అనే ఒక్క కారణం కోసమైనా 'రారాజు' చిత్రాన్ని చూడాలనిపిస్తోంది. ఈ సినిమా కచ్చితంగా ట్రెండ్ సెట్ చేస్తుంద'ని అల్లరి నరేశ్ చెప్పారు. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తామని నిర్మాత తెలిపారు. సుగి విజయ్, మౌనిక మగులూరీ హీరో హీరోయిన్లుగా నటించారు. శేఖర్ చంద్ర మ్యూజిక్ అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: రాహుల్ శ్రీ వాత్సవ్.

మామయ్యకు ప్రేమతో...



ఎన్నికల్లో గెలిచి ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణం స్వీకారం చేసిన పవన్‌కల్యాణ్‌కు ఆయన కుటుంబ సభ్యుల నుంచి వరుస బహుమతులు పలకరిస్తున్నాయి. ఇటీవలే వదిన సురేఖ నుంచి ఖరీదైన మాంట్ బ్లాంక్ పెన్నును అందుకున్న పవన్, తాజాగా తన మేనల్లుడు సాయి దుర్గాతేజ్ నుంచి మరో బహుమతి అందుకున్నారు. ఆదివారం సాయి దుర్గాతేజ్ పవన్‌కు హాలీవుడ్ సూపర్ హిట్ సినిమా సిరీస్ 'స్టార్‌వార్స్' ఫ్రాంచైజీకి చెందిన 'స్టార్‌వార్స్ లెగో మిలీనియమ్ ఫాల్కన్' కిట్‌ను అందించారు. దాదాపు 1.20 లక్షల విలువ చేసే ఈ బహుమతిలో 'స్టార్‌వార్స్' సినిమాలోని ప్రధాన పాత్రధారుల బొమ్మలు, వారి ఆయుధాలు, వాహనాలు ఉంటాయి. "నా బాల్యంలో నాకు 'స్టార్‌వార్స్'ను, లెగో టాయ్స్‌ను పరిచయం చేసిన నా జేడీ మాస్టర్ (గురువు), ఉప ముఖ్యమంత్రికి ఇది నా కానుక. మళ్లీ ఇన్నేళ్లకు మీలోని బాలుడికి ఈ బహుమతిని ఇవ్వడం ద్వారా నా చిన్నప్పటి రోజులను గుర్తు చేసుకునే అవకాశం దక్కింది" అని ఎక్స్‌లో పేర్కొన్నారు.

'సెట్టవుతుందా పెయిరు'



రాజ్‌తరుణ్, మనీషా కంద్కూర్ జంటగా నటిస్తున్న చిత్రం 'భలే ఉన్నాడే'. జె.శివసాయి దర్శకత్వం వహిస్తుండగా, డైరెక్టర్ మారుతి సమర్పణలో, ఎన్వీ.కిరణ్‌కుమార్ నిర్మిస్తున్నారు. ఇటీవలే విడుదలైన టీజర్ అందరినీ అలరించింది. శనివారం ఈ సినిమా నుంచి సెకండ్ సింగిల్ 'సెట్టవుతుందా పెయిరు' పాటను విడుదల చేశారు. కృష్ణకాంత్ రాసిన ఈ పాటను కపిల్ కపిలన్ ఆలపించారు. శేఖర్ చంద్ర సంగీతం అందించారు. ఈ చిత్రానికి ఎడిటర్: శ్రీకాంత్ పట్నాయక్ ఆర్, డీఓపీ: నగేశ్ బానెల్లా.

మాస్టారు కథతో...

శ్యామ్ సెల్వన్ హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'నిమ్మకూరు మాస్టారు'. రాజేంద్రప్రసాద్ ఇందులో కీలక పాత్ర పోషిస్తున్నారు. అముదేశ్వర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని జె.ఎమ్.ప్రదీప్‌రెడ్డి నిర్మిస్తున్నారు. ఆదివారం ఈ చిత్రాన్ని తెలంగాణ రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ క్లాప్ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా సంగీత దర్శకులు మాధవపెద్ది సురేశ్‌చంద్ర మాట్లాడుతూ "నా మనవడు శ్యామ్ ఇటువంటి మంచి కథతో సినిమా కెరీర్‌ను ఆరంభిస్తున్నందుకు ఆనందంగా ఉంది" అని అన్నారు. "మొదటి సినిమాలోనే రాజేంద్రప్రసాద్ వంటి లెజెండ్‌తో స్క్రీన్ పంచుకోవడం ఆనందంగా ఉంది" అని హీరో శ్యామ్ సెల్వన్ చెప్పారు. ఈ చిత్రానికి ఎడిటర్: ఎ.ఆర్.శివరాజ్, సినిమాటోగ్రాఫర్: ఎ.డి. కరుణ్, సంగీతం: మాధవపెద్ది సురేశ్‌చంద్ర.





టీజీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం


చెవి అనేది వినడానికి, సమతాస్థితికి ఉపయోగపడే జ్ఞానేంద్రియం. చెవి గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని ఒటాలజీ అంటారు. మానవుడు 20 హెర్ట్‌జ్‌ల నుంచి 20,000 హెర్ట్‌జ్‌ల వరకు మాత్రమే ధ్వనిని వినగలుగుతాడు. దీనినే శ్రవ్య అవధి అని పిలుస్తారు. 20 హెర్ట్‌జ్‌ల కన్నా తక్కువ పౌనఃపున్యం ఉన్న ధ్వని తరంగాలను పరశ్రావ్యాలు అంటారు. వీటిని ఏనుగులు, గబ్బిలాలు, కుక్కలు వంటి జీవులు వినగలుగుతాయి. గబ్బిలాలు తమ ఆహారపు అన్వేషణలో భాగంగా ప్రతిధ్వనుల ద్వారా ముందు ఉన్న అవరోధాలను గుర్తించి లక్ష్యాన్ని చేరుకుంటాయి. ధ్వనిని డెసిబెల్స్‌లో కొలుస్తారు.

• బయాలజీ

చెవిలో మూడు భాగాలు ఉంటాయి.
అవి... బాహ్య చెవి, మధ్య చెవి, లోపలి చెవి.

బాహ్య చెవి: దీనిని వెలుపలి చెవి అని కూడా పిలుస్తారు. దీనిలో పిన్నా, బాహ్య శ్రవణ కుహరం, కర్ణభేరి త్వచము అనే మూడు భాగాలుంటాయి. పిన్నాను చెవి దొప్పగా పేర్కొంటారు. ఇది స్థితిస్థాపక మృదులాస్థి నిర్మాణం. బాహ్య శ్రవణ కుహరము ఒక వంపు తిరిగిన నాళం లా ఏర్పడి పిన్నా, కర్ణభేరి త్వచము మధ్య విస్తరించిన నిర్మాణం. చెవి దొప్ప, బాహ్యశ్రవణ కుహర చర్మంలో సున్నిత రోమాలు, మైనం అనేవి ఉంటాయి. చెవిలోకి దుమ్ము, ధూళి ఇతరత్రా రేణువులు ప్రవేశించకుండా రోమాలు, మైనం నిరోధిస్తాయి. కర్ణభేరి త్వచము శంఖువు ఆకారంలో ఉంటుంది. ఈ త్వచము బాహ్య శ్రవణ కుహరాన్ని, మధ్య చెవిని వేరు చేసే పలుచని అర్ధ పారదర్శక పొర. ఈ త్వచం శబ్దతరంగాలను బాహ్య చెవి నుంచి గ్రహించి మధ్య చెవిలోని కూటకానికి అందిస్తుంది.

చెవి నిర్మాణం



మధ్య చెవి: మధ్య చెవి అనేది బాహ్య చెవి కర్ణభేరి త్వచానికి, లోపలి చెవి అస్థి విభాజకానికి మధ్యలో విస్తరించి ఉంటుంది. ఇది పుర్రెలోని టెంపోరల్ ఎముకలో ఏర్పడిన గాలితో నిండి ఉంటుంది. మధ్య చెవిలో మాలియస్, ఇంకస్, స్టెపిస్ అనే మూడు అస్థి ఖండాలు ఉంటాయి. మాలియస్‌ని హేమర్‌బోన్ అని, ఇంకోస్‌ని అన్విల్ బోన్ అని, స్టెపిస్‌ని స్టిరప్ బోన్ అని పేర్కొంటారు. ఈ ఎముకలు మూడు గొలుసులుగా ఒకదానితో ఒకటి కలిసి ఉం టాయి. మాలియస్ తలభాగం ఇంకస్‌తో, పరాంతభాగం కర్ణభేరి త్వచంతో కలుపబడి ఉంటుంది. ఇంకస్ అనేది మధ్య ఎముక. ఇది స్టెపిస్ తలతో కలుపబడి ఉంటుంది. లోపలి చెవి అస్థివిభాజకంలోని అండాకార రంధ్రపు కిటికితో స్టెపిస్ కలుపబడి ఉంటుంది. ఈ మాలియస్, ఇంకస్, స్టెపిస్ మూడు ఎముకలు శబ్ద ప్రకంపనలను లోపలి చెవికి అందజేస్తాయి. మధ్య చెవి కుహరం గ్రసనిని కలుపుతూ యుస్టేషియన్ నాళం ఉంటుంది. ఈ నాళం కర్ణభేరి త్వచానికి ఇరువైపులా వాయు పీడనాన్ని సమానస్థాయిలో ఉంచడానికి తోడ్పడుతుంది.

లోపలి చెవి: వినికిడి ప్రక్రియలో ప్రధాన పాత్రను వహించేది లోపలి చెవి. ఇది ద్రవంతో నిండి ఉన్న కుహరం. దీనిని లాబరింత్ అంటారు. దీనిలో బోని లాబరింత్, మెంబ్రినస్ లాబరింత్ అనే రెండు భాగాలు ఉంటాయి. బోని లాబరింత్‌లో వరుసగా కాక్లియా, వెస్టిబుల్, సెమి సర్క్యులర్ కెనాల్స్ అనే మూడు రకాల కుల్యాలు ఉంటాయి.

ఎ.కాక్లియా: దీనినే కర్ణావర్తనం అని కూడా పిలుస్తారు. ఇది సర్పిలాకార నిర్మాణం. కాలా వెస్టిబ్యులి, స్కాలా మీడియా, స్కాలా టింపాని అనే మూడు సమాంతర నాళాలుంటాయి.

బి.వెస్టిబుల్: దీనిలోని ముందు భాగాన్ని సాక్యులస్ అని, వెనుక భాగాన్ని యుట్రిక్యులస్ అని పేర్కొంటారు. సాక్యులస్, యుట్రిక్యులస్ రెండింటిని కలిపి ఆటోలిత్ అంగంగా పిలుస్తారు.

సి. సెమి సర్క్యులర్ కెనాల్స్: ఇవి మూడు ఉంటాయి. ఒకదానికొకటి లంబకోణంలో అమరి ఉంటాయి. వీటి పీఠభాగం ఉబ్బి ఉంటుంది.

వినికిడి ప్రక్రియ

బాహ్య చెవి శబ్ద తరంగాలను గ్రహించి కర్ణభేరి త్వచం మీదకు మళ్లిస్తుంది. ఈ శబ్దతరంగాలకు అనుగుణంగా కర్ణభేరి త్వచం కంపిస్తుంది. ఈ ప్రకంపనలు మూడు ఎముకలైన మాలియస్, ఇంకస్, స్టెపిస్ ద్వారా అండాకార రంధ్రపు కిటికీ వద్దకి చేరి కాక్లియాలోనికి ప్రవేశించి పెరిలింఫ్, ఎండోలింఫ్ ద్రవాలలో అలలను ఉత్పత్తి చేస్తాయి. ఈ అలలు బేసిల్లార్ త్వచంలో ఒక చిన్న అలను కలిగిస్తాయి. ప్రేరణ వల్ల బేసిల్లార్ త్వచంలోని హేర్ సెల్స్ ఒరిగి టెక్టోరియల్ త్వచం మీద ఒత్తిడి కలిగిస్తాయి. అందు వల్ల సన్నిహిత అభివాహి నాడీ కణాలలో నాడీ ప్రచోదనం ఏర్పడి శ్రవణ నాడీ ద్వారా మెదడుని చేరుతుంది. అక్కడ నాడీ ప్రచోదనం విశ్లేషించబడి ధ్వని గుర్తించబడుతుంది.

చెవికి సంబంధించిన అపస్థితులు

ఒటిటిస్ మీడియా: ఇది చిన్న పిల్లల్లో సాధారణంగా ఉండే అపస్థితి. మధ్య చెవిలోని యూస్టేసియన్ నాళం పొట్టిగా ఉన్నట్లయితే బ్యాక్టీరియా సంక్రమణకు గురైనప్పుడు చెవిలో చీము అధికంగా వస్తుంది.

టిన్నీటస్: మెదడులో కణితులు ఏర్పడినప్పుడు గాని, అధిక శబ్దాలు విన్నప్పుడు గాని చెవిలో మైనం(సెరుమినస్) అధికంగా ఏర్పడినప్పుడు గాని లోపలి చెవిలో ఉన్న హేర్ సెల్స్ దెబ్బతింటాయి. అప్పుడు చెవిలో గిర్రమని వింత శబ్దాలు రింగ్ అవుతున్నట్లుగా ఉండే స్థితినే టిన్నిటస్ అంటారు.

చెవిటి తనం: కర్ణభేరి త్వచం దెబ్బతిన్నప్పుడు చెవిటితనం వస్తుంది. ఒక వేళ చెవిలో గులిమి(మైనం) వలన ఆటంకం వస్తే హైడ్రోజన్ పెరాక్సైడ్ వాడాలి.



కె.నాగశేషులు,
సీనియర్ ఫ్యాకల్టీ

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

'జన్యు వనరులు', 'సాంప్రదాయిక జ్ఞానం'పై
మేధాసంపత్తి ఒప్పందం

అనాదిగా భారతీయ వంటగదిలోని పోపులపెట్టే చిన్నపాటి ఫస్ట్‌ఎయిడ్ బాక్స్ కాగా, పెరటిలోని అనేక మొక్కలు మందులనిచ్చే కల్పతరువులు. దెబ్బలకు పసుపు, కఫానికి తులసి, దగ్గుకు కరక్కాయ, దంత సంరక్షణకు వేపపుల్ల... ఇలా చెప్పుకొంటూపోతే భారతీయ సాంప్రదాయిక విజ్ఞానం ఒక వైద్యరంగం వద్దే ఆగిపోదు. వ్యవసాయం, పశుపోషణ వంటి అనేక రంగాల్లో మమేకమై కనిపిస్తుంది. అదేవిధంగా భారతదేశ భౌగోళిక, వాతావరణ వైవిధ్యతల దృష్ట్యా జన్యువనరులపరంగా కూడా దేశం సుసంపన్నం.

అయితే హఠాత్తుగా ఎవరోవచ్చి వీటి వైశిష్ట్యాలను ప్రయోగశాలల్లో తాము నిర్ధారించాము కాబట్టి వీటిపై తమకు యాజమాన్యపు హక్కులున్నాయని అంటే? తరతరాలుగా వస్తున్న సాంప్రదాయిక విజ్ఞానంపై మనకు హక్కు లేకుండా మేధాసంపత్తి హక్కులను వారు దాఖలు పర్చుకుంటే?

నిజానికి గతంలో అదీ జరిగింది. పసుపు, వేప వంటి భారతీయ సాంప్రదాయిక వైద్య విజ్ఞాన అంశాలతోపాటు, నేఫాల్, నేఫాల్-49 గోధుమ రకాలు, బాస్మతి బియ్యం వంటి జన్యు వనరులపై కూడా మేధాసంపత్తి హక్కులను విదేశీ సంస్థలు తీసుకున్నాయి. 1995లో అమెరికా తమ దేశంలోని యూనివర్సిటీ ఆఫ్ మిసిస్సిపీ మెడికల్ సెంటర్ పసుపునకు గాయాలు నయంచేసే గుణం ఉందని ప్రయోగాత్మకంగా రుజువు చేయడంతో పేటెంట్ మంజూరు చేసింది. అయితే ఇండియన్ కౌన్సిల్ ఫర్ సైన్స్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్) అందించిన చారిత్రక ఆధారాలతో తరవాత ఆ పేటెంట్ రద్దయింది.

అదేవిధంగా వేపకాయల నుంచి తీసిన అజాడిరాక్టిన్ ప్రధాన పదార్థంగా తయారుచేసిన ఒక ఔషధంపై 'డబ్ల్యూఆర్ గ్రేస్' అనే కంపెనీకి పేటెంట్ మంజూరైంది. అయితే దీనిపై భారత్ తీవ్రంగా ప్రతిస్పందించడంతో పునఃపరిశీలించి యురోపియన్ పేటెంట్ ఆఫీస్ దానిని రద్దు చేసింది. కానీ యునైటెడ్ స్టేట్స్ పేటెంట్ అండ్ ట్రేడ్‌మార్క్ ఆఫీస్ దానిని రద్దు చేయలేదు.

భారతదేశానికి చెందిన నాప్‌హాల్ గోధుమ రకాలపై 2003లో ఒక యురోపియన్ కంపెనీ బయోపైరసీ(ప్రకృతిసిద్ధ సహజ జన్యు పదార్థాల అక్రమ వినియోగం) చేసి పేటెంట్లు పొందింది. వాస్తవానికి ఇవి సహజ వనరులని, కొత్త ఆవిష్కరణలు కావని భారత అధికారులు సాక్ష్యాలు సమర్పించడంతో పేటెంట్లు రద్దుచేశారు.

ఇదేవిధంగా 2000 సంవత్సరంలో కూడా ఒక అమెరికన్ కంపెనీ బాస్మతి బియ్యంపై పొందిన పేటెంట్‌ను రద్దు చేయించడానికి భారతీయ అధికారులు పెద్ద న్యాయపోరాటమే చేశారు.

ఈవిధంగా ఒక దేశానికి లేదా ప్రాంతానికి చెందిన సాంప్రదాయిక జ్ఞానం, జన్యు వనరులపై వేరొకరు పేటెంట్ పొందడమంటే వారి హక్కులను హరించడమే కాదు, న్యాయంగా వారికి దక్కాల్సిన ప్రయోజనాలు దక్కకుండా పోవడమే. అందుకే ఈ సమస్యను పరిష్కరించడానికి సాంప్రదాయిక, జన్యు వనరులను ఎవరైనా వినియోగిస్తున్నప్పుడు న్యాయబద్ధంగా సంబంధీకులకు దక్కాల్సిన వాటాను అందించడానికి తోడ్పడేలా 2010లో నగోయా ప్రోటోకాల్ తీసుకువచ్చారు. అయితే ఇది అంత సమర్థంగా పనిచేయకపోతుండటంతో మరో కొత్త కట్టుబాటు అవసరమైంది. ఈ నేపథ్యంలో ప్రపంచ మేధాసంపత్తి సంస్థ(వరల్డ్ ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ ఆర్గనైజేషన్) ఇటీవల 'ట్రీటీ ఆన్ ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ(ఐపీ), జెనెటిక్ రిసోర్సెస్ (జీఆర్స్) అండ్ అసోసియేటెడ్ ట్రెడిషనల్ నాలెడ్జ్(ఏటీకే) (మేధా సంపత్తి, జన్యు వనరులు, పారంపర్య సాంప్రదాయిక విజ్ఞాన ఒప్పందం) తీసుకువచ్చారు.

ప్రపంచ మేధోసంపత్తి సంస్థ(డబ్ల్యూఐపీఓ) ప్రధాన కార్యాలయం(జెనీవా)లో 2024 మే 13-24 మధ్య రెండువారాల పాటు, 192 దేశాలు 86 మంది పరిశీలకులు సుదీర్ఘ చర్చలు జరిపిన దరిమిలా మే 24న 'మేధాసంపత్తి, జన్యువనరులు, పారంపర్య సాంప్రదాయిక విజ్ఞాన ఒప్పందం' సాకారమైంది.

ఒప్పంద ముఖ్యాంశాలు

1. ఇప్పటివరకూ ఉన్న మేధోసంపత్తి పరిరక్షణ ఒప్పందాలన్నింటిలోనూ సాంప్రదాయిక విజ్ఞానం, జన్యు వనరులపై స్థానికులకు ఉన్న హక్కును గుర్తించిన ఏకైక ఒప్పందం ఇది.

2. ఒక దేశానికి సంబంధించిన సాంప్రదాయిక విజ్ఞానం, జన్యు వనరులను ఇతరులు దోచుకోకుండా, అక్రమంగా వినియోగించుకోకుండా ఈ ఒప్పందం అడ్డుకుంటుంది. దీనిలో ఉన్న 'మాండేటరీ డిస్‌క్లోజర్ ఆబ్లిగేషన్స్' అనే నిబంధన ప్రకారం పేటెంట్ దరఖాస్తుదారు ఏదైనా జన్యువనరులను గానీ, సాంప్రదాయిక విజ్ఞానాన్ని గానీ తమ ఆవిష్కరణలో వినియోగిస్తే అది ఏ దేశానికి చెందిందో, ఆ విజ్ఞానాన్ని పరిరక్షిస్తున్న వారెవరో కూడా స్పష్టంగా వెల్లడించాల్సి ఉంటుంది.

3. ఈ ఒప్పందం ద్వారా జన్యు వనరులు, సాంప్రదాయిక విజ్ఞానం ప్రపంచవ్యాప్తంగా పరిరక్షించేందుకు అన్ని భాగస్వామ్య దేశాలు తమ దేశీయ మేధాసంపత్తి హక్కుల చట్టాల్లో 'డిస్‌క్లోజర్ ఆఫ్ ఆరిజన్'(సదరు జన్యు వనరు/సాంప్రదాయిక విజ్ఞానం ఏ ప్రాంతానికి చెందిందో వెల్లడించే) నిబంధనను చేర్చాల్సి ఉంటుంది.

4. ఈ ఒప్పందం సాంప్రదాయిక విజ్ఞానం, జన్యువనరుల నుంచి నేరుగా సంగ్రహించిన అంశాలకు కాక వాటిని వినియోగించి చేసిన సరికొత్త ఆవిష్కరణలకు మాత్రమే మేధోసంపత్తి హక్కులను అందించడానికి సమ్మతిస్తుంది.

ఒప్పంద ప్రయోజనాలు

1. సాంప్రదాయిక విజ్ఞానం, జన్యు వనరుల సంవృద్ధి గల భారతదేశం, గ్లోబల్ సౌత్ దేశాల ప్రయోజనాలు, హక్కులు పరిరక్షించగలుగుతారు.
2. బయోపైరసీ ద్వారా ఇతరులు అక్రమ లబ్ధి పొందడాన్ని నివారించి సాంప్రదాయిక విజ్ఞానం, జన్యు వనరుల పరిరక్షణతో సంబంధం గల స్థానిక ప్రజలకు లబ్ధి చేకూరుతుంది.
3. మేధాసంపత్తి హక్కుల పరిరక్షణలో అంతర్జాతీయ ప్రమాణాలు ఏర్పడి, దేశాల మధ్య మేధాసంపత్తి హక్కుల వివాదాలు తగ్గుముఖం పడతాయి. పారదర్శకత పెరుగుతుంది.
4. విజ్ఞాన చౌర్యం, జన్యు వనరుల నకిలీలు తయారు కాకుండా ప్రాచీన విజ్ఞానం, జన్యు వనరుల ఆధారంగా సరికొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించవచ్చు.

అయితే 1999 నుంచి జరిపిన సుదీర్ఘ చర్చల ప్రతిరూపంగా 25 సంవత్సరాల తరవాత సాకారమైన ఈ ఒప్పందం అమలులోకి రావాలంటే కనీసం 15 సభ్యదేశాలు సంతకాలు చేసి, దానిని ర్యాటిఫై (ధృవీకరించాల్సి) ఉంటుంది. అదేవిధంగా ఇది పటిష్టంగా అమలు కావాలంటే అన్ని దేశాలు తమ మేధాసంపత్తి హక్కుల చట్టాలను ఈ ఒప్పందానికి అనుగుణంగా సరిదిద్దాల్సి ఉంటుంది. అయితే ఇప్పటివరకు కేవలం 35 దేశాల్లో మాత్రమే 'డిస్‌క్లోజర్ ఆఫ్ ఆరిజన్' వంటి నిబంధనలు వారి మేధాసంపత్తి హక్కుల చట్టాల్లో చేర్చారు. ఇకముందు ఎన్ని ఎక్కువ దేశాలు ఇలాంటి నిబంధనలను స్వీకరిస్తాయన్న దానిపైనే ఈ ఒప్పంద అమలు ఆధారపడి ఉంటుంది. ఈ ఒప్పందం పటిష్టంగా అమలుకావడమంటే ప్రపంచ జీవవైవిధ్యంలో ఏడు నుంచి ఎనిమిది శాతం వరకు కలిగి ఉన్న, సాంప్రదాయిక విజ్ఞానపరంగా సుసంపన్నమైన భారతదేశానికి శుభపరిణామమే.

మేధాసంపత్తి హక్కు అంటే?

ఒక వ్యక్తి లేదా సంస్థ ఆవిష్కరణలను, ఇతరులు కాపీచేసి వారు అనాయాస లబ్ధి పొందకుండా ఆవిష్కర్తకు ఆ ఆవిష్కరణపై కొంత కాలానికి సర్వహక్కులు కల్పిస్తూ ఇచ్చే చట్టబద్ధమైన హక్కు.

ప్రపంచ మేధాసంపత్తి సంస్థ(డబ్ల్యూఐపీఓ)

- ఇది ఐక్యరాజ్య సమితికి చెందిన ఒక అంగము. స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో ఉంది.
- దీనిని మేధోసంపత్తి హక్కుల విషయమై అంతర్జాతీయ సహకారం పెంపొందించడానికి 1967లో ఏర్పాటుచేశారు.
- దీనిలో 193 సభ్యదేశాలున్నాయి.
- భారతదేశం 1975లో దీనిలో చేరింది.
- మేధాసంపత్తి హక్కుల విషయమై చర్చలకు ఒక అంతర్జాతీయ వేదికగా, వివాద పరిష్కార కేంద్రంగా పనిచేస్తుంది.
- అంతర్జాతీయ మేధాసంపత్తి ఒప్పందాలను పర్యవేక్షిస్తుంది.
- మేధాసంపత్తి హక్కుల రిజిస్ట్రేషన్ చేస్తుంది.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

టీజీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

దిశలు - దూరాలు

• రీజనింగ్

పార్ట్-1


సామాన్యంగా నాలుగు దిక్కులు లేదా దిశలు ఉన్నాయనే విషయం అందరికి తెలిసిందే. అవి తూర్పు, పడమర, ఉత్తరం, దక్షిణం. న్యూస్ అనే పదంలో N అంటే North - ఉత్తరం, E అంటే East - తూర్పు, W అంటే West - పడమర, S అంటే South - దక్షిణం. ప్రపంచంలోని నాలుగు వైపుల నుంచి వచ్చే సమాచారమే NEWS. తూర్పు, పడమర, ఉత్తరం, దక్షిణం అనేవి ముఖ్యమైన దిశలు(మెయిన్ డైరెక్షన్స్) ఇవి కాక ఇంకా నాలుగు అంతర్భాగ దిశలు ఉన్నాయి. అవి-

ఈశాన్యం - North East
ఆగ్నేయం - South East
నైరుతి - South West
వాయువ్యం - North West

ఈ టాపిక్‌కి సంబంధించిన ప్రశ్నలలో ఎక్కువగా బయలుదేరినస్థానం నుంచి చేరినటువంటి స్థానానికి గల దూరాన్ని లేదా చేరినటువంటి స్థానం నుంచి బయలుదేరిన స్థానానికి గల దూరాన్ని అంతేకాక బయలుదేరిన స్థానం నుంచి చేరుకొనే స్థానం ఏ దిశలో ఉంది వంటి వివిధ రకాల ప్రశ్నలు అడుగుతారు.

ఇచ్చిన సమాచారాన్ని అనుసరిస్తూ అభ్యర్థి రఫ్ డయాగ్రమ్ గీయాల్సి ఉంటుంది. ఇటువంటి ప్రశ్నలలో అభ్యర్థికి పూర్తి అవగాహన కలగాలంటే కింది రేఖాచిత్రాన్ని గుర్తించుకోవడం చాలా అవసరం.

ముఖ్యరేఖాచిత్రం(మెయిన్ డయాగ్రమ్)



నోట్: ఈ చాప్టర్‌కు సంబంధించి అడిగే ప్రశ్నలకు పై రేఖాచిత్రంలో మిడిల్ పాయింట్‌ను బేసిక్‌గా తీసుకోవాలి. పై రేఖాచిత్రంలో మిడిల్ పాయింట్‌ను బేసిక్‌గా తీసుకొంటే దానికి కుడివైపు అంటే తూర్పు, ఎడమ వైపు అంటే పడమర, పై వైపు అంటే ఉత్తరం, కిందవైపు అంటే దక్షిణానికి అని అర్థం.

గమనిక: ఒక్కొక్కసారి ప్రశ్నలో ఎడమవైపునకు తిరగడం లేదా కుడివైపునకు తిరగడం అని ఇస్తుంటారు. ఎడమవైపునకు తిరగడం అంటే (యాంటీ క్లాక్ వైజ్) గడియారపు అపసవ్యదిశ, కుడివైపునకు తిరగడం అంటే(క్లాక్ వైజ్) గడియారపు సవ్యదిశ.


<u>కుడివైపునకు తిరగడం
గడియారపు సవ్యదిశ</u>

<u>ఎడమవైపునకు తిరగడం
గడియారపు అపసవ్యదిశ</u>



దిశలకు సంబంధించిన ముఖ్య సమాచారం:


1. **ఒక వ్యక్తి ఉత్తరం వైపు చూస్తూ నిలబడిన అతనికి కుడివైపు తూర్పుదిక్కు, ఎడమవైపు పడమర దిక్కు అవుతుంది.**



వ్యక్తి ఉత్తరం వైపు చూస్తున్నాడు.


2. **ఒక వ్యక్తి దక్షిణం వైపు చూస్తూ నిలబడిన అతనికి కుడివైపు పడమర, ఎడమవైపు తూర్పు అవుతుంది.**

వ్యక్తి దక్షిణం వైపు చూస్తున్నాడు



3. **ఒక వ్యక్తి తూర్పు దిక్కును చూస్తూ నిలబడిన అతనికి ఎడమవైపు ఉత్తరం, కుడివైపు దక్షిణం అవుతుంది.**

వ్యక్తి తూర్పు దిక్కును చూస్తున్నాడు



4. **ఒక వ్యక్తి పడమర దిక్కును చూస్తూ నిలబడిన అతనికి ఎడమవైపు దక్షిణం, కుడివైపు ఉత్తరం అవుతుంది.**



వ్యక్తి పడమర దిక్కును చూస్తున్నాడు.

ముఖ్యమైన పట్టిక

దిశ	కుడి	ఎడమ
తూర్పు	దక్షిణం	ఉత్తరం
పడమర	ఉత్తరం	దక్షిణం
ఉత్తరం	తూర్పు	పడమర
దక్షిణం	పడమర	తూర్పు

అంతర్భాగ దిశలకు సంబంధించిన సమాచారం:


1. ఒక వ్యక్తి ఈశాన్యాన్ని చూస్తూ నిలబడిన కుడివైపు ఆగ్నేయం, ఎడమ వైపు వాయువ్యం అవుతుంది.
2. ఒక వ్యక్తి ఆగ్నేయాన్ని చూస్తూ నిలబడిన కుడివైపు నైరుతి, ఎడమవైపు ఈశాన్యం అవుతుంది.
3. ఒక వ్యక్తి నైరుతిని చూస్తూ నిలబడిన కుడివైపు వాయువ్యం, ఎడమ వైపు ఆగ్నేయం అవుతుంది.
4. ఒక వ్యక్తి వాయువ్యాన్ని చూస్తూ నిలబడిన కుడివైపు ఈశాన్యం, ఎడమ వైపు నైరుతి అవుతుంది.

1. **అచ్యుత్ 40మీ ఉత్తరానికి నడిచిన తరవాత తూర్పుకి తిరిగి 30మీ నడిచాడు. తదుపరి మరల దక్షిణానికి తిరిగి 25మీ॥ నడిచిన తరవాత పడమరకు తిరిగి 30మీ॥ నడిచాడు. అయితే ఇప్పుడు అచ్యుత్ బయలు దేరిన స్థానం నుంచి ఎంతదూరంలో ఏ దిశలో ఉన్నాడు?**

ఎ) తూర్పు 15 మీ॥ బి) పడమర 15 మీ॥
సి) ఉత్తరం 15 మీ॥ డి) దక్షిణం 15 మీ॥

సమాధానం: (సి)

వివరణ: A - బయలుదేరినస్థానం B - చేరుకొన్నస్థానం



పై రేఖాచిత్రంలో బయలుదేరిన స్థానం(A)కు చేరుకున్న స్థానం (B) పైకి ఉంది. ఈ చాప్టర్‌లోని మెయిన్ డయాగ్రమ్‌ను పరిశీలిస్తే మిడిల్ పాయింట్ నుంచి పైకి అంటే ఉత్తరం అని చెప్పారు. అంతేకాక పై రేఖాచిత్రాన్ని బట్టి అవినాష్ బయలుదేరిన స్థానం నుంచి 15మీ॥ దూరంలో ఉన్నాడని తెలుస్తోంది.

సమాధానం ఉత్తరం 15మీ॥

షార్ట్‌కట్: ముందుగా ప్రశ్నలో ఇచ్చిన సమాచారం రాసుకోవాలి. అది ఏమనగా ఉత్తరం 40, తూర్పు 30, దక్షిణం 25, పడమర 30. తదుపరి వ్యతిరేక దిశలలో సేమ్ వాల్యూ ఉంటే అది కాన్సిల్ అవుతుంది. పై సమాచారంలో తూర్పు, పడమర వ్యతిరేక దిశలు. వాటి విలువలు సమానంగా ఉన్నాయి(సేమ్ వాల్యూ) కాబట్టి కాన్సిల్ మిగిలిన వ్యతిరేక దిశలలో ఏది ఎక్కువ ఉంది ఎంత ఎక్కువ ఉంది అదే సమాధానం. ఉత్తరం 40, దక్షిణం 25లో ఉత్తరం 15 ఎక్కువ ఉంది కావున సమాధానం ఉత్తరం 15.


2. **A నుంచి బయలుదేరి దేవి దక్షిణం వైపుకి 6మీ॥ నడిచిన తరవాత కుడివైపుకు తిరిగి 8మీ॥ నడిచి B అనే ప్రదేశానికి చేరాడు. అయితే ఇప్పుడు దేవి బయలుదేరిన స్థానం నుంచి ఎంత దూరంలో, ఏ దిశలో ఉన్నాడు?**


ఎ) నైరుతి 10 మీ॥ బి) నైరుతి 14 మీ॥
సి) ఈశాన్యం 14 మీ॥ డి) ఆగ్నేయం 10 మీ॥

సమాధానం: (ఎ)

వివరణ:

A -బయలుదేరిన స్థానం. B - చేరుకున్న స్థానం





పై రేఖాచిత్రాన్ని బట్టి దేవి బయలుదేరిన స్థానానికి చేరుకున్న స్థానం నైరుతిలో ఉంది.

A, B మధ్య దూరాన్ని కింది విధంగా కనుగొనాలి.

పైథాగరస్ సిద్ధాంతం ప్రకారం కర్ణం^{2}=భుజం^{2} +భుజం^{2}

పై రేఖాచిత్రంలో ఒక భుజం 8 మీ॥, మరొక భుజం 6మీ॥ కర్ణం (A, B)

కర్ణం^{2} = 82 + 62
కర్ణం^{2} = 64 + 36
కర్ణం^{2} = 100

కర్ణము = $\sqrt{100}$ = 10మీ॥

దీనిని బట్టి దేవి బయలుదేరిన స్థానం నుంచి 10 మీ॥ దూరంలో నైరుతిలో ఉన్నదని తెలుస్తోంది.

3. **P, Q, R, S అనే నలుగురు బల్లకు నాలుగు వైపుల కూర్చొని క్యారమ్స్ ఆడుతున్నారు. P, Rలు భాగస్వాములు Q తూర్పునకు ముఖభాగం కలిగి ఉన్నాడు. P దక్షిణానికి ముఖభాగం కలిగి ఉన్నాడు. అయితే పడమరకు ముఖభాగం కలిగి ఉన్న వ్యక్తి ఎవరు?**

ఎ) R బి) S సి) చెప్పలేం డి) ఏదీకాదు

సమాధానం: (బి)

వివరణ: P, Q, R, S నలుగురు నాలుగు వైపులా కూర్చొంటారు. ఎదురెదురు వ్యక్తులు భాగస్వాములౌతారు. P, R భాగస్వాములు. కావున Q, S మరొక భాగస్వాములు అవుతారు. Q తూర్పునకు ముఖభాగం కలిగి ఉన్నాడని ప్రశ్నలో చెప్పారు. Q, S భాగస్వాములు కనుక పడమర వైపు ముఖభాగం కలిగి ఉన్న వ్యక్తి 'S' అవుతారు. సమాధానం 'S'



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్
సీనియర్ ఫ్యాకల్టీ

యూపీఎస్సీ ప్రిలిమ్స్.. సూటిగా ప్రశ్నలు

- పేపర్ సులభం.. పెరగనున్న కటాఫ్!
- కటాఫ్ 80-95గా ఉండే చాన్స్: నిపుణులు

ఆంధ్రజ్యోతి ఎడ్యుకేషన్ డెస్క్: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) ఆదివారం నిర్వహించిన సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. పరీక్ష కేంద్రాల వద్ద అధికారులు నిబంధనలను కఠినంగా అమలు చేశారు. అరగంట ముందే గేట్లను మూసివేయడంతో ఒక్క నిమిషం ఆలస్యమైన విద్యార్థులెందరో పరీక్ష రాయలేకపోయారు. పలు కేంద్రాల వద్ద మహిళా అభ్యర్థులు పరీక్షకు అనుమతించకపోవడంతో కంటతడి పెట్టారు.

సులభంగా పేపర్లు

సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో మొదటి అంకమైన ప్రిలిమ్స్ పేపర్ సులువుగానే ఉందని అభ్యర్థులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం నిర్వహించిన జనరల్ స్టడీస్(జీఎస్), మధ్యాహ్నం జరిగిన సీశాట్.. రెండూ సులభంగానే వచ్చాయని సివిల్స్ మెంటార్ ఎం.బాలలత పేర్కొన్నారు. "సీశాట్ అర్హత పరీక్ష కాగా జీఎస్ పేపర్‌లో వచ్చిన మార్కుల ప్రాతిపదికగానే కటాఫ్‌ను నిర్ణయించి మెయిన్స్‌కు పంపుతారు. సీశాట్ ప్రశ్నలు నాన్ మ్యాథ్స్ అభ్యర్థులకూ చాలా ఈజీగా ఉన్నాయి. దాంతో చాలా మంది అందులో అర్హత సాధిస్తారు. ఈసారి కటాఫ్ పెరిగే అవకాశం ఉంది" అని 'లా ఎక్సలెన్స్ ఐఏఎస్' అధినేత రాంబాబు వ్యాఖ్యానించారు.

ఇక జీఎస్‌లో ఈసారి చాలా ప్రశ్నలు నేరుగా వచ్చాయి. తికమకపెట్టే ప్రశ్నలు తక్కువ. ఆప్షన్స్‌లో సందిగ్ధత లేదు. అందుకే ఈసారి కటాఫ్ 80-95 మధ్య ఉండవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. 90 ఆపై మార్కులు సాధిస్తామని భావించే అభ్యర్థులు వెంటనే మెయిన్స్‌పై దృష్టి సారించవచ్చంటున్నారు. గతేడాది రెండు పేపర్లూ కష్టంగా ఉండటంతో కటాఫ్ 75 మార్కులుగా నిర్ణయించారు. జీఎస్‌లో పాలిటీ నుంచి 20 ప్రశ్నలు వచ్చాయి. భూగోళశాస్త్రం(19 ప్రశ్నలు), ఎకానమీ(14), పర్యావరణం-వ్యవసాయం(12), అంతర్జాతీయ సంబంధాలు(11), శాస్త్ర సాంకేతిక రంగాలు (10), చరిత్ర-కళలు-సంస్కృతి (9), ప్రభుత్వ పథకాలు, వర్తమాన వ్యవహారాలు(5) ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. పాలిటీలో ప్రశ్నలు సులువుగా ఉన్నాయి. జాగ్రఫీలో క్లయిమెటాలజీ ప్రశ్నలు ఎక్కువ వచ్చాయి. హిస్టరీలో ఎక్కువగా ప్రాచీన భారతదేశ చరిత్ర నుంచి ప్రశ్నలు అడిగారు. సింగిల్ స్టేట్‌మెంట్ ప్రశ్నలు ఎక్కువ రావడం ఈసారి బాగా కలిసివచ్చింది. ఎకానమీ, జాగ్రఫీలో కాన్సెప్ట్ ఆధారిత ప్రశ్నలు వచ్చాయి. బేసిక్స్ బలంగా ఉన్న అభ్యర్థులకు పాలిటీలో ఎక్కువ మార్కులు వస్తాయనడంలో సందేహంలేదని నిపుణులు చెబుతున్నారు. అలాగే కరెంట్ అఫైర్స్‌లో ప్రశ్నలు సూటిగా ఉన్నాయి. మొత్తమ్మీద అన్ని విభాగాల్లో సులువు నుంచి మధ్యస్థంగా ప్రశ్నలున్నాయి. ఈసారి ప్రశ్నల సరళిలో ఒక వైవిధ్యం స్పష్టంగా కనిపించింది. గతంలో రెండు వర్గాల మధ్య జతపర్చమని అడిగే వారు. ఈసారి మూడు వర్గాల మధ్య అనుసంధానం చేయాల్సి వచ్చింది. ఉదాహరణకు జలపాతాలు- అవి ఉన్న ప్రాంతం- నది వంటి అంశాలను జతపర్చాలని అడిగారు. గడిచిన రెండేళ్ల ట్రెండ్ ఈసారి కనిపించలేదు. అయితే 2019, 2020 నాటి ట్రెండ్ ఈ ఏడాది ఇచ్చిన పేపర్‌లో కనిపించింది. మొత్తానికి ఇది సులువైన పేపరే అని విషయ నిపుణులు చెబుతున్నారు.

ట్రాఫిక్ కానిస్టేబుల్ ఉదారత



రాజేంద్రనగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): యూపీఎస్సీ ప్రిలిమ్స్‌కు వెళ్తున్న ఓ యువతిని పరీక్ష కేంద్రానికి తరలించడంలో రాజేంద్రనగర్ ట్రాఫిక్ కానిస్టేబుల్ సురేశ్ సేవా దృక్పథాన్ని, ఉదారతను చాటుకున్నారు. మహావీర్ ఇంజనీరింగ్ కాలేజీలో పరీక్ష కేంద్రం ఉన్న ఓ యువతి.. ఆర్టీసీ బస్సులో మైలార్‌దేవుపల్లి పల్లెచెరువు బస్టాప్ వద్ద దిగారు. అక్కడి నుంచి పరీక్ష కేంద్రం చాలా దూరంలో ఉండడం.. సమయం మించిపోతుండడంతో ఆమె కంగారు పడ్డారు. అక్కడే విధుల్లో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ సురేశ్ ఆమె ఆందోళనను గుర్తించారు. ఆమె వద్దకు వెళ్లి.. విషయం తెలుసుకున్నారు. దీంతో సురేశ్ ఆమెను తన మోటార్‌సైకిల్‌పై కూర్చోబెట్టుకుని, పరీక్ష కేంద్రం వద్ద దిగబెట్టారు. స్థానికులు తీసిన ఈ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

లోకం తీరు



52 ఏళ్ల మహిళ.. 12 రోజుల్లో వెయ్యి కిలోమీటర్ల పరుగు

- అల్ట్రామారథాన్ నటాలీడౌ ఘనత ఇది



న్యూఢిల్లీ, జూన్ 16: సింగపూర్‌కు చెందిన నటాలీడౌ(52) అనే మహిళ అనితర సాధ్యమైన ఓ సాహసాన్ని ఇటీవల విజయవంతంగా పూర్తి చేశారు. నటాలీ డౌ 12 రోజుల్లో వెయ్యి కిలోమీటర్ల దూరం పరుగెత్తారు. ఈ క్రమంలో ఏకంగా మూడు దేశాలను చుట్టేశారు. గత మే 25వ తేదీన థాయ్‌లాండ్‌లో పరుగును మొదలుపెట్టిన నటాలీ.. మలేషియా మీదుగా జూన్ 5న సింగపూర్ చేరుకుని ఈ అరుదైన ఫీట్ సాధించారు. మహిళలు, బాలికల ఆరోగ్యం అనే అంశంపై అవగాహన కల్పించడంతోపాటు విరాళాల సేకరణే లక్ష్యంగా 'ప్రాజెక్ట్ 1000' పేరిట ఆమె ఈ పరుగును ప్రారంభించారు. ఆరోగ్యాన్ని పెంపొందించుకునేందుకు తన 30వ ఏట పరుగును ప్రారంభించిన నటాలీడౌ.. ప్రాజెక్ట్ 1000లో భాగంగా రోజుకి 84.2 కిలోమీటర్లు చొప్పున పరుగెత్తారు. తాను నిర్దేశించుకున్న 1000 కిమీల లక్ష్యాన్ని 12 రోజుల్లో పూర్తి చేశారు. అంటే ప్రతీ రోజు రెండు మారథాన్‌లు పూర్తి చేశారు. ఈ క్రమంలో ఎండ, వానలు, తుంటి గాయం, అనారోగ్యాన్ని కూడా లెక్క చేయలేదు. ఎండల నుంచి తప్పించుకునేందుకు కొన్ని రోజులు అర్ధరాత్రి తర్వాత మొదలుపెట్టి తెల్లవారుజాము వరకు పరుగెత్తేవారు. ఏదేమైనా అనుకున్న లక్ష్యాన్ని సాధించిన నటాలీడౌ.. 'ఫాస్టెస్ట్1000 కిమీ థాయ్‌లాండ్- సింగపూర్ అల్ట్రామారథాన్' రికార్డును సొంతం చేసుకున్నారు. అంతేకాక, అత్యంత వేగంగా మలేషియాను కాలినడకన దాటిన వ్యక్తిగా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ నమోదు చేశారు. ఇక, తన పరుగుతో నటాలీడౌ క్రీడల ద్వారా మహిళలు, అమ్మాయిల్లో నాయకత్వ సామర్థ్యాన్ని పెంపొందించేందుకు కృషి చేసే ఓ సంస్థకు 50 వేల డాలర్లు(దాదాపు రూ.42లక్షలు) విరాళాలు సేకరించారు.

ఆరెస్సెస్ చీఫ్ భాగవత్‌తో యోగి ఏకాంత చర్చలు

- ఒకే రోజున రెండు సార్లు.. యూపీలో బీజేపీ ఓటమిపైనేనా?



గోరఖ్‌పూర్, జూన్ 16: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ అధినేత మోహన్ భాగవత్‌తో యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఏకాంతంగా చర్చలు జరపడం ప్రాధాన్యం సంతరించుకొంది. యోగి స్వస్థలమైన గోరఖ్‌పూర్‌లో శనివారం రెండుసార్లు ఈ భేటీలు జరిగాయి. తొలుత మధ్యాహ్నం కాంపెయిర్‌గంజ్‌లో ఆరెస్సెస్ కార్యకర్తల సమావేశం జరిగిన అనంతరం అక్కడి పాఠశాలలో ఇరువురు నేతలు అరగంట పాటు చర్చలు జరిపారు. రాత్రి 8.30 గంటల సమయంలో పక్కీబాగ్‌లోని సరస్వతి శిశు మందిర్‌లో మరో 30 నిమిషాల పాటు చర్చలు జరిపారు. ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ బలంగా ఉందని అందరూ భావిస్తుండగా ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో దారుణంగా ఓడిపోవడానికిగల కారణాలపై చర్చించినట్టు తెలుస్తోంది. కాగా కంటి ఆపరేషన్ నిమిత్తం రిషికేష్ ఎయిమ్స్ ఆస్పత్రిలో చేరిన తన తల్లి గాయత్రి దేవిని ఆదివారం యోగి ఆదిత్యనాథ్ పరామర్శించారు. సుమారు మూడు గంటల పాటు ఆస్పత్రిలో ఉన్నారు.

అడ్మిషన్ రద్దు చేసుకుంటే పూర్తి ఫీజు వాపసు

న్యూఢిల్లీ, జూన్ 16: విద్యార్థులు నిర్ణీత గడువులోగా ఉన్నత విద్యాసంస్థల్లో తమ అడ్మిషను రద్దు చేసుకుంటే వారికి పూర్తి ఫీజును వాపసు ఇవ్వాలని విశ్వవిద్యాలయాలను యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) ఆదేశించింది. అడ్మిషన్ల చివరి తేదీకి 15 రోజులు, అంత కన్నా ముందే అడ్మిషన్‌ను రద్దు చేసుకుంటే 100 శాతం ఫీజు రిఫండ్ ఇచ్చేలా కొత్త నిబంధనలు జారీ చేసింది. 2024-25 విద్యాసంవత్సరం నుంచే ఈ కొత్త ఫీజు రిఫండ్ పాలసీని అమలు చేయాలని వర్సిటీలను ఆదేశించింది.

కోటాలో మరో విద్యార్థి ఆత్మహత్య

జైపూర్, జూన్ 16: రాజస్థాన్‌లోని కోటాలో మరో విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. బిహార్‌లోని మోతీహరి ప్రాంతానికి చెందిన 17 ఏళ్ల ఆయుశ్ జైస్వాల్.. స్థానిక సామ్రాట్ చౌక్‌లో అద్దెకుంటూ ఐఐటీ- జేఈఈ శిక్షణ తీసుకుంటున్నాడు. శనివారం రాత్రి దాకా గది నుంచి బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చి స్నేహితులు వెళ్లి చూడగా.. ఆయుశ్ తన గదిలో ఉరివేసుకొని కనిపించాడు. ఆస్పత్రికి తీసుకువెళ్లగా అప్పటికే అతను మరణించాడని వైద్యులు ధ్రువీకరించారు. ఎడ్యుకేషన్ హబ్‌గా పేరుగాంచిన కోటాలో ఈ ఏడాది ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల సంఖ్య 11కు చేరింది.

ట్రాన్స్‌జెండర్లకు 1% రిజర్వేషన్లు ఇవ్వండి

- బెంగాల్ సర్కారుకు హైకోర్టు ఆదేశం

కోల్‌కతా, జూన్ 16: ప్రభుత్వ ఉద్యోగాల్లో ట్రాన్స్‌జెండర్లకు ఒక శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని కలకత్తా హైకోర్టు ఆదేశించింది. ట్రాన్స్‌జెండర్లను కూడా అందరితో సమానంగా చూస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినా ఇంతవరకు రిజర్వేషన్లు కల్పించని విషయాన్ని గుర్తుచేసింది. అందువల్ల ఒక శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని న్యాయమూర్తి జస్టిస్ రాజశేఖర్ మంథా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. 2014, 2022ల్లో రెండు సార్లు టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్)లో అర్హత సాధించినా తనను ఇంటర్వ్యూకు పిలవలేదని పేర్కొంటూ ఓ ట్రాన్స్‌జెండర్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయమూర్తి ఈ ఆదేశాలు ఇచ్చారు. ట్రాన్స్‌జెండర్లకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు ఇవ్వాలంటూ సుప్రీంకోర్టు ఆదేశించిన విషయాన్ని కూడా గుర్తు చేశారు.

ఇందిరను మదర్ ఆఫ్ కాంగ్రెస్ అని చెప్పా

- వివరణ ఇచ్చిన కేంద్రమంత్రి సురేశ్ గోపి
- మీడియా వక్రీకరించిందని వ్యాఖ్య

తిరువనంతపురం, జూన్ 16 : దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీని 'మదర్ ఆఫ్ ఇండియా'గా అభివర్ణించడం సంచలనం కావడంతో కేంద్ర మంత్రి సురేశ్ గోపి ఆదివారం వివరణ ఇచ్చారు. తిరువనంతపురంలో మీడియాతో మాట్లాడుతూ.. తాను ఇందిరను 'మదర్ ఆఫ్ ది కాంగ్రెస్ పార్టీ' అన్నానని.. మీడియా దాన్ని వక్రీకరించిందని చెప్పుకొచ్చారు. "ఎవరికి ఇష్టం ఉన్నా లేకపోయినా.. కాంగ్రెస్‌కు సంబంధించినంత వరకు కేరళలో కె. కరుణాకరన్ తండ్రి వంటివారు.. దేశంలో ఇందిరాగాంధీ తల్లి.. ఇదే నేను అన్నాను." అని ఆయన చెప్పుకొచ్చారు.

నీట్‌లో రెండుచోట్ల అవకతవకలు

మొదటిసారి ఒప్పుకొన్న కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్.. ప్రభుత్వం దీన్ని తీవ్రంగా పరిగణిస్తోందని స్పష్టీకరణ

- ఎన్‌టీఏ అధికారుల తప్పున్నట్టు తేలితే వదిలిపెట్టం.. వారు కఠిన శిక్ష అనుభవించాల్సిందేనని హెచ్చరిక
- 'నీట్'పై మోదీ మౌనం మంచిది కాదు
- 'సుప్రీం' కమిటీతో దర్యాప్తు జరిపించాలి
- వైద్యవిద్యలో ప్రవేశాలపై అన్ని రాష్ట్రాలతో సంప్రదింపులు జరపాలి: కపిల్ సిబల్





న్యూఢిల్లీ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): నీట్ నిర్వహణలో అక్రమాలు నిజమేనని కేంద్ర ప్రభుత్వం తొలిసారిగా ఒప్పుకొంది. రెండుచోట్ల అవకతవకలు జరిగినట్టు వెలుగులోకి వచ్చింది.. ప్రభుత్వం దీన్ని తీవ్రంగా పరిగణిస్తోందని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఆదివారం పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో ఎన్‌టీఏ అధికారులు.. వారు ఎంత ఉన్నతస్థాయిలో ఉన్నవారైనా గానీ.. దోషులుగా తేలితే వారిని వదిలిపెట్టబోమని, వారు కఠిన శిక్షను అనుభవించాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ చాలా మెరుగుపడాల్సిన అవసరం ఉందని మంత్రి అభిప్రాయపడ్డారు. మరోవైపు.. నీట్ పరీక్ష నిర్వహణలో జరిగిన అవకతవకలు, అక్రమాలు, పేపర్ లీక్‌పై ప్రధాని మోదీ మౌనంగా ఉండడం మంచిది కాదని కేంద్ర మాజీ మంత్రి కపిల్ సిబల్ అన్నారు. నీట్ అక్రమాలపై సుప్రీంకోర్టు నియమించిన నిపుణులతో దర్యాప్తు జరపాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై సీబీఐ దర్యాప్తు జరిపితే అధికార యంత్రాంగాన్ని ప్రభుత్వం కాపాడుతుందని.. కాబట్టి స్వతంత్ర సంస్థతో గానీ, సుప్రీంకోర్టు ఎంపిక చేసిన స్వతంత్ర అధికారులతో గానీ దర్యాప్తు జరిపించాలని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం (మోదీ సర్కారు) అన్నింటినీ కేంద్రీకృతం చేస్తోందని.. ఈ ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయమూ ఢిల్లీలోని అధికారుల ఇష్టాయిష్టాలకు అనుగుణంగా ఉంటోందని ధ్వజమెత్తారు. మనది 140 కోట్ల మంది జనాభా.. సంక్లిష్టమైన సామాజిక వ్యవస్థ ఉన్న దేశం కాబట్టి భవిష్యత్తులో వైద్యవిద్యలో ప్రవేశాలకు సంబంధించి కేంద్రం అన్ని రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదించి ఏకాభిప్రాయానికి రావాలని ఆయన సూచించారు. అలాగే, ఇది దేశ యువత భవిష్యత్తుపై ప్రభావం చూపే అంశం కాబట్టి, వచ్చే పార్లమెంటు సమావేశాల్లో ఈ అంశాన్ని బలంగా లేవనెత్తాలని అన్ని రాజకీయ పార్టీలకూ ఆయన సలహా ఇచ్చారు. అవకాశం లభిస్తే తానే ఈ అంశాన్ని పార్లమెంటులో ప్రస్తావిస్తానని.. పీటీఐ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో సిబల్ తెలిపారు. అయితే.. ఇది న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉందనే సాకుతో కేంద్రం ఈ సమస్యను పార్లమెంటులో ప్రస్తావించేందుకు అంగీకరించకపోవచ్చని సందేహం వ్యక్తం చేశారు. జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) దుర్వినియోగమైందని ఆందోళన వెలిబుచ్చిన ఆయన.. నీట్ పరీక్ష నిర్వహణకు సంబంధించి గుజరాత్‌లో జరిగిన కొన్ని సంఘటనలు తనను కలవరపాటుకు గురిచేశాయని పేర్కొన్నారు. ఈ వ్యవహారానికి సంబంధించి చాలా సీరియస్ ప్రశ్నలకు ఎన్‌టీఏ సమాధానం చెప్పితీరాలని స్పష్టం చేశారు. ఇలా పరీక్షల్లో అక్రమాలకు పాల్పడి వైద్యులైనవారితో చికిత్స చేయించుకోవడం పేషెంట్లకు చాలా ప్రమాదమని ఆందోళన వెలిబుచ్చారు. సుప్రీంకోర్టు ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణనలోకి తీసుకోవాలని అభిప్రాయపడ్డారు.

అన్నీ యూపీఏపైనే..

ప్రస్తుత (మోదీ) సర్కారు హయాంలో ఇలాంటి వ్యవహారాలు బయటపడినప్పుడల్లా.. మూఢభక్తులు ముందుకొచ్చి ఈ పాపాలన్నింటికీ యూపీఏనే కారణమంటూ ఆరోపించడం మొదలుపెడతారని.. ఇది తనను చాలా ఆశ్చర్యానికి, తీవ్ర నిరాశకు గురిచేస్తుందని వాపోయారు. నీట్‌ను 2010లో భారత వైద్య మండలి (ఎంసీఐ) బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ ప్రవేశపెట్టారని.. ఎంసీఐ కేంద్ర ఆరోగ్య శాఖ పరిధిలో ఉంటుంది తప్ప విద్యాశాఖ పరిధిలో కాదని ఆయన గుర్తుచేశారు. 2016 ఆగస్టు 4న బీజేపీ సర్కారు ఇండియన్ మెడికల్ కౌన్సిల్ చట్టంలో సెక్షన్ 10డిని చేర్చిందని.. అప్పటిదాకా అమల్లో ఉన్న ఇండియన్ మెడికల్ కౌన్సిల్ యాక్ట్ 1956 స్థానంలో 2019 ఆగస్టు 8న నేషనల్ మెడికల్ కౌన్సిల్ యాక్ట్‌ను తెచ్చిందని వివరించారు. ఆ చట్టంలోని సెక్షన్ 14లో నీట్ పరీక్ష ప్రస్తావన ఉందని తెలిపారు. కాబట్టి ఈ చట్టానికి, యూపీఏకి ఎలాంటి సంబంధమూ లేదని ఆయన స్పష్టం చేశారు. నీట్ నిర్వహణలో ఎలాంటి అక్రమాలూ జరగలేదంటూ కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్రప్రధాన్ పదేపదే చెబుతుండడంపై సిబల్ ధ్వజమెత్తారు. "ఒక్కసారి ఆయన్ను సోషల్ మీడియాలో చూడమనండి. గుజరాత్‌లోనే ఈ వ్యవహారం ఎలా జరుగుతోందో తెలుస్తుంది. దేశంలోని పురోగామి రాష్ట్రాల్లో గుజరాత్ ఒకటి. బహుశా అవినీతిలో కూడా ఆ రాష్ట్రం ప్రగతిశీలంగా ఉన్నట్టు కనిపిస్తోంది" అని ఎద్దేవా చేశారు. ఆ ఒక్క రాష్ట్రంలోనే కాక.. దేశవ్యాప్తంగా కూడా ఈ పరీక్ష నిర్వహణలో అవినీతి జరిగిందని సిబల్ ఆరోపించారు. "67 మందికి అత్యధిక మార్కులు వచ్చి.. వారిలో కొందరు ఒకే సెంటర్‌లో పరీక్ష రాసినవారని తెలితే విద్యా శాఖ మంత్రి దాని గురించి ఆందోళన చెందాలి తప్ప అసలేమీ జరగలేదని చెప్పకూడదు." అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పు జరిగినప్పుడు ఆ విషయాన్ని ఒప్పుకొనే మంత్రి ఒక్కరు కూడా ఈ ప్రభుత్వంలో లేరని దుయ్యబట్టారు.

పాఠాల్లో అయోధ్య మాయం

- అల్లర్ల వివరాలు తీసేసిన ఎన్‌సీఈఆర్‌టీ
- బాబ్రీ మసీదు పేరు స్థానంలో 3 గుమ్మటాలు
- 12వ తరగతి రాజనీతిశాస్త్రంలో మార్పులు

న్యూఢిల్లీ, జూన్ 16: గుజరాత్ మత అల్లర్లు, బాబ్రీ మసీదు కూల్చివేత వంటి అంశాలతో కూడిన పాఠాలను సవరించడాన్ని ఎన్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ దినేశ్ ప్రసాద్ సక్లానీ సమర్థించుకున్నారు. మత అల్లర్లు ఉన్న పాఠ్య భాగాలను బోధించడం హింసను ప్రేరేపించి, పౌరులను కుంగుబాటుకు గురిచేసే ప్రమాదం ఉంటుందని భావించి.. వాటిని తీసివేశామని వివరణ ఇచ్చారు. ఎన్‌సీఈఆర్‌టీని (నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రిసెర్చ్ అండ్ ట్రైనింగ్) కాషాయ సంస్థగా మార్చివేశారన్న ఆరోపణను దినేశ్ ప్రసాద్ తిరస్కరించారు. తాజాగా మార్కెట్‌లోకి వచ్చిన 12వ తరగతి రాజనీతి శాస్త్రంలో చాలా మార్పులు కనిపిస్తున్నాయి. బాబ్రీ మసీదు అని రాయాల్సి వచ్చిన చోట మూడు గుమ్మటాల కట్టడం అని పేర్కొన్నారు. 1528లో మీర్ బాబరు బాబ్రీ మసీదును నిర్మించారు అని పూర్వ పాఠంలో ఉండగా, శ్రీరాముని జన్మభూమిలో 1528లో ఇది నిర్మాణమైందంటూ సవరించారు. అయోధ్య గురించి గతంలో నాలుగు పేజీలు ఉన్న పాఠాన్ని రెండు పేజీలకు కుదించారు. హిందువుల పూజల కోసం మసీదు తలుపులు తెరవాలని 1986లో ఫైజాబాద్ జిల్లా కోర్టు ఇచ్చిన ఆదేశాలు మత హింసకు దారితీశాయని పూర్వ పాఠంలో ఉండగా, దాన్నంతా దాదాపుగా తొలగించారు. ఆలయ నిర్మాణానికి అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు పూర్తి పాఠాన్ని కొత్తగా చేర్చారు. ఇలా కత్తిరింపులు, కుదింపులు చేసి సవరించిన 12వ తరగతి రాజకీయ శాస్త్ర పాఠ్య పుస్తకం మార్కెట్‌లోకి రాగానే గగ్గోలు రేగింది. ఈ నేపథ్యంలో దినేశ్ ప్రసాద్ జాతీయ వార్తా సంస్థ పీటీఐ సంపాదకులతో మాట్లాడుతూ దీనిపై వివరణ ఇచ్చారు. "ఏడాదికోసారి పాఠ్య పుస్తకాలను సవరిస్తూ ఉంటాం. ఇది సాధారణ ప్రక్రియలో భాగం. దీని గురించి గగ్గోలు పడాల్సిన అవసరం లేదు. గుజరాత్ అల్లర్లు, బాబ్రీ మసీదు ధ్వంసం వంటి అంశాలు తొలగింపు సరైనదే. మత అల్లర్లు వంటి వాటి గురించి పెరిగి పెద్దయ్యాక పిల్లలు ఎలాగో తెలుసుకొంటారు. వాటి గురించి ఇప్పటినుంచే తరగతి గదిలో బోధించడం ఎందుకు?" అని ఆయన అన్నారు.

ఈవీఎంలు వాడొద్దు..

వాటిని హ్యాకింగ్ చేయడానికి అవకాశం ఉంది

- టెస్లా సీఈవో ఎలాన్ మస్క్ ట్వీట్
- ఇక్కడ ఈవీఎంలు పూర్తి సురక్షితమైనవి
- కేంద్ర మాజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్



న్యూఢిల్లీ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి ఈవీఎంల భద్రతపై చర్చ సాగుతోంది. ఎన్నికల ఫలితాల అనంతరం అది తారస్థాయికి చేరింది. ఈ నేపథ్యంలో ప్రపంచ కుబేరుడు, టెస్లా సీఈవో ఎలాన్ మస్క్ చేసిన ఆరోపణలతో ఈవీఎంల అంశం దేశవ్యాప్తంగా మరోసారి దుమారం రేగుతోంది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను కొంతమేరకు హ్యాక్ చేసే అవకాశాలున్నాయని, అందుకే వాటిని వాడకుండా పక్కన పెట్టాలని ఎక్స్ వేదికగా మస్క్ పోస్టు చేశారు. ప్యూర్టోరికో ఎన్నికల్లో అవకతవకలపై అమెరికా మాజీ అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెన్నడీ మేనల్లుడు రాబర్ట్ ఎఫ్ కెన్నడీ జూనియర్ ఇటీవల చేసిన పోస్టుకు మస్క్ స్పందించారు. 'ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను తొలగించాలి. మనుషులు లేదా ఏఐ ద్వారా వాటిని హ్యాకింగ్ చేసే ప్రమాదం ఉంది. ఇది చాలా తక్కువ స్థాయిలోనే ఉన్నప్పటికీ దీని పర్యవసానాలు మాత్రం భారీగా ఉంటాయి' అని మస్క్ ట్వీట్ చేశారు. ఈ వ్యాఖ్యలపై బీజేపీ నేత, కేంద్ర మాజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ ఘాటుగా స్పందించారు. 'మస్క్ వ్యాఖ్యలు అన్నింటినీ సాధారణీకరిస్తున్నట్లుగా ఉన్నాయి. ఇంటర్నెట్ కనెక్టెడ్ యంత్రాలను నిర్మించడానికి సాధారణ కంప్యూటర్ ప్లాట్‌ఫాంలు ఉపయోగించే అమెరికా, ఇతర దేశాలకు అయన చెప్పిన అంశాలను అన్వయించుకోవచ్చేమో గానీ భారతీయ ఈవీఎంలు పూర్తిగా సురక్షితమైనవి. ఏ నెట్‌వర్క్ లేదా మీడియాతో కనెక్ట్ కాని విధంగా వాటిని డిజైన్ చేశారు. వీటికి బ్లూటూత్, ఇంటర్నెట్, వైఫైతో ఎలాంటి కనెక్టివిటీకి అవకాశమే లేదు. పేపర్ బ్యాలెట్లతో పోలిస్తే ఇవి విశ్వసనీయమైన ఓటింగ్ పద్ధతిగా కొనసాగుతున్నాయి" అని రాజీవ్ స్పష్టం చేశారు. దీనిపై మస్క్ స్పందిస్తూ.. 'దేన్నయినా హ్యాక్ చేయవచ్చు' అంటూ మరో ట్వీట్ చేశారు.

బ్లాక్ బాక్సులుగా ఈవీఎంలు: రాహుల్

ఈవీఎంల భద్రతపై మస్క్ చేసిన ట్వీట్‌ను విపక్ష పార్టీ నేతలు విస్తృతంగా షేర్ చేస్తున్నారు. ఈ విషయంలో కేంద్ర ఎన్నికల సంఘం మౌనం వహించడంపై నిలదీస్తున్నారు. మస్క్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆదివారం స్పందించారు. భారత్‌లో ఈవీఎంలు బ్లాక్‌బాక్సులుగా మారాయని, వాటిని పరిశీలించేందుకు ఎవరినీ అనుమతించడం లేదని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. దేశంలో ఎన్నికల ప్రక్రియ పారదర్శకతపై అనేక ఆందోళనలు వ్యక్తమవుతున్నాయని, వ్యవస్థల్లో జవాబుదారీతనం లోపించినప్పుడు ప్రజాస్వామ్యం ఓ బూటకంగానే మిగిలిపోతుందని రాహుల్ పేర్కొన్నారు. మస్క్ పోస్టుతో పాటు ముంబై నార్త్ వెస్ట్ లోక్‌సభ స్థానంలో గెలిచిన రవీంద్ర వైకర్ బంధువులు ఈవీఎంలకు కనెక్ట్ చేసిన ఫోన్‌ను ఉపయోగిస్తున్నారంటూ వచ్చిన వార్తా కథనాన్ని ఆయన పంచుకున్నారు. మరోవైపు సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ సైతం మస్క్ పోస్టును షేర్ చేశారు. 'సాంకేతికత అనేది సమస్యలను తొలగించడానికి ఉపయోగపడాలి. అంతేకానీ అదే సమస్యలకు కారణమైతే... దాని వాడకాన్ని వెంటనే ఆపేయాలి' అని ఆయన పేర్కొన్నారు.

ఈవీఎం హ్యాక్ చేశారు!

- మొబైల్ ఫోన్, ఓటీపీతో అన్‌లాక్


ముంబై, జూన్ 16: ఈవీఎంల భద్రతపై అనుమానాలు వ్యక్తమవుతున్న వేళ మరో సంచలన వార్త వెలుగు చూసింది. ఈవీఎంలకు అనుసంధానించిన మొబైల్ ఫోన్‌ను ఉపయోగించారనే ఆరోపణలపై ముంబై నార్త్ వెస్ట్ లోక్‌సభ స్థానం నుంచి తాజాగా ఎన్నికైన ఎంపీ రవీంద్ర వైకర్, ఆయన బంధువులపై కేసు నమోదైంది. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో శివసేనకు చెందిన రెండు వర్గాలు ఈ స్థానం నుంచి పోటీ చేయగా ఏక్‌నాథ్ షిండే వర్గానికి చెందిన రవీంద్ర 48 ఓట్ల స్వల్ప తేడాతో గెలిచారు. ఇప్పుడు ఆయన గెలుపుపై వివాదం నెలకొంది. జూన్ 4న ఇక్కడి నెస్కో పోలింగ్ కౌంటింగ్ కేంద్రంలోని ఈవీఎంను అన్‌లాక్ చేయడానికి రవీంద్ర బావమరిది మంగేశ్ పాండిల్కర్ మొబైల్ ఫోన్‌ను ఉపయోగించారని ఆరోపణలు వచ్చాయి. ఆ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీకి పంపించారు. మంగేశ్‌పై కేసు నమోదు చేశారు.

అవకతవకలకు ఆస్కారం లేదు: ఆర్వో

ఈవీఎంలలో ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేదని, కట్టుదిట్టమైన రక్షణతో కూడిన స్వతంత్ర వ్యవస్థ వాటిలో ఉందని ముంబై ఎన్నికల అధికారులు ఆదివారం స్పష్టం చేశారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు సందర్భంగా ఈవీఎంకు అనుసంధానమైన మొబైల్ ఫోన్‌ను ఉపయోగించి రవీంద్ర వాకర్ 48ఓట్ల స్వల్ప మెజారిటీతో గెలుపొందారంటూ కథనాలు రావడంపై ముంబై నార్త్ వెస్ట్ లోక్‌సభ స్థానం రిటర్నింగ్ అధికారి వందన సూర్యవంశీ స్పందించారు. 'ఈవీఎం ఒక స్టాండ్ అలోన్ వ్యవస్థ. దాన్ని అన్‌లాక్ చేయడానికి ఓటీపీ అవసరం లేదు. ఇది ప్రోగ్రామింగ్ చేసిన యంత్రం కాదు. అలాగే ఇది ఎలాంటి వైర్‌లెస్ కమ్యూనికేషన్ సామర్థ్యాలను కలిగి ఉండదు. తప్పుడు వార్తలు ప్రచారం చేసిన పత్రికకు నోటీసులు జారీ చేశాం' అని సూర్యవంశీ మీడియాకు వెల్లడించారు.

ఉగ్రవాదులను అణచివేయండి

- పక్కా ప్రణాళికతో ముందుకెళ్లండి
- భద్రతా బలగాలకు అమిత్ షా ఆదేశం
- జమ్మూకశ్మీర్‌లో భద్రతా పరిస్థితులపై సమీక్ష జరిపిన కేంద్ర హోం మంత్రి



న్యూఢిల్లీ, జూన్ 16: ఉగ్రవాదులపై ఉక్కుపాదం మోపాలని, జమ్మూ ప్రాంతంలో పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా భద్రతా బలగాలను ఆదేశించారు. ఉగ్రవాద ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో పట్టు సాధించే విధానం ద్వారా కశ్మీర్ లోయలో ఉగ్రవాదులను విజయవంతంగా అణచివేశారని.. అదే పద్ధతిని జమ్మూలోనూ అమలు చేయాలని సూచించారు. నవీన పద్ధతులను అనుసరించి ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపేందుకు నరేంద్ర మోదీ సర్కారు చిత్తశుద్ధితో పనిచేస్తుందని చెప్పారు. జమ్మూకశ్మీర్‌లో భద్రతా పరిస్థితులపై ఆదివారం అమిత్ షా ఢిల్లీలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో ఈ మేరకు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోబాల్, జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, సైన్యాధిపతి జనరల్ మనోజ్ పాండే తదితరులు పాల్గొన్నారు. కశ్మీరులో అవలంబించిన స్థానికంగా పైచేయి సాధించడం, జీరో టెర్రర్ ప్లాన్‌లను జమ్మూలోనూ అనుసరించాలని అమిత్ షా భద్రతా సంస్థలను ఆదేశించారు. అలాగే ఈ నెల 29 నుంచి ప్రారంభం కానున్న అమర్‌నాథ్ యాత్ర ఏర్పాట్లపైనా సమీక్షించారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదుల అణచివేతకు ముమ్మర కార్యాచరణ సిద్ధం చేసినట్లు అధికారులు అమిత్ షాకు వివరించారు. కాగా, ఉగ్రవాదులకు మద్దతు తెలిపేవారి ఆస్తులను స్వాధీనం చేసుకోవాలని కేంద్రం నిర్ణయించినట్లు సమాచారం. అలాగే వారిపై పలు తీవ్రమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేయనున్నట్లు తెలిసింది. ఉగ్రవాదుల మద్దతుదారుల కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వరాదనే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. కాగా, ఈ నెల 21న ప్రధాని మోదీ జమ్మూకశ్మీర్‌లో పర్యటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

దర్శన్.. పవిత్రను పెళ్లి చేసుకోలేదు

- కన్నడ నటుడి లాయర్ స్పష్టీకరణ

బెంగళూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కన్నడ నటుడు దర్శన్, నటి పవిత్రగౌడ్‌ను పెళ్లి చేసుకోలేదని దర్శన్ న్యాయవాది అనీల్‌బాబు స్పష్టం చేశారు. చిత్రదుర్గకు చెందిన రేణుకాస్వామి హత్యకేసును దర్యాప్తు చేస్తున్న సీనియర్ అధికారులు పవిత్రను దర్శన్ రెండో భార్యగా పేర్కొంటున్న నేపథ్యంలో లాయర్ ఈ మేరకు వివరణ ఇచ్చారు. వారిద్దరు తోటి నటులు, స్నేహితులు మాత్రమేనన్నారు. వారు పెళ్లి చేసుకున్నట్టు నిరూపించే పత్రాలేమీ లేవని వివరించారు. పవిత్రను దర్శన్ భార్యగా మీడియాలో కొందరు చూపిస్తుండటం వల్ల దర్శన్ భార్య విజయలక్ష్మి చాలా బాధపడుతున్నారని, అవమానంతో ఆమె బయటికి కూడా రాలేకపోతున్నారని లాయర్ వాపోయారు. రేణుకాస్వామి హత్యకేసులో తాజాగా పవిత్రగౌడ మేనేజర్ దేవరాజ్‌ను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. రేణుకాస్వామిని హత్య చేసిన కారుషెడ్‌కు పవిత్రతోపాటు దేవరాజ్ కూడా వెళ్లినట్టు పోలీసులు గుర్తించారు. పోలీసులు శనివారం రాత్రి దర్శన్, పవిత్రగౌడల నివాసాలకు వెళ్లి పంచనామా చేశారు. రేణుకాస్వామిని పవిత్రగౌడ చెప్పుతో కొట్టినట్టు నిర్ధారించుకుని ఆ చెప్పులను కూడా స్వాధీనం చేసుకున్నారు.

టీడీపీ ఏపీ సారథిగా పల్లా శ్రీనివాసరావు



అమరావతి/విశాఖపట్నం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు యాదవ్ నియమితులయ్యారు. ఈ విషయాన్ని టీడీపీ అధినేత చంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ విశాఖ పార్లమెంటు అధ్యక్షుడిగా సమర్థంగా పనిచేసిన పల్లా తన నూతన బాధ్యతలను విజయవంతంగా నిర్వహిస్తారని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఇప్పటి వరకు టీడీపీని నడిపించడంలో అద్భుత పనితీరు కనబరిచిన పార్టీ సీనియర్ నేత కింజరాపు అచ్చెన్నాయుడిని ఆయన అభినందించారు. ప్రతిపక్షంలో అనేక సమస్యలు, సవాళ్లను ఎదుర్కొని పార్టీ బలోపేతానికి ఎనలేని కృషి చేశారని తెలిపారు. కాగా, పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవిని కట్టబెట్టిన చంద్రబాబుకు పల్లా ధన్యవాదాలు తెలియజేశారు. తనపై గురుతర బాధ్యతను ఉంచిన అధినేత నమ్మకాన్ని నిలబెడతానని.. ఆయన ఆశీస్సులతో పదవిని సమర్థంగా నిర్వహించి అందరి మన్ననలు పొందుతానని అన్నారు.

ఏపీ శాసనసభ స్పీకర్‌గా అయ్యన్నపాత్రుడు

అమరావతి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్‌గా టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే, బీసీ నాయకుడు చింతకాయల అయ్యన్నపాత్రుడిని ముఖ్యమంత్రి చంద్రబాబు ఖరారుచేసినట్లు టీడీపీ వర్గాలు తెలిపాయి. అనకాపల్లి జిల్లా నర్సీపట్నం నియోజకవర్గం నుంచి 24,676 ఓట్ల మెజారిటీతో విజయం సాధించిన ఆయన అసెంబ్లీలో అడుగు పెట్టడం ఇది ఏడోసారి. ఇటీవలి మంత్రివర్గ ఏర్పాటులోనే ఆయనకు బెర్తు లభించడం ఖాయమని ఆ పార్టీ వర్గాలు భావించాయి. కానీ సామాజిక సమీకరణల దృష్ట్యా అవకాశం దక్కలేదు. దరిమిలా స్పీకర్ పదవి ఇవ్వాలని నిర్ణయించారు. స్పీకర్ పదవిని కోరుతూ ఒకరిద్దరు సీనియర్లు ముఖ్యమంత్రిని కలిసి మాట్లాడగా.. అయ్యన్నను ఎంపిక చేస్తున్నట్లు ఆయన వారికి తెలిపారు.

పిన్నెల్లి సోదరులపై రౌడీషీట్

- మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డిపై 14 కేసులు
- సోదరుడు వెంకట్రామిరెడ్డిపై తొమ్మిది కేసులు నమోదు

మాచర్లటౌన్, జూన్ 16: పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నాయకుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిలపై పోలీసులు రౌడీ షీట్ తెరిచారు. ఇద్దరిపైనా విడివిడిగా రౌడీషీట్లు తెరిచినట్టు గురజాల డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. ఇక నుంచి వారిపై నిరంతరం నిఘా ఉంటుందని, వివాదాస్పద ఘటనలు చోటు చేసుకున్నప్పుడు అందరిలానే విచారణ సాగిస్తామన్నారు. కీలక సమయాల్లో అజమాయిషీ ఉంటుందని వివరించారు. తరచుగా వారి కదలికలను కూడా పోలీసులు గమనిస్తారని తెలిపారు. రామకృష్ణారెడ్డిపై హత్యాయత్నం సహా 14 కేసులు నమోదయ్యాయని, అదేవిధంగా ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డిపై కూడా హత్యాహ్నం సహా 9 కేసులు నమోదైనట్టు వివరించారు. నేర ప్రవృత్తి రీత్యా ఇద్దరిపైనా రౌడీషీట్లు నమోదు చేసినట్టు డీఎస్పీ పేర్కొన్నారు.

త్వరలోనే రాజధాని నిర్మాణం: నారాయణ

అమరావతి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నిర్మాణ పనులను త్వరలోనే చేపడతామని పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. పాత మాస్టర్ ప్లాన్ ప్రకారమే రాజధాని నిర్మాణం చేస్తామని స్పష్టం చేశారు. మరో 15 రోజుల్లో అధ్యయనం చేసి ఏయే పనులు ఎప్పటిలోగా పూర్తి చేస్తామో కాలపరిమితి నిర్దేశిస్తామని తెలిపారు. సచివాలయంలో ఆదివారం బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజధాని రైతులకు కచ్చితంగా న్యాయం చేస్తామని తెలిపారు. కాగా, మంత్రి పేషీలో పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి అంతా తానై హల్‌చల్ చేశారు. మంత్రి నారాయణ సతీమణి వద్ద ఎక్కువ సేపు ఉండి ఆమెతో కలుపుగోలుగా మాట్లాడే ప్రయత్నాలు చేయడం చర్చనీయాంశంగా మారింది.

జగన్ ఇంటి వద్ద అక్రమ నిర్మాణాల కూల్చివేత.. జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్‌పై బదిలీ వేటు

- జీఏడీలో రిపోర్ట్ చేయాలని కమిషనర్ ఉత్తర్వులు
- సమాచారం ఇవ్వకుండా మంత్రి ఆదేశాలతో కూల్చివేత?

హైదరాబాద్ సిటీ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్‌లోని లోటస్‌పాండ్‌లో వైసీపీ అధినేత జగన్ ఇంటి వద్ద ఫుట్‌పాత్‌పై ఉన్న అక్రమ నిర్మాణాలను కూల్చివేసిన మర్నాడే జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్‌పై బదిలీ వేటు పడింది. లోటస్‌పాండ్‌లో జగన్ నివాసం వద్ద సెక్యూరిటీ సిబ్బంది కోసం ఫుట్‌పాత్‌పై అక్రమంగా నిర్మించిన గదులను శనివారం అధికారులు కూల్చివేశారు. స్థానికుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయంటూ జగన్ ఇంటికి సమీపంలో ఉండే ఓ మంత్రి ఆదేశించడంతోనే జీహెచ్ఎంసీ అధికారులు కూల్చివేతలు చేపట్టారని ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో ఆదివారం ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ హేమంత్ బోర్ఖడేపై బదిలీ వేటు పడింది. ఆయన్ను బల్దియా నుంచి రిలీవ్ చేస్తూ ఇన్‌చార్జి కమిషనర్ ఆమ్రపాలి ఉత్తర్వులు జారీ చేశారు. పాలనాపరమైన అంశాల వల్లే రిలీవ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. వెంటనే సాధారణ పరిపాలనా శాఖ (జీఏడీ)లో రిపోర్ట్ చేయాలని ఆయనకు సూచించారు. అక్రమ నిర్మాణాలను కూల్చిన మర్నాడే హేమంత్‌పై బదిలీ వేటు పడడం చర్చనీయాంశమైంది. కూల్చివేతల విషయాన్ని జోనల్, సర్కిల్ అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లలేదని తెలుస్తోంది. గ్రేటర్‌లో అక్రమ నిర్మాణాల కూల్చివేతలు సాధారణంగా జరుగుతుంటాయి. జోనల్, సర్కిల్ స్థాయిలో కమిషనర్లు, పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు సమన్వయంతో ఈ ప్రక్రియ చేపడుతుంటారు. 'సున్నిత అంశాలకు సంబంధించి ఉన్నతాధికారులకు సమాచారమిచ్చి వారి సూచన మేరకు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇక్కడ ఇలా జరగలేదు' అని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. కమిషనర్ ఆమ్రపాలి, చీఫ్ సిటీ ప్లానర్ రాజేంద్రప్రసాద్ నాయక్‌కు కూల్చివేతల విషయం తెలిదయని సమాచారం. జగన్ ఇంటి వద్ద ఆక్రమణల కూల్చివేత చర్చనీయాంశంగా మారడాన్ని సర్కారు తీవ్రంగా పరిగణించినట్లు తెలిసింది.

జగన్ కోట రహస్యం

500 కోట్లతో రుషికొండపై జగన్ విలాసం.. మూడేళ్లతర్వాత బాహ్య ప్రపంచానికి ఆ దృశ్యాలు

- మీడియాతో కలిసి ప్యాలెస్‌లోకి టీడీపీ నేత గంటా



విశాఖపట్నం, అమరావతి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉద్ధరణ పేరుతో విశాఖలో కాపురమంటూ సీఎంగా ఉండగా జగన్ ఆర్భాటం చేశారు. కానీ, ఇదేదో సాదాసీదా కాపురం కాదు... రూ.500 కోట్లతో రుషికొండపై కట్టుకున్న ప్యాలెస్‌లో పెట్టాలనుకున్న అత్యంత ఖరీదైన కాపురం. ఫైవ్‌స్టార్ హోటల్, సీఎం క్యాంప్ ఆఫీస్, టూరిజం ప్రాజెక్ట్, ఫేజ్ 1, 2 అంటూ కాకమ్మ కథలు చెప్పారు. కానీ, చివరకు రాజ భవనాన్నే కట్టేసుకున్నారు. ప్రజలకు, పెత్తందారులకు మధ్య యుద్ధం అంటూ ఊదరగొట్టిన జగన్, ఆ ప్రజల సొమ్ముతో జల్సా మహల్‌ను ఏర్పాటుచేసుకున్నారు. పైగా ఆ ఛాయలకు కూడా ప్రజలను కానీయలేదు. కేసులు పెట్టించి జైల్లో వేయించారు. ఎన్నికల్లో జగన్ ఓడిపోవడంతో ఇప్పుడు ఈ విలాసవంతమైన భవనాలు ప్రభుత్వానికి మిగిలాయి. ఈ భవనంలో వాడిన టైల్స్ ఒక్కో చదరపు అడుగు ధర రూ.26,000గా చెప్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం మీడియా ప్రతినిధులు, స్థానిక నాయకులతో కలిసి మాజీ మంత్రి, భీమిలీ టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు.. విశాఖ రుషికొండపై నిర్మాణాలు పూర్తి చేసుకున్న 'జగన్' ప్యాలెస్ లోపల అడుగుపెట్టారు. అక్కడి విలాసం చూసి ఆయన, మీడియాలో ప్యాలెస్ హంగులు చూసి జనమూ అవాక్కయ్యారు. అనంతరం ప్యాలెస్‌లోని రెండో బ్లాక్‌లో గంటా మిగతా నేతలతో కలిసి మీడియాతో మాట్లాడారు. "ప్రజాస్వామ్యంలో ఈ తరహా నిర్మాణాలు ఎక్కడా చూడలేదు. రూ.91 కోట్లతో ఫైవ్ స్టార్ హోటల్ నిర్మిస్తామని చెప్పి.. ఏకంగా రాజ భవనాన్నే నిర్మించుకున్నారు. అప్పట్లో ప్రభుత్వం చెప్పినట్టు.. పర్యావరణ రిసార్ట్స్‌కు సంబంధించిన ఛాయ



రుషికొండ ప్యాలెస్‌లో టీడీపీ నేత గంటా

లేవీ కనిపించడం లేదు. పర్యాటకుల కోసం దీనిని కడితే రాత్రికి వారు బస చేయడానికి గదులు ఉండాలి. అవి ఒక్కొక్కటి 300 నుంచి 500 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉండాలి. ఆ సైజులో ఇక్కడి ప్యాలెస్‌లోని ఒక్క రూమ్ కూడా లేదు. బాత్రూమ్ కూడా బెడ్ రూమ్ సైజులో ఉంది. ఫైవ్‌స్టార్ హోటల్‌ను మించిపోయే వసతులు ఉన్నాయి. రూ.500 కోట్లతో సాగించిన ఈ ప్యాలెస్‌లో ఒక్కో హాల్, మార్బుల్, ఫర్నిచర్ ఇరాక్ మాజీ అధ్యక్షుడు సద్దాం హుస్సేన్, కర్ణాటకకు చెందిన గనుల వ్యాపారి గాలి జనార్దన్‌రెడ్డి వంటి వారు నిర్మించిన భవనాలను తలదన్నేలా ఉన్నాయి. ఎంతో మోజుపడి కట్టించుకున్న భవనంలోకి అడుగుపెట్టకుండానే జగన్ అధికారం నుంచి దిగిపోవాల్సి వచ్చింది. ఈ నిర్మాణాన్ని ఏం చేయాలన్న దానిపై సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకుంటారు. త్వరలో ముఖ్యమంత్రి ఈ భవనాన్ని పరిశీలిస్తారు" అని గంటా శ్రీనివాసరావు అన్నారు.

నాడు పర్యాటకశాఖ మంత్రి అవాస్తవాలు

ఈ ఏడాది ఫిబ్రవరిలో నాటి పర్యాటక శాఖ మంత్రి రోజా రుషికొండపై భవనాన్ని ప్రారంభించి, అనేక అవాస్తవాలు మాట్లాడారు. ఇది పర్యాటకుల కోసమే నిర్మించామని అబద్ధం ఆడేశారు. సీఎం జగన్ అంగీకరిస్తే క్యాంపు కార్యాలయంగా ఇచ్చేస్తామని సెలవిచ్చారు. అందువల్లే త్రిసభ్య కమిటీ చెప్పిందని వంకలు చూపించి అందులో ప్రవేశించాలని ప్రయత్నించారు. అయితే దేవుడి స్క్రిప్ట్ వేరేలా ఉండడంతో ఆయన అందులో కాలు పెట్టకుండా చేశాడంటూ విశాఖ ప్రజలు చలోక్తులు విసురుతున్నారు.

ప్యాలెస్‌లో ఖరీదైన మార్బుల్ పరిచిన కారిడార్

ఖరీదెంతో చెబితే చెల్లిస్తాం!

- జగన్ క్యాంపు ఆఫీసు సోకులపై వైసీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి స్పందన

జగన్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫర్నిచర్, ఇతర వివరాలు అందిస్తే వాటి ఖరీదు చెల్లించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు వైసీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి తెలియజేశారు. ముఖ్యమంత్రి హోదాలో జగన్ తన క్యాంపు కార్యాలయానికి భారీగా ప్రభుత్వ ఖర్చుతో సోకులు చేయించడం.. సొంత భవనానికి ఈ స్థాయిలో ప్రభుత్వ నిధుల దుర్వినియోగంపై ప్రజల్లో చెలరేగిన విమర్శలపై ఆయన పార్టీ తరఫున ఆదివారం ఓ ప్రకటనలో స్పందించారు.


జల్సా మహల్ ఇదిగో



రుషికొండపై జనం సొమ్ముతో జగన్ కట్టుకున్న జల్సా మహల్ గుట్టును 'ఆంధ్రజ్యోతి' ఇప్పటికే బయటపెట్టింది. పర్యావరణానికి గండి కొట్టి, నిబంధనలకు మస్కా కొట్టి, కోర్టును ఏమార్చి, నిర్మాణం సాగిస్తున్న సమయంలోనే ఈ ప్యాలెస్‌లోని హంగులను 'జనం సొమ్ముతో జల్సా ప్యాలెస్' పేరిట 13-10-2023 సంచికలో 'ఆంధ్రజ్యోతి' ప్రచురించింది. నిర్మాణం పూర్తయిన ఈ ప్యాలెస్‌లోకి ఆదివారం అడుగుపెట్టినవారు విస్తుపోయేలా అత్యంత ఖరీదైన గృహ అలంకరణ వస్తువులు, తళుక్కుమనే ఫ్లోరింగ్, నిర్మాణాలు సర్వత్రా పరుచుకుని కనిపించాయి.

(విశాఖపట్నం, అమరావతి - ఆంధ్రజ్యోతి)





ఒక్కో ఫ్యాను రూ.3 లక్షలు

భవనమంతా సెంట్రలైజ్డ్ ఏసీ. కానీ, సీలింగ్ మొత్తం ఎక్కడ చూసినా ఫ్యాన్లే. ఏసీల పక్కన కూడా అద్భుతమైన ఫ్యాన్లు దర్శనమిస్తున్నాయి. ఒక్కో ఫ్యాన్ ధర తెలిస్తే కళ్లు బైర్లు కమ్ముతాయి. ఒక్కో ఫ్యాన్ ధరతో పేద కుటుంబం ఏడాదంతా బతుకుతుంది. తన జల్సా ప్యాలెస్ కోసం జగన్ రూ.3 లక్షలు పెట్టి ఒక్కో ఫ్యాను కొన్నారు. ఇలాంటి ఫ్యాన్లు మొత్తం పదుల సంఖ్యలో ఉన్నాయి.



బాత్‌టబ్ ధర రూ.26 లక్షలు

పేదలకు, పెత్తందారులకు మధ్య యుద్ధమంటూ యథేచ్ఛగా అబద్ధాలు చెప్పిన జగన్, తాను సీఎంగా ఉన్నప్పుడు తన కోసం పెట్టుకున్న బాత్‌టబ్ ఖరీదు ఎంతో తెలుసా ? జస్ట్ రూ.26 లక్షలు మాత్రమే. ఇంత విలాసం ఆయన సొంత డబ్బుతో కాదు, ప్రజలు కట్టిన పన్నులతోనే ఈసోకులన్నీ. పైగా ఒక్కో బాత్‌రూమ్ జగన్ కొందరు పేదలకు ఇచ్చిన సెంటు భూమి ఇళ్లకంటే రెండింతలు పెద్దదిగా ఉంది.

అంతా లక్షల్లోనే..

జగన్ వాడుకోవడానికి బిగించిన టాయ్‌లెట్ కమోడ్ ధర కేవలం రూ.13.5 లక్షలే. జగన్ ఆయన కుటుంబసభ్యులు మాత్రమే వాడుకునేందుకు వీలుగా ఇలాంటివి మూడు బిగించారు. ఒక్కో దాని ధర రూ.13.5 లక్షలు. కాగా, మిగతా బాత్‌రూముల్లో బిగించిన కమోడ్‌ల ధర ఒక్కోటి జస్ట్ రూ.6 లక్షలు అంతే.



ఇంటీరియర్స్‌కి రూ.19.5 కోట్లు

రాజసౌధంలో ఏ గోడకు ఏ చిత్రం అతికించాలి, ఏ మూలన ఏ కళాఖండం పెట్టాలనే ఇంటీరియర్స్‌ను ప్రత్యేకంగా డిజైన్ చేశారు. వీటికోసం 19.5 కోట్లు ఖర్చు చేశారు. ఇదంతా జనాల సొమ్మే. రాష్ట్రంలో ఎక్కడ ఏ పరిశ్రమ పెట్టాలని ఐదేళ్లలో ఒక్కసారి కూడా ఆలోచించని జగన్, తన రాజసౌధానికి మాత్రం ఏ హంగూ తగ్గకుండా చూసుకున్నారు. నీటిసరఫరా, కరెంటు, సీవరేజ్ సౌకర్యాల కోసం ఇప్పటివరకు చేసిన ఖర్చు రూ.28 కోట్లు. ఇదంతా ప్రభుత్వ ఖాతానే. పనిచేసింది కూడా ప్రభుత్వ ఉద్యోగులే. కూలీలకు కూడా ప్రభుత్వ ఖజానా నుంచే కూలీ చెల్లింపులు జరిగాయి.



ఒక్కో షాండ్లియర్ రూ.15 లక్షలు

రుషికొండ ప్యాలెస్‌లో ఎటుచూసినా ధగధగలే. వీటన్నింటిని తలదన్నేలా సీలింగ్ మిలామిలా మెరిసిపోతోంది. సీలింగ్ మొత్తం ఖరీదైన షాండ్లియర్లతో నిండిపోయింది. జగన్ నివాసం ఉండాలనుకున్న బ్లాక్‌లో మొత్తం 7షాండ్లియర్లు ఉన్నాయి. ఒక్కో దాని ధర రూ.15 లక్షలు. ఇంకా భవనం మొత్తం వాడిన లైట్ల ఖర్చు వేరే ఉంది.



గార్డెన్ కోసం రూ.22 కోట్లు

ఇంటికి ఏ వైపున ఏ చెట్లు ఉండాలి, ఎక్కడెక్కడ ఎంత ఖరీదైన లైట్లు పెట్టాలి, ఖరీదైన మొక్కలు నాటి గార్డెన్‌ను ఎలా విలాసవంతంగా తీర్చిదిద్దాలని ఆలోచించి చేసిన ఖర్చు ఏకంగా రూ.22 కోట్లు.

ట్రీట్‌మెంట్ ప్లాంటు..

నీటి సరఫరా కోసం వంద కిలోలీటర్ల డొమెస్టిక్ సంప్, మరో 150 కిలోలీటర్లతో ఫైర్ సంప్, వ్యర్థ జలాల శుద్ధికి 100 కేఎల్‌డీ సూయిజ్ ట్రీట్‌మెంట్ ప్లాంటు నిర్మించారు. విద్యుత్ సరఫరా కోసం కంటెయినర్ సబ్‌స్టేషన్, ప్రత్యేకంగా అండర్ గ్రౌండ్ కేబుల్ వ్యవస్థ, వెయ్యి కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు, 1010 కేవీఏ సామర్థ్యం కలిగిన మూడు జనరేటర్లు ఏర్పాటు చేశారు.

కుర్చీలు, బల్లల కోసం రూ.14 కోట్లు

జగన్ ప్రజల సొమ్ముతో నిర్మించుకున్న జల్సా ప్యాలెస్‌లో సోఫాలు, బల్లలు, కుర్చీలు, టేబుళ్లు.....అంటే ఫర్నిచర్ కోసం చేసిన ఖర్చు అక్షరాలా రూ.14 కోట్లు. ఎన్నికల్లో ఓడిపోయాక అక్కచెల్లెమ్మలకు, అవ్వాతాతలకు డబ్బులు పంచినా వారంతా ఓట్లేయలేదంటూ వాపోయిన జగన్....జనాల జేబుల్లో నుంచి లాక్కుని చేసిన ఈ జల్సా ఖర్చుల గురించి జనాలకు తెలియదనుకుంటున్నారేమో!



సుప్రీంకోర్టు న్యాయవాది సీఎస్ వైద్యనాథన్, ప్రభుత్వ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్ తదితరులతో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

కృష్ణా జలాల్లో సమాన వాటా సాధించాలి

» అందుకోసం రాజీ లేని పోరాటం చేయాలి: ఉత్తమ్

» సుప్రీం న్యాయవాది వైద్యనాథన్, అధికారులతో భేటీ

హైదరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జలాల్లో సమాన వాటాను సాధించాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులకు స్పష్టం చేశారు. ఇందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆదివారం జలసౌధలో ఆయన జలవనరుల విభాగం ప్రభుత్వ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్‌తో పాటు సుప్రీంకోర్టు న్యాయవాది సీఎస్ వైద్యనాథన్, సీనియర్ న్యాయవాది రవీందర్‌రావు, నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఇతర అధికారులతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో కృష్ణా బేసిన్, దాని వెంట నివసిస్తున్న జనాభా, కరువు, ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలు వంటి అంశాలను ప్రామాణికంగా చేసుకొని కృష్ణా జలాల్లో సగం వాటాను సాధించుకోవడానికి అవసరమైన పోరాటం చేయాలని సూచించారు. నీటి వాటాలను ట్రిబ్యునల్ తేల్చేదాకా గత పదేళ్లుగా అనుసరిస్తున్న తాత్కాలిక నీటి పంపకాలకు అంగీకరించబోమని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రానికి బచావత్ ట్రిబ్యునల్ 811 టీఎంసీలు కేటాయించిందని, అందులో 50 శాతం వాటాను కచ్చితంగా సాధించుకోవాలని చెప్పారు. నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టులను ఎట్టి పరిస్థితుల్లోనూ కృష్ణా బోర్డుకు అప్పగించరాదని అసెంబ్లీలో తీర్మానం చేశామన్నారు. తెలంగాణకు నదీ జలాల్లో సమాన వాటా దక్కించుకోవడానికి సుప్రీంకోర్టుతో పాటు ట్రిబ్యునల్‌లో రాజీలేని పోరాటం చేయాలని స్పష్టం చేశారు. బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ తీర్పు ప్రస్తుతం అమలు కావడం లేదని, దీనిపై సుప్రీంకోర్టులో కేసు ఉందని, మహారాష్ట్ర, కర్ణాటకలు పరస్పర అంగీకారంతో ఈ వివాదాన్ని పరిష్కరించుకునేలా చొరవ తీసుకోవాలని సుప్రీంకోర్టు న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ మంత్రిని కోరారు. అంగీకరించిన మంత్రి, అందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్‌జీవన్ పాటిల్, ఈఎన్‌సీ బి.నాగేంద్రరావు, అంతర్రాష్ట్ర జలవనరుల విభాగం సీఈ ఓరుగంటి మోహన్‌కుమార్, ఎస్ఈ విజయ్‌కుమార్, డీఈఈ వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నెక్కొండ, కోటిపల్లి మార్కెట్లకు కొత్త కమిటీలు

» రైతులకు సమస్యలు రాకుండా చూడాలి: మంత్రి తుమ్మల

హైదరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వరంగల్ జిల్లా నెక్కొండ, వికారాబాద్ జిల్లా కోటిపల్లి వ్యవసాయ మార్కెట్లకు ప్రభుత్వం కొత్త పాలకవర్గాలను నియమించింది. ఈ మేరకు ఛైర్మన్, సభ్యులుగా ఎన్నికైన వారికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం శుభాకాంక్షలు తెలిపారు. మార్కెట్లలో రైతులకు ఎలాంటి సమస్యలు రాకుండా చూసుకోవాలని నూతన పాలకవర్గాలకు సూచించారు.

వీసీల నియామకం.. మరింత ఆలస్యం

» ఇంకా సమావేశం కాని సెర్చ్ కమిటీలు

» కొత్త వీసీలు వచ్చేదాకా వారే కొనసాగింపు

హైదరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని యూనివర్సిటీలకు వైస్ ఛాన్సలర్లను నియమించే ప్రక్రియ మరింత ఆలస్యం కానుంది. ఈ నెల 15లోపు కొత్త వీసీలను నియమించాలని ప్రభుత్వం భావించినా.. అది ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తోంది. రాష్ట్రంలోని 10 యూనివర్సిటీల వీసీల పదవీకాలం మే 21తో ముగిసింది. వారి స్థానంలో ఇన్‌చార్జ్ వీసీలుగా ఐఏఎస్ అధికారులను నియమించారు. వీరి పదవీకాలాన్ని ఈ నెల 15 వరకు నిర్ణయించారు. ఈలోపు కొత్త వీసీలను నియమించాలని ప్రభుత్వం భావించినా.. అలా జరగలేదు. దాంతో ఇన్‌చార్జ్ వీసీల పదవీకాలాన్ని పొడిగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. కొత్త వీసీల నియామకం జరిగే వరకు ప్రస్తుతం ఉన్న ఇన్‌చార్జ్‌లు కొనసాగనున్నారు. యూనివర్సిటీలకు వైస్ ఛాన్సలర్ల నియామకం కోసం ప్రభుత్వం ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ పోస్టుల కోసం పలువురు ప్రొఫెసర్లు దరఖాస్తులు చేసుకున్నారు. ఈ క్రమంలో ఆయా యూనివర్సిటీల వారీగా సెర్చ్ కమిటీలను కూడా నియమించారు. అయితే, ఈ కమిటీల సమావేశం ఇంకా జరగలేదు. వీసీల నియామకానికి నోటిఫికేషన్ జారీ అయిన తర్వాత రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో వీసీల నియామకంలో కొంత జాప్యం జరిగింది. ఎన్నికలు ముగిసిన తర్వాత ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులు భావించినా.. అది కుదరలేదు. త్వరలోనే సెర్చ్ కమిటీల భేటీలను నిర్వహించే అవకాశం ఉంది. ఈ కమిటీలు సూచించే పేర్లతో కూడిన ప్రతిపాదనలను అధికారులు ప్రభుత్వానికి పంపించనున్నారు. దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న తర్వాత ఆ నివేదికను గవర్నర్‌కు పంపిస్తారు. గవర్నర్ ఆమోదంతో నియామకం పూర్తవుతుంది.

భారత్-శ్రీలంక మధ్య వారధి!

» నిర్మాణం సాధ్యాసాధ్యాల అధ్యయనం తుది దశకు

» శ్రీలంక అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘె వెల్లడి

» ఈ వారంలో ఆ దేశానికి వెళ్లనున్న జైశంకర్?

కొలంబో, జూన్ 16: భారత్-శ్రీలంక మధ్య ప్రతిపాదిత వారధి నిర్మాణంపై ఆ దేశ అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘె కీలక ప్రకటన చేశారు. ఇరు దేశాల మధ్య భూ అనుసంధానానికి సంబంధించి సాధ్యాసాధ్యాల అధ్యయనం ప్రాథమిక దశ పూర్తయిందని.. తుది దశ త్వరలోనే పూర్తవుతుందని తెలిపారు. కృతయుగంలో సీత కోసం లంకకు బయల్దేరిన రాముడు తమిళనాడులోని ధనుష్కోటి నుంచి శ్రీలంకకు వారధి నిర్మాణాన్ని ప్రారంభించాలని హనుమంతుడిని ఆదేశించినట్టు రామాయణం చెబుతోంది. అలా వానరసైన్యం నిర్మించిన రామసేతు గుండా నడిచి వెళ్లి.. తలైమన్నార్ ప్రాంతంలో రాముడు శ్రీలంకలో అడుగుపెట్టాడని ఐతిహ్యం. 2023 జూలైలో శ్రీలంక అధ్యక్షుడి భారత పర్యటన నేపథ్యంలో.. ఈ రెండు ప్రదేశాలనూ కలుపుతూ 23 కిలోమీటర్ల మేర.. మామూలు వాహనాలు, రైళ్లు సైతం ప్రయాణించేలా భారీ వంతెన నిర్మించాలని భారత పర్యటన తర్వాత మన ప్రభుత్వం తలపెట్టింది. దీనికి సంబంధించిన సాధ్యాసాధ్యాల అధ్యయనం నిర్వహించాలని ఈ ఏడాది జనవరిలో నిర్ణయించింది. అనంతరం ఇరుదేశాలూ కలిసి సంయుక్తంగా అధ్యయనాన్ని మొదలుపెట్టినట్టు శ్రీలంకలో భారత హైకమిషనర్ సంతోష్ ఝా ఏప్రిల్‌లో తెలిపారు. కాగా.. భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ జూన్ 20న కొలంబోకు రానున్నారని శ్రీలంక విదేశాంగ శాఖ శనివారం ప్రకటించింది. ఈ పర్యటన సందర్భంగా.. రెండు దేశాల మధ్య రోడ్డు మార్గంతోపాటు, పవర్ గ్రిడ్ అనుసంధానంపైనా ఆయనతో చర్చిస్తామని విక్రమసింఘె తెలిపారు. అయితే జైశంకర్ శ్రీలంక పర్యటనపై మన విదేశాంగ శాఖ అధికారిక ప్రకటన చేయలేదు.

30లోగా గనుల వేలం వేయండి

(మొదటి పేజీ తరువాయి)

సవరించారు. వీటి ప్రకారం గనులను నిర్దిష్ట గడువులోగా వేలం వేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైతే, ఆ బ్లాకులను విక్రయించే అధికారం కేంద్రానికి సంక్రమిస్తుంది. మైనింగ్ యాక్ట్ (వేలం విధానం) అమలులోకి వచ్చిన నాటి నుంచి దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 354 ప్రధానమైన ఖనిజ బ్లాకులను వేలం వేశారు. ఇందులో 48 మినరల్ బ్లాక్‌లలో ఉత్పత్తి ప్రారంభమైందని, ఈ వేలం ప్రక్రియతో రాష్ట్రాల ఆదాయం గణనీయంగా పెరిగిందని కేంద్ర వర్గాలు తెలిపాయి. అయితే ఈ బ్లాక్‌ల వేలానికి సంబంధించి కేంద్రం ప్రవేశపెట్టిన విధానాలు సరిగా లేవన్న ఉద్దేశంతోనే గత బీఆర్ఎస్ ప్రభుత్వం వేలం నిర్వహించలేదని తెలుస్తోంది. కాగా, తెలంగాణలో మేజర్, మైనర్ మినరల్ బ్లాకులను వేలం పద్ధతిలో తామే కేటాయించాలని కేంద్ర గనుల శాఖ భావిస్తున్నట్లు సమాచారం. ఈ మేరకే ఖనిజాల వారీగా ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపినట్లు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆమోదం రాగానే వేలం ప్రక్రియను ప్రారంభించాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ వేలంలో అర్హత సాధించిన వారికి ఆయా గనులను 30 ఏళ్ల పాటు లీజుకు ఇవ్వనున్నట్లు సమాచారం.

చిన్నారి హత్యాచారం కేసును..

ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారణ జరిపిస్తాం

» బాధిత కుటుంబానికి అండగా ఉంటాం: శ్రీధర్ బాబు

» పోలీసింగ్‌ను మెరుగుపరుచుకోవాలి: సీతక్క

సుల్తానాబాద్, జూన్ 16: తల్లిదండ్రుల మధ్య నిద్రిస్తున్న ఆరేళ్ల చిన్నారిని ఎత్తుకుపోయి అత్యాచారం చేసి చంపేయడం తీవ్రంగా కలచివేసిందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఈ కేసును ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారణ జరిపి, దారుణానికి పాల్పడిన వ్యక్తిని చట్టపరంగా శిక్షిస్తామని తెలిపారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి సమీపంలోని రైస్‌మిల్లుల ప్రాంతంలో రెండు రోజుల క్రితం జరిగిన చిన్నారి అత్యాచారం, హత్య కేసు వివరాలను తెలుసుకునేందుకు మంత్రులు శ్రీధర్ బాబు, సీతక్క ఆదివారం సుల్తానాబాద్‌కు వచ్చారు. కార్మిక దంపతులు నివసించే ప్రాంతాన్ని, చిన్నారిని ఎత్తుకుపోయి అఘాయిత్యానికి పాల్పడిన ప్రదేశాన్ని, విల్లులోని సీసీ కెమెరాలలో రికార్డు అయిన దృశ్యాలను మంత్రులు పరిశీలించారు. అనంతరం శ్రీధర్‌బాబు మాట్లాడారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. చిన్నారి తండ్రికి వారి స్వస్థలంలో ఉద్యోగంతో పాటు బాధిత దంపతుల చిన్న కూతురు బాధ్యతలను కూడా ప్రభుత్వం చూస్తుందన్నారు. రైస్ మిల్లు యజమాని రూ.5.5 లక్షలు ఇచ్చారని, ప్రభుత్వ పరంగా రూ.2.5 లక్షల పరిహారం ఇస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసు వ్యవస్థలను మరింత మెరుగుపరుచుకోవాల్సిన అవసరం ఉందని మంత్రి సీతక్క అన్నారు. పెట్రోలింగ్ వ్యవస్థను పెంచుకోవాలని.. డ్రగ్స్, గంజాయి వంటి మత్తుకు బానిసలైన వారిని గుర్తించాలని, వారికి ప్రత్యేకమైన కౌన్సెలింగ్‌లు ఇస్తూ నేరాలు జరగకుండా అరికట్టాలన్నారు. కాగా, బాలికపై హత్యాచారం చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీత రావు డిమాండ్ చేశారు.



రైస్ మిల్లులో పర్యటిస్తున్న మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క

ఫిట్‌లెస్ స్కూల్ బస్!

రాష్ట్రవ్యాప్తంగా 40 శాతానికి పైగా ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులే

» బస్సుల ఫిట్‌నెస్ టెస్టుకు ముందుకు రాని స్కూల్ యాజమాన్యాలు

» ప్రమాదం నీడన పిల్లల ప్రయాణం



హైదరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): బడులు మళ్లీ తెరుచుకున్నాయి. కొత్త విద్యాసంవత్సరం.. కొత్త తరగతి.. కొత్త పుస్తకాలు, బ్యాగు, యూనిఫాంతో పిల్లలు హుషారుగా వెళుతున్నారు! కానీ బడికి వెళ్లి వచ్చేందుకు వారు ఎక్కుతోంది ఫిట్‌నెస్ లేని బస్సుల్లో! వారి ప్రయాణం సాగుతోంది ప్రమాదపు టంచుల్లో! బడులు తెరుచుకొని నాలుగురోజులైనా రాష్ట్రవ్యాప్తంగా 40శాతానికి పైగా ఫిట్‌నెస్ లేని బస్సులు రోడ్ల మీద తిరుగుతున్నాయి. స్కూల్ బస్సుల తనిఖీల తీరు తూతూమంత్రంగా మారింది. వేసవి సెలవులు ముగిశాక స్కూల్ బస్సుల తనిఖీ పేరుతో అధికారులు హడావుడి చేసినా ఆ తర్వాత పట్టించుకోవడం లేదు. సరైన అనుమతి పత్రాలు లేకుండానే వేల సంఖ్యలో బస్సులు విద్యార్థులను చేరవేస్తున్నట్లు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. జూన్ 12న విద్యాసంవత్సరం మొదలైంది. అయితే స్కూల్ బస్సులను పూర్తి ఫిట్‌నెస్‌తో యాజమాన్యాలు సిద్ధం చేసుకునేందుకు మే15 గడువుగా విధించారు. అంటే.. ఆలోపు మరమ్మత్తులు పూర్తిచేసుకోవడం, అర్హత గల డ్రైవర్‌ను, సహాయకులను నియమించుకోవడం వంటివి చేసుకొని రవాణా శాఖ నుంచి 'ఫిట్‌నెస్ సర్టిఫికెట్' పొందాలి. చాలా యజమాన్యాలు ఇవేవీ చేయకుండానే బస్సులకు కేవలం రంగులద్ది కొత్తరూపు తెచ్చాయంతే! రవాణా శాఖ నిర్దేశించిన ప్రమాణాలకు ఎంతమాత్రం సరితూగని ఈ బస్సుల్లో చాలావాటిని తుక్కు(స్క్రాప్)గా పరిగణిస్తారు. అయితే ఈ బస్సుల్లోనే విద్యార్థుల రవాణా కోసం ఏడాదికి రూ.30వేల నుంచి రూ60వేల దాకా తల్లిదండ్రుల నుంచి వసూలు చేస్తున్నారు. రవాణా శాఖ నిర్దేశించి ప్రమాణాలకు విరుద్ధంగా ఉండటంతోనే బస్సుల ఫిట్‌నెస్ కోసం స్కూల్స్ యాజమాన్యాలు ముందుకు రావడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. యాజమాన్యాల నిర్లక్ష్యం, అధికారుల ఉదాసీనత కారణంగా విద్యార్థులు ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందో తెలియని 'ఫిట్‌నెస్ లేని బస్సుల్లో' బడులకు రాకపోకలు సాగిస్తుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.

14,220 బస్సులే 'ఫిట్'!

రవాణా శాఖ అధికారుల లెక్క ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల రవాణా కోసం ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు 23,850 బస్సులను వినియోగిస్తున్నాయి. వీటిలో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే 12,635కు పైగా స్కూల్ బస్సులున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు 14,220 బస్సులకే ఫిట్‌నెస్ పత్రాలు జారీఅయ్యాయి. మరో 9,630కి పైగా స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించాల్సి ఉంది. మరి.. ఫిట్‌నెస్‌తో కూడిన స్కూల్ బస్సుల కోసం రవాణా శాఖ ప్రమాణాలను నిర్దేశించింది విద్యార్థులు సులువుగా బస్సు ఎక్కేందుకు, దిగేందుకు సౌకర్యవంతంగా మెట్లు (ఫుట్‌స్టెప్స్) ఏర్పాటు చేయించాలి. పిల్లలు.. చేతులు, తల బయటపెట్టకుండా కిటికీలకు జాలీలు పెట్టాలి. బస్సుల్లో అగ్నిమాపక పరికరాలు, ఫస్ట్ ఎయిడ్ కిట్ బాక్స్ ఉండాలి. స్కూల్ బస్సులకు బీమా చేయించాలి. రవాణా శాఖకు పన్నులు చెల్లించి ఉండాలి. డ్రైవింగ్‌లో అనుభవం ఉన్న, 60 ఏళ్ల లోపు వ్యక్తులను డ్రైవర్‌గా, సహాయకుడిగా నియమించుకోవాలి. కాగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల్లో 1203 స్కూల్ బస్సులుండగా ఇప్పటి వరకు 740 బస్సులకు మాత్రమే ఫిట్‌నెస్ టెస్ట్ చేయించారు. అధికారుల తనిఖీల్లో 28 బస్సులు ప్రమాణాలకు అనుగుణంగా లేవని గుర్తించి నోటీసులు జారీ చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 787 స్కూల్ బస్సులుండగా 611 బస్సులకే ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తి చేశారు. ప్రమాణాలకు అనుగుణంగా లేని 15 బస్సులను గుర్తించి కేసులు నమోదు చేసి జప్తు చేశారు. ఖమ్మం జిల్లాలో 640 స్కూల్ బస్సులుండగా 380 బస్సులకు ఫిట్‌నెస్ పత్రాలు జారీ చేశారు. 45 బస్సులు కాలం చెల్లినవిగా గుర్తించి స్క్రాప్‌గా పరిగణిస్తున్నట్లు ప్రకటించారు.

ఇందుకే 'టెస్ట్' చేయించడం లేదు?

ఫిట్‌లెస్' బస్సుల్లో చాలామటుకు కాలం చెల్లినవే ఉన్నాయి. అర్హత, అనుభవం గల డ్రైవర్ నియమించుకోవాలి అంటే ఎక్కువ వేతనం ఇవ్వాల్సి ఉంటుంది. కాబట్టి.. డ్రైవర్ల నియామకంలో కొన్ని యాజమాన్యాలు 'డ్రైవింగ్ తెలిస్తే చాలు' అన్నట్టుగా వ్యవహరిస్తున్నాయి. ఇలాంటి యజమాన్యాలు ఫిట్‌నెస్ టెస్టుకు ఎందుకు ముందుకొస్తాయి? ఇలాంటి బస్సులపై అధికారులు జరిమానా వేసినా, ఆ తర్వాత పట్టించుకోకపోవడంతో దర్జాగా తిరుగుతున్నాయి.

మండలిలో 'ఆకర్ష్'!

(మొదటి పేజీ తరువాయి)

కాలంలో పలుమార్లు ఆ పార్టీకి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశారు. స్థానికంగా బీఆర్ఎస్ రాజకీయాలపై తీవ్ర అసంతృప్తితో ఉన్న ఆయన కాంగ్రెస్ నేతలతో సన్నిహితంగానూ వ్యవహరిస్తున్నారు. అలాగే సుఖేందర్‌రెడ్డి కుమారుడు అమిత్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరి.. లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ గెలుపునకు పనిచేశారు కూడా. ఈ నేపథ్యంలో సుఖేందర్‌రెడ్డిపై అవిశ్వాస తీర్మానం పెట్టి ఆయన్ను పదవి నుంచి దించేయాలన్న చర్చ ఇటీవల బీఆర్ఎస్ నేతల్లో జరిగింది. అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్‌లో నెగ్గడం ద్వారా అధికార కాంగ్రెస్‌ను ఇరకాటంలో పడేయవచ్చునన్న చర్చా చోటుచేసుకున్నట్లు చెబుతున్నారు. దీంతో అప్రమత్తమైన కాంగ్రెస్.. మండలిలో 'ఆపరేషన్ ఆకర్ష్'కు తెరలేపాలన్న ఆలోచనకు వచ్చినట్లు చెబుతున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీలను తమ పార్టీలో చేర్చుకున్నా దాన్ని ప్రశ్నించే పరిస్థితి బీఆర్ఎస్‌కు ఉండబోదని కాంగ్రెస్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన కొత్తల్లో శాసనసభలో బీఆర్ఎస్‌కు తిరుగులేని బలం ఉన్నా.. శాసనమండలిలో మాత్రం కాంగ్రెస్ సభ్యులదే పైచేయిగా ఉండేదని గుర్తు చేస్తున్నాయి. అప్పటి అధికార బీఆర్ఎస్.. మండలిలోని కాంగ్రెస్ ఎమ్మెల్సీల్లో మెజారిటీ సభ్యులను వారి పార్టీలో చేర్చుకున్న విషయాన్ని ప్రస్తావిస్తున్నాయి. ప్రస్తుతం బీఆర్ఎస్ ఎమ్మెల్సీలుగా కొనసాగుతున్న ఎంఎస్ ప్రభాకర్, భానుప్రసాద్ కూడా కాంగ్రెస్ నుంచి వెళ్లినవాళ్లేనంటున్నాయి. కాగా, 14 మందికి తగ్గకుండా బీఆర్ఎస్ ఎమ్మెల్సీలను కాంగ్రెస్‌లో చేర్చుకునేందుకు ఆ పార్టీ పెద్దలు ప్రయత్నాలు చేస్తున్నట్లు చెబుతున్నారు. ప్రస్తుతం సభలో బీఆర్ఎస్‌కు నామినేటెడ్ సభ్యులతో కలుపుకుని 26 మంది ఉన్నారు. కాంగ్రెస్‌కు ఆరుగురు ఉన్నారు. బీజేపీ, ఎంఐఎంలకు ఇద్దరు చొప్పున, టీచర్ ఎమ్మెల్సీలు ఇద్దరు ఉన్నారు. మరో రెండు సీట్లు ఖాళీగా ఉన్నాయి. బడ్జెట్ సమావేశాల సమయంలో ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిపై బీఆర్ఎస్ అవిశ్వాస తీర్మానం పెడితే ఆ పార్టీకి ఉన్న సంఖ్యాబలంతో తేలికగా నెగ్గుతుంది. సభలో బీఆర్ఎస్ ఆధిపత్యాన్ని గండి కొట్టాలంటే 'ఆపరేషన్ ఆకర్ష్'ను అమలు చేయడం తప్ప వేరే మార్గం లేదని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. బీఆర్ఎస్ నుంచి 14మంది ఎమ్మెల్సీలను చేర్చుకుంటే మండలిలో కాంగ్రెస్ సంఖ్యాబలం 20కి చేరుకుంటుందని, ఖాళీగా ఉన్న రెండు ఎమ్మెల్సీ పోస్టులూ భర్తీ చేస్తే మరింత మద్దతు పెరుగుతుందని అంటున్నాయి.

నీట్ వ్యవహారంపై ప్రధాని, కేంద్ర మంత్రులు స్పందించాలి

» విద్యార్థులకు నష్టం జరిగితే పోరాడతాం

» ఎంపీలు చొరవ తీసుకోవాలి: కేటీఆర్

హైదరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): నీట్ పరీక్ష వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, ఈ అంశంపై ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు తక్షణం స్పందించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వానికి ఆదివారం ఆయన బహిరంగ లేఖ రాశారు. లక్షల మంది విద్యార్థులు ఎన్ని ఫిర్యాదులు చేసినా కేంద్రం స్పందించలేదని, పలువురు ప్రముఖులు సుప్రీంకోర్టులో కేసు వేసినా వివరణ ఇవ్వలేదన్నారు. సుప్రీంకోర్టు జోక్యం చేసుకునేంత వరకు కేంద్రం ఈ అంశాన్ని పట్టించుకోకపోవడం అందరికీ ఆశ్చర్యం కలిగిస్తోందని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ప్రశ్నించిన తర్వాత కూడా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) చిత్రమైన సమాధానాలు చెప్పిందన్నారు. ఈ ఏడాది 1563 మందికి గ్రేస్ మార్కులు కలిపినట్లు చెబుతోందని, అసలు నీట్ లాంటి పరీక్షలకు గ్రేస్ మార్కులు కలిపే విధానమేలేదని, అయినప్పటికీ ఎందుకిలా చేశారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేవలం నీట్ మాత్రమే కాదు.. దేశంలో ఎన్నో పోటీ పరీక్షలు ఎన్టీఏ ఆధ్వర్యంలోనే నిర్వహించాల్సి ఉంటుందని, తాజా వివాదాస్పద అంశాల కారణంగా ఎన్టీఏపై విద్యార్థులు నమ్మకం కోల్పోయే పరిస్థితి వచ్చిందన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలుచేపట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. నీట్‌లో అక్రమాల కారణంగా కష్టపడి చదివిన తెలంగాణ విద్యార్థులకు నష్టం జరిగితే చూస్తూ ఊరుకోమని, వారి తరఫున బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని వెల్లడించారు. ప్రతిసారి పరీక్షాపే చర్చ కార్యక్రమాన్ని చేపట్టే మోదీ.. నీట్‌పై పలు ఆరోపణలు, అనుమానాలు వ్యక్తమవుతున్నా.. దానిపై మాట్లాడకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ మొత్తం వ్యవహారంలో సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై కఠినచర్యలు చేపట్టి లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు కేంద్రం భరోసా ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఎన్నడూలేని విధంగా నీట్‌లో ఏకంగా 67 మందికి ఫస్ట్ ర్యాంక్ రావడం పలు అనుమానాలకు తావిస్తోందని, ఒకే సెంటర్ నుంచి ఎనిమిది మంది విద్యార్థులు 720 మార్కులు సాధించడం చూస్తే.. పేపర్ లీకేజీ వ్యవహారం ఏ స్థాయిలో జరిగిందో అర్థమవుతోందన్నారు. ఒక్క మార్కు తేడాతోనే విద్యార్థుల ర్యాంకులు మారిపోతాయని, ఎంతోమంది అవకాశాలు కోల్పోతారని గుర్తుచేశారు. అలాంటిది.. ఒకే సెంటర్‌లో ఇంతమంది విద్యార్థులకు పెద్దమొత్తంలో మార్కులు రావడం ఎలా సాధ్యమైందని ప్రశ్నించారు. అలాగే ఫలితాలను 10 రోజులు ముందుకు జరిపి సరిగ్గా ఎన్నికల ఫలితాలరోజే ప్రకటించడం అనేక సందేహాలకు తావిస్తోందన్నారు. నీట్‌లో గ్రేస్ మార్కుల అంశమే కాకుండా ప్రశ్నపత్రం లీకైనట్లు వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. తెలంగాణ విద్యార్థులకు ఎలాంటి అన్యాయం జరగకుండా ఉండేందుకు మన రాష్ట్ర ఎంపీలు చర్యలు చేపట్టాలని కోరారు.

6 నెలల్లో శాంతి భద్రతలు అస్తవ్యస్తం..

రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు వచ్చిన ఆరు నెలల్లోనే శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని 'ఎక్స్' వేదికగా కేటీఆర్ ఆరోపించారు. కేసీఆర్ సీఎంగా కొనసాగిన తొమ్మిదిన్నరేళ్ల పాలనలో ఎలాంటి మత కలహాలు జరగలేదని గుర్తు చేశారు. మెదక్‌లో జంతువధ విషయంలో జరిగిన గొడవకు సంబంధించిన ఓ వీడియోను ఈ సందర్భంగా ఆయన షేర్ చేశారు.

కేసీఆర్‌కు వ్యవస్థపై నమ్మకం లేదు

జ్యుడీషియల్ కమిషన్ ఛైర్మన్‌కు విచారణ చేసే చట్టబద్ధత లేదనడం సరికాదు: భట్టి

» కేసీఆర్‌కు భయం పట్టుకుంది: జీవన్‌రెడ్డి

» విచారణను తప్పించుకోవాలనే..: నిరంజన్



జగిత్యాల/బోనకల్/హైదరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కొనుగోళ్లకు సంబంధించి మాజీ విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి అసెంబ్లీలో కోరినట్లుగానే న్యాయ విచారణ కమిషన్‌ను వేశామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. స్వతంత్ర వ్యవస్థగా విచారణ చేస్తున్నందు వల్ల అందులో ఎవరి జోక్యం ఉండదని తెలిపారు. జ్యుడీషియల్ కమిషన్ ఛైర్మన్‌కు విచారణ చేసే చట్టబద్ధత లేదని మాజీ సీఎం కేసీఆర్ వ్యాఖ్యానించడం.. ఆయనకు న్యాయ వ్యవస్థపై నమ్మకం లేదన్న భావనను కలిగిస్తోందన్నారు. ఇది రాచరిక వ్యవస్థ కాదన్న విషయం కేసీఆర్ గుర్తుంచుకోవాలని చెప్పారు. ఖమ్మం జిల్లా బోనకల్ మండలంలోని మోటమర్రి, పెద్దబీరవల్లి, తూటికుంట్ల గ్రామాల్లో ఆదివారం పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేస్తామని, ప్రజలకు జవాబుదారీతనంతో కూడిన పాలన అందిస్తామని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో ధరణి పోర్టల్‌ను ప్రవేశపెట్టి కొందరు పెద్దలకు ప్రభుత్వ భూములను కట్టబెట్టే వెసులుబాటును కల్పించారని ఆరోపించారు. భూమిశిస్తుతో పాటు జమాబందీ నిర్వహించకుండా రెవెన్యూ వ్యవస్థను అస్తవ్యస్తంగా మార్చారన్నారు. గ్రామాల్లో తాము రెవెన్యూ సదస్సులను నిర్వహించి వ్యవస్థను గాడిలో పెడతామన్నారు. కాగా, జస్టిస్ నరసింహారెడ్డి ఏం నివేదిక ఇస్తారోనని మాజీ సీఎం కేసీఆర్‌కు భయం పట్టుకుందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. అందుకే ఉత్తర, దక్షిణ తెలంగాణ అంటూ కొత్త నాటకాన్ని తెరపైకి తెస్తున్నారని మండిపడ్డారు. జగిత్యాలలో ఆయన మాట్లాడుతూ విద్యుత్తు ఉత్పాదన ప్రాజెక్టులన్నీ ఉత్తర తెలంగాణలోనే ఉన్నాయని, అందుకే రామగుండంలో నెలకొల్పాల్సిన ప్రాజెక్టును దక్షిణ తెలంగాణలోని దామరచర్లలో ఏర్పాటు చేయాల్సి వచ్చిందంటూ కేసీఆర్ చేస్తున్న వాదన అర్థం లేనిదని కొట్టిపారేశారు. కమిషన్‌పై ఆరోపణలు చేయడం, న్యాయవ్యవస్థను కించపరిచినట్లేనని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై దర్యాప్తు జరుపుతున్న జస్టిస్ ఘోష్ నుంచి విచారణను తప్పించుకునే ఎత్తుగడలో భాగంగానే కేసీఆర్ జస్టిస్ నర్సింహారెడ్డికి లేఖ రాశారని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు జి.నిరంజన్ ఆరోపించారు. జస్టిస్ నర్సింహారెడ్డిని విచారణ నుంచి తప్పుకోవాలనడం కేసీఆర్ అహంభావానికి నిదర్శనమన్నారు. కేసీఆర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జస్టిస్ నర్సింహారెడ్డిని తప్పు పట్టడమంటే విద్యుత్తు ఒప్పందాలపై అవకతవకలు జరిగినట్లేనని స్పష్టమవుతోందని టీపీసీసీ లీగల్ సెల్ వైస్‌ఛైర్మన్ ఉమాశంకర్ అన్నారు. విచారణకు హాజరు కాకుండా సాకులు వెదకడంలోని ఆంతర్యమేంటని ప్రశ్నించారు. కాగా, జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ లేవనెత్తిన అంశాలకు మాజీ సీఎం కేసీఆర్ వివరణ ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. రాజకీయ కక్ష సాధింపు కోసమే విద్యుత్తు కొనుగోళ్లపై విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేశారని కేసీఆర్ ఎదురుదాడికి దిగడం సహేతుకంకాదని అభిప్రాయపడ్డారు.

20 నుంచి 'గ్రూప్-4' సర్టిఫికెట్ల పరిశీలన

హైదరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-4 కొలువుల నియామక ప్రక్రియను టీజీపీఎస్సీ వేగవంతం చేసింది. 8,039 పోస్టుల భర్తీకి గాను 2022లో గ్రూప్-4 నోటిఫికేషన్ విడుదలవ్వగా.. గత ఏడాది జూలై 1న పరీక్షలు నిర్వహించారు. గత వారం ఒక్కో పోస్టుకు ముగ్గురిని ఎంపిక చేస్తూ వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. వీరి సర్టిఫికెట్లను ఈ నెల 20 నుంచి ఆగస్టు 21 వరకు నాంపల్లిలోని టీజీపీఎస్సీ కార్యాలయం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ ప్రాంగణాల్లో పరిశీలించనున్నట్లు టీజీపీఎస్సీ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. అభ్యర్థుల హాల్‌టికెట్ నంబర్లు, వెరిఫికేషన్ తేదీల వివరాలు టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నట్లు పేర్కొంది. అభ్యర్థులు చెక్‌లిస్టు ప్రకారం సర్టిఫికెట్లను, అప్లికేషన్ ఫారానికి సంబంధించిన రెండు కాపీలు, రెండు అటెస్టేషన్ ఫారాల(కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి)ను తీసుకురావాలని సూచించింది.

మక్కాలో చివరి అంకానికి హజ్ యాత్ర

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

గల్ఫ్ దేశాల్లో ఆదివారం ఈద్ అద్హా (బక్రీద్) జరిగింది. మక్కా హజ్ యాత్రలో కీలకమైన దెయ్యానికి రాళ్లు కొట్టే రమ్మీ కార్యక్రమం మొదలై హజ్ తుది అంకానికి చేరుకుంది. దెయ్యానికి రాళ్లు కొట్టే ఈ కార్యక్రమం మూడు రోజుల పాటు జరుగుతుంది. హజ్ యాత్రలో అత్యంత కీలకమైన ఈ ఘట్టంలో తొక్కిసలాట జరుగకుండా చర్యలు తీసుకుంటున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 1.80 కోట్ల మందికి పైగా హజ్ యాత్రలో పాల్గొంటున్నట్లుగా సౌదీ అరేబియా అధికారులు వెల్లడించారు. కృత్రిమ మేధస్సు డ్రోన్ల సాయంతో హజ్‌లో అక్రమాలు జరుగకుండా అధికారులు చర్యలు చేపట్టారు. ఈ ఏడాది హజ్ యాత్రలో భారతదేశం నుంచి 1.75 లక్షల మంది యాత్రికులు పాల్గొంటుండగా ఇందులో తెలుగు రాష్ట్రాల నుంచి 10,819 మంది ఉన్నారు. కాగా, యాత్రలో భాగంగా బస్సు ఎక్కే యత్నంలో హైదరాబాద్ వాసి మరణించగా మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాలకు చెందిన మరో ఇద్దరు వడదెబ్బతో చనిపోయారు. కాగా, హజ్ యాత్ర చేయడం అమితానందాన్ని కలిగిస్తోందని తెలంగాణకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు మోహమ్మద్ సమీయోద్దీన్ పేర్కొన్నారు.

ఎవరి అభ్యంతరాలు వారికుంటాయి

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. కేసీఆర్ చెప్పిన విషయాలను నిపుణుల కమిటీతో చర్చించాల్సి ఉందన్నారు. ఏ అంశంపైనైనా ఎవరి అభ్యంతరాలు వారికి ఉండటం సహజమని అన్నారు. కేసీఆర్ చెప్పిన వివరాలను వాస్తవాలతో సరిపోల్చవలసి ఉంటుందని, ఇందులో వాస్తవాలపై బీహెచ్ఈఎల్ ప్రతినిధులను కూడా వివరాలు అడుగుతామని చెప్పారు దీనిపై మంగళవారం సమీక్షించి విశ్లేషణ జరుపుతామని, దానికి అనుగుణంగానే తదుపరి చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. ఎవరికైనా తమ అభిప్రాయాలను చెప్పే స్వేచ్ఛ నిస్సందేహంగా ఉంటుందని, మాజీ సీఎం తెలిపిన అభ్యంతరాలపై పునఃపరిశీలన జరుపుతామని జస్టిస్ నరసింహారెడ్డి వ్యాఖ్యానించారు. విచారణాంశాలను మీడియాకు వెల్లడించారన్న అంశంపై స్పందిస్తూ.. తాను జరిగిన పరిణామాలను మాత్రమే మీడియా ముఖంగా వివరించానని చెప్పారు.

విచారణకు ముందే మీడియాకు ఎలా చెబుతారు?

» జస్టిస్ నరసింహారెడ్డి మారిపోయారు: జగదీశ్ రెడ్డి

హైదరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్తు ఒప్పందాలపై విచారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం వేసిన జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ వాస్తవాలు పక్కన పెట్టి.. కాంగ్రెస్, బీజేపీ నేతల అభిప్రాయాలను చెబుతోందని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. విచారణకు ముందే ఈనెల 11న మీడియా సమావేశంలో విద్యుత్తు ఒప్పంద అంశాలపై మాట్లాడటం తగదన్నారు. ఈ నెల 30వరకు గడువు కోరినా.. అనుమతివ్వకుండా 15న వివరణ ఇవ్వాలని మాజీ సీఎం కేసీఆర్‌కు నోటీసులు పంపడం సరికాదని పేర్కొన్నారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కమిషన్ ఇచ్చిన గడువు ప్రకారం సమాధానం ఇవ్వాలని అనుకున్నామని, అంతకుముందే ఆయన మీడియాతో ఈ అంశంపై మాట్లాడటం వల్లే మాజీ సీఎం కేసీఆర్ కమిషన్‌కు లేఖ రాశారన్నారు. ఒకప్పుడు తెలంగాణ వ్యక్తిగా ఉన్న జస్టిస్ నరసింహారెడ్డి ఇప్పుడు చాలా మారిపోయారని, చీకట్లో ఉన్న తెలంగాణను వెలుగుల తెలంగాణగా మార్చిన కేసీఆర్‌పై కనీస సానుభూతి చూపడంలేదన్నారు. విద్యుత్ కొనుగోళ్లలో తెలంగాణ ప్రభుత్వానికి ఎక్కడా నష్టం జరగలేదని, ఆ విషయంలో ఏ విచారణకైనా తాము సిద్ధమని జగదీశ్ రెడ్డి పేర్కొన్నారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్ : సీఎం, గవర్నర్

» నేడు ఈద్ ఉల్ అధా

హైదరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): త్యాగానికి ప్రతీకగా జరుపుకునే బక్రీద్ (ఈద్ ఉల్ అధా) పండుగ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రవక్తల అచంచలమైన దైవ భక్తి, త్యాగ నిరతికి బక్రీద్ పండుగ అద్దం పడుతుందని, జీవితంలో ఎదురయ్యే సమస్యలకు భయపడకుండా, దేవునిపై విశ్వాసంతో సన్మార్గంలో జీవనం సాగించాలనే గొప్ప సందేశాన్ని బక్రీద్ ఇస్తోందన్నారు. తమకు ఉన్న దాంట్లో నుంచే ఇతరులకు పంచిపెట్టడాన్ని మించిన దాతృత్వం మరొకటి లేదనే స్ఫూర్తిని చాటిచెపుతుందని పేర్కొన్నారు. మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ధనసరి అనుసూయ సీతక్క తదితరులు ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. బక్రీద్ పండుగ సందర్భంగా రాష్ట్రంలోని ముస్లింలందరికి గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ శుభాకాంక్షలు తెలిపారు. సోదరభావం, త్యాగం, దైవభక్తి, స్ఫూర్తిని కలిగించేలా ముస్లిం సోదరులు శాంతియుత వాతావరణంలో పండుగ జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ముస్లిం సోదరులకు బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

నేడు టీజీటీఏ రాష్ట్ర కార్యవర్గ సమావేశం

హైదరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్(టీజీటీఏ) రాష్ట్ర కార్యవర్గ సమావేశం సీసీఎల్ఏ ప్రాంగణంలోని టీజీటీఏ కేంద్ర కార్యాలయంలో సోమవారం జరగనుంది. ఈ మేరకు టీజీటీఏ ఓ ప్రకటన ఇచ్చింది. ఈ సమావేశంలో తహశీల్దార్ల బదిలీలు, తహశీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లగా పదోన్నతులు, పెండింగ్‌లో ఉన్న అద్దె వాహనాల బిల్లులు, ఇతర బిల్లుల మంజూరు, అద్దె వాహనాల చార్జీల పెంపు, కొత్త మండలాల్లోని తహశీల్దార్లు, సిబ్బందికి వేతనాల మంజూరు, కొత్త మండలాల్లో క్యాడర్ స్ట్రెంత్ మంజూరు, ధరణి పోర్టల్, రెవెన్యూ పరిపాలన బలోపేతం, రెవెన్యూ కోర్టులు, అప్పిలేట్ అథారిటీల ఏర్పాటు వంటి అంశాలతో పాటు సభ్యులు లేవనెత్తే అంశాలపైనా చర్చ జరపనున్నట్లు తెలిపింది.

కౌన్సెలింగ్ ద్వారా సాధారణ బదిలీలు చేపట్టాలి

» తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల అసోసియేషన్

హైదరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): దశాబ్ద కాలంగా చేపట్టకుండా ఉన్న సాధారణ బదిలీలను కౌన్సెలింగ్ పద్ధతిలో నిర్వహించాలని తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం నాంపల్లి గృహకల్పలోని గెజిటెడ్ భవన్‌లో రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ఏకగ్రీ తీర్మానాలు చేశారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని, ప్రభుత్వం, ఉద్యోగుల కాంట్రిబ్యూషన్ సమాన నిష్పత్తిలో ఉద్యోగుల ఆరోగ్య పథకం అమలు చేయాలని, పాత పెన్షన్ స్కీం పునరుద్ధరించాలని, పెండింగ్ బిల్లులను చెల్లించాలని, ఏపీకి కేటాయించిన 144 మంది ఉద్యోగుల ఫైల్‌ను వెంటనే అమలు పరుచాలని, జీవో 317పైన తలెత్తిన సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు మొత్తం 17 డిమాండ్లను పరిష్కరించాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ సమవేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, 33 జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

24 నుంచి హాస్టల్ వార్డెన్ పరీక్షలు

» 581 ఖాళీ పోస్టుల భర్తీకి గతంలోనే నోటిఫికేషన్

హైదరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 24 నుంచి 29 వరకు హాస్టల్ వార్డెన్ పరీక్షలు నిర్వహించాలని టీజీపీఎస్సీ అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేశారు. రోజూ ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు.. మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు సీబీటీ పద్ధతిలో పరీక్షలు జరుగుతాయి. బీసీ సంక్షేమ హాస్టళ్లు, గిరిజన సంక్షేమ హాస్టళ్లు గ్రేడ్-1, గ్రేడ్-2 వార్డెన్ పోస్టులతో పాటు, మాట్రన్, మహిళా సూపరింటెండెంట్ వంటి 581 ఖాళీ పోస్టుల భర్తీకి గతంలో నోటిఫికేషన్ ఇచ్చారు.

మెదక్ అల్లర్ల బాధ్యులను వదిలిపెట్టం

» ఐజీ రంగనాథ్, ఎస్పీ బాలస్వామి వెల్లడి

» మెదక్ బంద్ ప్రశాంతం.. భారీ బందోబస్తు

మెదక్ అర్బన్, జూన్ 16: మెదక్‌లో శనివారం అల్లర్లకు పాల్పడిన వారిలో 45 మందిని గుర్తించామని, వీరిలో ఒక వర్గానికి చెందిన 23 మంది, మరో వర్గానికి చెందిన 22 మంది ఉన్నారని మల్టీజోన్-1 ఐజీ ఏవీ రంగనాథ్ తెలిపారు. ఆదివారం ఆయన పట్టణ పోలీస్ స్టేషన్‌లో మీడియాతో మాట్లాడారు. కొంత మంది స్వార్థమే అల్లర్లకు కారణమని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఛత్తీస్‌గఢ్, ఒడిసా నుంచి గోవులను అక్రమంగా గోవులను తెస్తున్న వారిపై కేసులు నమోదు చేశామని, గోవులను గోశాలకు పంపుతున్నామన్నారు. కాగా, అల్లర్ల కేసులో బాధితుల ఫిర్యాదుపై పోలీసులు 21 మందిని అరెస్టు చేసినట్టు ఎస్పీ బాలస్వామి తెలిపారు. ఒక వర్గానికి చెందిన 12మంది, మరో వర్గానికి చెందిన 9 మందిపై 8 కేసులు నమోదు చేశామన్నారు. వారిని కోర్టులో హాజరుపరచగా.. 14 రోజుల రిమాండ్ విధించారని చెప్పారు. పరారీలో ఉన్న నిందితులను పట్టుకోవడం కోసం 8 ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామన్నారు.

మెదక్ బంద్ ప్రశాంతం

బీజేపీ, అనుబంధ సంఘాల పిలుపు మేరకు ఆదివారం మెదక్‌లో బంద్ ప్రశాంతంగా ముగిసింది. దాడులు, పోలీసుల వైఫల్యాన్ని నిరసిస్తూ బీజేపీ, బీజేవైఎం, వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ పట్టణ బంద్‌కు పిలుపునిచ్చాయి. వ్యాపార, వాణిజ్య సంస్థలను స్వచ్ఛందంగా మూసివేశారు.

కారకులపై చర్యలు తీసుకోవాలి: సంజయ్

హైదరాబాద్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): సమాజంలో అశాంతి సృష్టించేలా ఎవరు వ్యవహరించినా వారిపై చర్యలు తీసుకోవాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సూచించారు. మెదక్‌లో ఇరు వర్గాల పరస్పర దాడుల గురించి ఆయన ఆరా తీశారు. తెలంగాణ పోలీసు ఉన్నతాధికారులకు ఫోన్ చేసి పూర్వాపరాలు అడిగి తెలుసుకున్నారు. పోలీసులు బాధితుల పక్షాన నిలబడటమే కాకుండా తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. బాధితులపై అక్రమ కేసులు బనాయించడం, అమాయకులను ఇబ్బంది పెట్టడం చేయొద్దన్నారు. పోలీసులు తీసుకునే చర్యల ఆధారంగానే పరిస్థితులు చక్కబడతాయన్నారు.



అల్లర్ల నేపథ్యంలో రాజాసింగ్ అదుపులోకి..

శంషాబాద్ రూరల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మెదక్‌లో చోటుచేసుకున్న అల్లర్ల నేపథ్యంలో పోలీసులు గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఆయన మెదక్ వెళ్తున్నట్లు సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీంతో ఆయన ఆదివారం ఉదయం ముంబై నుంచి శంషాబాద్ విమానాశ్రయం చేరుకోగానే ఆర్జీఐఏ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తాను మెదక్ వెళ్లడం లేదని, మియాపూర్‌లోని ఆస్పత్రిలో ఉన్న బాధితులను పరామర్శించేందుకు వెళ్తున్నానని రాజాసింగ్ చెప్పారు. దానికి మొదట పోలీసులు నసేవిరా అన్నా చివరకు ఆస్పత్రికి వెళ్లేందుకు అనుమతిచ్చారు. ఆయన వెంట పోలీసులు కూడా వెళ్లారు. అక్కడ నుంచి ఆయన్ను ఇంటికి తీసుకెళ్లారు. తాను మెదక్‌కు వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవడంపై రాజాసింగ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. త్వరలోనే తాను మెదక్‌లో పర్యటించి బాధితులను పరామర్శిస్తానని 'ఆంధ్రజ్యోతి'తో చెప్పారు.

రుణమాఫీ కటాఫ్ ఖరారు!

(మొదటి పేజీ తరువాయి)

తీసుకోనున్నారు. మాఫీ ప్రక్రియలో రైతులకు ఏవైనా ఇబ్బందులు కలిగినా, అర్హత కలిగి ఉండి ఏ కారణాల వల్లనైనా రుణమాఫీ అందకపోయినా.. ఆయా రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ప్రత్యేకంగా గ్రీవెన్స్ సెల్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ ఫిర్యాదుల స్వీకరణ సెల్‌కు కొంతమంది అధికారులను కేటాయిస్తారు. వారు సంబంధిత బ్యాంకులతో మాట్లాడి రైతులకు రుణమాఫీ అందేలా చర్యలు తీసుకుంటారు.

భారమైనా.. బాధ్యతగా!

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న రుణాలను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం మాఫీ చేయనుంది. 2014లో తొలిసారి అధికారం చేపట్టిన బీఆర్ఎస్.. ఎన్నికల సమయంలో రైతులకు రూ.లక్ష చొప్పున రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చింది. ఇందుకోసం 2014 ఏప్రిల్ 1 నుంచి 2018 డిసెంబరు 11 వరకు కటాఫ్ తేదీగా పేర్కొంది. అయితే ఏడాదికి రూ.25 వేల చొప్పున నాలుగేళ్లలో రూ.లక్ష మాఫీ చేస్తామని చెప్పినా.. పూర్తిస్థాయిలో అమలు చేయలేకపోయింది. దీంతో దాదాపు రూ.8,500 కోట్ల రుణాలు పెండింగ్‌లో ఉండిపోయాయి. కాగా, గతేడాది డిసెంబరులో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. రైతులకు రూ.2 లక్షల మేర రుణమాఫీని ఒకే దఫాలో చేస్తామని హామీ ఇచ్చింది. ఈ మేరకు రైతుల వివరాలు సేకరించింది. ఇందులో.. గత ప్రభుత్వం పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయకపోవడంతో చాలా మంది రైతులకు మాఫీ అందలేదని తేలింది. దీంతో కటాఫ్ తేదీ విషయంలో పలుమార్లు చర్చించిన అనంతరం.. ప్రభుత్వానికి భారమైనప్పటికీ 2018 నుంచి రుణాలు తీసుకున్న రైతులకు రూ.2లక్షల మేర మాఫీ చేయాలని నిర్ణయించింది. నిజానికి 2022 లేదా 2023 సంవత్సరం నుంచి రుణాలు తీసుకున్నవారికే పథకాన్ని వర్తింపజేస్తామని చెబితే ప్రభుత్వానికి ఆర్థికంగా చాలా ఉపశమనం లభిస్తుంది. కానీ, రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉండాలన్న లక్ష్యంలో భాగంగా.. ఆర్థికంగా భారమైనా గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న రుణాలను కూడా మాఫీ చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం అన్ని బ్యాంకుల నుంచి రైతుల వివరాలను కూడా ఇప్పటికే సేకరించింది.



విడతలుగా కాకుండా.. ఒకేసారి మాఫీ

రుణమాఫీని విడతల వారీగా కాకుండా ఒకేసారి చేసే యోచనలో ప్రభుత్వం ఉంది. బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్కో విడతకు రూ.25 వేల చొప్పున నాలుగు విడతల్లో రూ.లక్ష మాఫీ చేసినప్పటికీ పలు ఇబ్బందులు తలెత్తాయి. అసలు రుణంలో నుంచి కొంత మొత్తాన్ని మాఫీ చేయగా, మిగిలిన రుణానికి వడ్డీ పడింది. దాంతో ప్రభుత్వం చెల్లించింది కేవలం వడ్డీలకే సరిపోయింది తప్ప.. రైతులకు పెద్దగా న్యాయం జరగలేదు. దీనిపై అనేక విమర్శలు వచ్చాయి. ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2లక్షల రుణాన్ని ఒకే దఫాలో మాఫీ చేయాలని యోచిస్తోంది. అప్పుడే రైతులకు న్యాయం జరుగుతుందనే అభిప్రాయంలో ఉంది. ఇక, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్ పథకంలో అనర్హులుగా ఉన్నవారికి రుణమాఫీ అందించాలా? లేదా? అన్నదానిపై కూడా చర్చలు జరుగుతున్నాయి. ప్రస్తుతం పీఎం కిసాన్‌లో కేంద్ర ప్రభుత్వం అందించే సాయం.. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలతోపాటు ఆదాయపు పన్ను చెల్లించేవారికి అందడంలేదు. దీంతో రుణమాఫీ విషయంలోనూ అదే విధానాన్ని అమలు చేస్తే ఎలా ఉంటుందన్న విషయాన్ని పరిశీలిస్తోంది. వీటన్నింటిపైనా కేబినెట్‌లో చర్చించి విధివిధానాలు ఖరారు చేయనుంది.


'ఊళ్లు-నీళ్లు-కన్నీళ్లు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జస్టిస్ సుదర్శన్ రెడ్డి.. చిత్రంలో ప్రొఫెసర్ కోదండరాం, జయధీర్ తిరుమల రావు, సారంపల్లి మల్లారెడ్డి తదితరులు

మాఫియా రాజ్య పునాది.. మల్లన్న సాగర్

» నిర్వాసితుల గోస చూసి దుఃఖం ఆగలేదు

» సుప్రీం విశ్రాంత న్యాయమూర్తి సుదర్శన్ రెడ్డి

» ప్రాజెక్టుతో ప్రజల ప్రాణాలకు ముప్పు: కోదండరాం

హైదరాబాద్ సిటీ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మాఫియా సామ్రాజ్య నిర్మాణానికి పునాది మల్లన్న సాగర్ ప్రాజెక్టు అని సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి సుదర్శన్ రెడ్డి అన్నారు. మల్లన్నసాగర్ నిర్వాసితుల వ్యథను వివరిస్తూ సీనియర్ జర్నలిస్టు రేమిల్ల అవధాని రాసిన 'ఊళ్లు-నీళ్లు-కన్నీళ్లు' పుస్తకాన్ని ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పుస్తకం చదువుతుంటే దుఃఖం ఆగలేదని తెలిపారు. రాజ్యాంగ బద్ధమైన పాలన ఎలా ఉండకూడదో కాళేశ్వరం పునాదితోనే ప్రారంభమైందని అన్నారు. గుప్పెడుమంది కలిసి వ్యవస్థలను, సంస్థలను ఆధీనంలోకి తీసుకొని సాగించిన పరిపాలనకు నిదర్శనం మల్లన్నసాగర్ అని ఆక్షేపించారు. మల్లన్నసాగర్ బాధితులకు న్యాయం జరగాలని ఆకాంక్షించారు. "భూకంపాలు రావడానికి అవకాశమున్న ప్రాంతంలో ప్రాజెక్టు కట్టారు. ఏదైనా జరిగితే 5 లక్షల మంది ప్రాణాలు పోతాయని నిపుణులు హెచ్చరించినా గత పాలకులు వినలేదు" అని ప్రొఫెసర్ కోదండరాం ఆందోళన వ్యక్తం చేశారు. భూసేకరణ చట్టానికి అనేక తూట్లు పొడిచిన కేసీఆర్ ప్రభుత్వం మూడు లక్షల ఎకరాలను లాక్కుందని విమర్శించారు. మేడిగడ్డను అలా వదిలేసి ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును చేపట్టడం మంచిదని రైతు సంఘం నాయకుడు సారంపల్లి మల్లారెడ్డి సూచించారు. మల్లన్నసాగర్ నిర్వాసితులకు మార్కెట్ ధర ప్రకారం డబ్బులివ్వాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి మాటున సాగిన విధ్వంసాన్ని ఈ పుస్తకం ద్వారా కళ్లకు కట్టారని ఆచార్య జయధీర్ తిరుమల రావు అన్నారు.

జోరుగా నకిలీ మందుల దందా

(మొదటి పేజీ తరువాయి)

అసలు మందుకు బదులు వేరే ఔషధాన్ని నింపుతున్నారు. కొద్ది రోజుల కిందట ఔషధ నియంత్రణ అధికారుల దాడుల్లో ఓ కంపెనీకి చెందిన అమోక్సిలిన్ బదులు పారాసిటమాల్ ఉంచి విక్రయిస్తున్నట్లు బయటపడింది. అలాగే ఔషధాల తయారీలో వినియోగించే రసాయనాలను సమపాళ్లలో కలపడం లేదు. ఇటువంటి ఔషధాలతో ఆరోగ్యం మరింత దెబ్బతింటోంది. రాష్ట్ర ఔషధ నియంత్రణ మండలి అధికారులు ఇటీవల పెద్ద ఎత్తున దాడులు నిర్వహిస్తున్నారు. ఈ తనిఖీల్లో నాణ్యత లేనివి, నకిలీ మందులు ఉత్తరాది రాష్ట్రాల నుంచి వస్తున్నట్లు గుర్తించారు. ముఖ్యంగా హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, ఘజియాబాద్, ఖాసీపూర్, ఉత్తరప్రదేశ్ నుంచి హైదరాబాద్‌కు నకిలీ ఔషధాలు వస్తున్నాయి. గతేడాది డిసెంబరు నుంచి ఇప్పటిదాకా రూ.కోట్ల విలువైన నకిలీ ఔషధాలను డీసీఏ అధికారులు పట్టుకున్నారు.

నకిలీ మందులను ఇలా గుర్తించండి..

గతంలో ఒక మెడిసిన్‌ను వాడి ఉన్నట్లు అయితే.. ప్రస్తుతం మెడికల్ షాపులో తెచ్చిన మందుపై ఏమైనా అనుమానం ఉంటే.. మొదట వాడిన మెడిసిన్ స్ట్రిప్‌తో పోల్చి చూడాలి. అలాగే స్పెల్లింగ్ కూడా ఒకటి, రెండు అక్షరాలతో అసలు కంపెనీని పోలి ఉండేలా నకిలీవి ఉంటున్నాయి. కేంద్రం ఔషధాలకు సంబంధించి 300 బ్రాండ్ మెడిసిన్‌ను నోటిఫై చేసి, వాటికి బార్, క్యూఆర్ కోడ్‌ను ఇచ్చింది. ఆ బ్రాండ్స్ జాబితాను రాష్ట్ర ఔషధ నియంత్రణ మండలి వెబ్‌సైట్‌లో ఉంచింది. మందులతో అనారోగ్య సమస్యలు, అలర్జీ, ఇతర దుష్ప్రభావాలు కనిపిస్తే వాటిని అనుమానించాలి. ఇంటర్నెట్ ప్లాట్‌ఫామ్స్ నుంచి మందులను కొనొద్దు. లైసెన్స్ పొందిన మెడికల్ షాపుల నుంచే ఔషధాలు కొనాలి.

సర్కారు సీరియస్ ..

నకిలీ, నాసిరకం ఔషధాలపై సర్కారు సీరియస్‌గా ఉంది. 2015 నుంచి 2022 మధ్య రాష్ట్ర వ్యాప్తంగా అధికారులు 24,781 నమూనాలను సేకరించారు. ఇందులో 24,532 శాంపిల్స్ నాణ్యమైనవిగా తేలింది. 249 ఔషధాలు నాణ్యత లేనివిగా గుర్తించారు. 2023లో రాష్ట్రవ్యాప్తంగా 4,127 ఔషధ నమూనాలను సేకరించారు. అందులో 78 నాణ్యత లేనివి, 59 మిస్ బ్రాండెడ్ ఉన్నాయి. టీఎస్ఎంఎస్ఐడీసీ సరాఫరా చేస్తున్న ఔషధాల్లో కూడా పది నమూనాలు నాణ్యతా పరీక్షలో ఫెయిలయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 9 పోలీసు కేసులను నమోదు చేశారు. నకిలీ మందుల విషయం పౌరులకు తెలిస్తే ఔషధ నియంత్రణ మండలి టోల్ ఫ్రీ నంబరు 18005996969కు కాల్ చేయవచ్చు.

రాష్ట్రంలో ఫార్మా రంగం స్థూలంగా ఇలా..

బల్క్ డ్రగ్ యూనిట్స్- 183; ఫార్ములేషన్స్ యూనిట్స్- 159; హ్యూమన్ వ్యాక్సినేషన్స్ తయారీ యూనిట్స్ 10; మెడికల్ డివైజ్ యూనిట్స్-35; ఇన్‌విట్రో డయాగ్నస్టిక్స్- 8; డ్రగ్ పెల్లెట్స్-47; ఆర్-డీఎన్ఏ డిరైవ్డ్ డ్రగ్స్-5; బ్లడ్ ప్రొడక్ట్స్ యూనిట్స్-3; కాస్మెటిక్స్- 25; వెటర్నరీ వ్యాక్సిన్స్/డిస్‌ఇన్ఫెక్ట్స్, శానిటైజర్స్ మెడికల్ గ్యాస్ యూనిట్స్ ఇతరత్రా కలిపి-224; మొత్తం యూనిట్ల సంఖ్య -702; రిటైల్, హోల్‌సేల్ మెడికల్ షాపులు- 43,023.



పత్రికా భాషను ప్రజల భాషగా మార్చారు

» తెలుగును ప్రేమించి, అభిమానించి, పోషించిన వ్యక్తి రామోజీరావు

» 'పాత్రికేయ శిఖరం రామోజీరావుకు అక్షరాంజలి'లో వక్తలు

» రాజీపడని వ్యక్తి : ఈటల


ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి

పంజాగుట్ట/హైదరాబాద్ సిటీ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తెలుగు జర్నలిజానికి జాతీయ స్థాయిలో పేరుప్రఖ్యాతులు రావడానికి కృషి చేసిన వ్యక్తి రామోజీరావు అని వక్తలు కొనియాడారు. ఆయన నికార్సయిన జర్నలిస్టు అన్నారు. క్రమశిక్షణ, సమయపాలనకు పెట్టింది పేరని.. తెలుగును ప్రేమించి, అభిమానించి, పోషించిన వ్యక్తి అని ప్రశంసించారు. ప్రెస్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'పాత్రికేయ శిఖరం రామోజీరావుకు అక్షరాంజలి' పేరుతో ఈనాడు సంస్థల దివంగత చైర్మన్ రామోజీరావు సంతాప సభ జరిగింది. రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, విజయనగరం ఎంపీ కె.అప్పలనాయుడు, సీనియర్ పాత్రికేయులు కె.రామచంద్రమూర్తి, అల్లం నారాయణ, వీఎస్ఆర్ శాస్త్రి, డీఎన్ ప్రసాద్, ఎం.నాగేశ్వరరావు, టి.కృష్ణమూర్తి, కార్టూనిస్ట్ శ్రీధర్, జైపాల్‌రెడ్డి, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేణుగోపాల్ నాయుడు, సీనియర్ పాత్రికేయులు.. రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు తమ అనుభవాలను పంచుకున్నారు. తెలుగు జర్నలిజానికి పేరు రావడానికి ఆద్యుడు రామోజీరావు అని కె.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆయన నిత్య కృషీవలుడు అని చెప్పారు. రామోజీరావు తెలుగు జర్నలిజాన్ని మారుమూల ప్రాంతాలకు తీసుకెళ్లారని.. పత్రిక భాషను ప్రజల, వాడుక భాషగా మార్చారని అల్లం నారాయణ అన్నారు. ఈనాడులో పరీక్ష రాస్తే ఎంపిక కాలేదని.. అయినా రోజూ కార్యాలయానికి వెళ్లే వాడినని, చివరికి స్ట్రింగర్‌గా చేరి రామోజీరావు చేతుల మీదుగా అవార్డు తీసుకున్నానని విజయనగరం ఎంపీ కె.అప్పలనాయుడు చెప్పారు. రామోజీరావు బహుముఖ ప్రజ్ఞాశాలి అని కె.రామచంద్రమూర్తి కొనియాడారు. తెల్లవారు జామున 4 గంటలకే ఆయన దినచర్య ప్రారంభమయ్యే రాత్రి పది గంటల వరకు నిర్విరామంగా కొనసాగేదని, రామోజీ జీవితంలో కొన్ని నేర్చుకుని, పాటించినా మంచి విజయాలు సాధించవచ్చని ఎం.నాగేశ్వరరావు అన్నారు. రామోజీరావు ఒక వ్యక్తి కాదు వ్యవస్థ, వటవృక్షం, ఆయన గురించి ఎంత చెప్పినా తక్కువేనని ఈటీవీలో పనిచేసిన వ్యాఖ్యాతలు, న్యూస్ రీడర్లు అన్నారు.

రాజీపడని వ్యక్తి రామోజీ: ఈటల

కష్టమొచ్చినా, నష్టమొచ్చినా రాజీ పడని వ్యక్తిత్వం రామోజీరావుదని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. రామోజీ ఫిలింసిటీలో ఆదివారం శైలజాకిరణ్‌తో పాటు కుటుంబసభ్యులను పరామర్శించారు. రామోజీరావు చిత్ర పటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడారు. తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఉన్నప్పుడు కూడా రామోజీరావు ఒక్కమాట నెగెటివ్‌గా మాట్లాడలేదన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.